- వీవీప్యాట్లపై నేడు సుప్రీం కోర్టు తీర్పు
- మే 7 వరకు కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు
- సౌత్ కొరియాలో బిడ్డను కంటే 61 లక్షలు!
- విమానంలో పేరెంట్స్ పక్కనే పిల్లలకు సీటు
- సూరత్ కాంగ్రెస్ అభ్యర్థి మిస్సింగ్!

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

బుధవారం WEDNESDAY 24.4.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 12+4+ 8 Pages NIPUNA supplement | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 320 ‖ వెల (Price) రూ.6.50 | పాడ్యమి

బుధవారం, సూర్యోదయం: 5-54, సూర్యాస్తమయం: 6-34. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్ర మాసం కృష్ణ పక్షం తిథి: పాడ్యమి పూర్తి. నక్షత్రం: స్వాతి రాత్రి 12-41 వరకు. వర్జ్యం: లేదు. రాహుకాలం: పగలు 12-13 నుంచి పగలు 1-48 వరకు. దుర్ముహూర్తం: పగలు 11-47 నుంచి పగలు 12-38 వరకు. అమృతకాలం: పగలు 3-04 నుంచి సాయంత్రం 4-49 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

దేవుళ్లపై ఒట్లు.. కేసీఆర్‌పై తిట్లు

ఇదేనా పరిపాలన అంటే?.. కేసీఆర్ రణ గర్జన

కాంగ్రెస్ చేతకానితనం.. తెలంగాణ ఆగమాగం..రైతులు విలవిల్లాడుతున్నరు

కాంగ్రెస్, బీజేపీ వికృత క్రీడ.. రాష్ట్రాన్ని నాశనం చేస్తమంటే సహించను

ఈ సారి కాంగ్రెస్‌కు గట్టిదెబ్బ తగిలి తీరుతుంది
ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 8 నుంచి 12 సీట్లు
బీజేపీకి పునాదుల్లేవ్.. ఒక్కసీటు గెలిస్తే గొప్ప
ఎన్నికల తర్వాత ఏం జరుగుతుందో చెప్పలేం
హిమాచల్, కర్ణాటకపై మోదీ బాంబు ఖాయం
ఆ వరుసలో తర్వాత వంతు తెలంగాణదే
అప్పుడు మేం ఏం చేస్తామో ఇప్పడే చెప్పను
ఎన్నికలెప్పుడొచ్చినా బీఆర్ఎస్ సర్కారు ఖాయం
కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అపనమ్మకం, అస్థిరత్వం
బీజేపీతో రేవంత్‌రెడ్డి లింక్‌పై అనుమానాలు
రేవంత్ ఇప్పటికీ దీన్ని ఎందుకు ఖండించడు
మాతో టచ్‌లో ఉన్న ఆ నేతపేరు చెప్పను
ఏపీలో జగనే గెలుస్తడని మాకు సమాచారం
బీఆర్ఎస్ పార్టీని ఎవరూ తుడిచిపెట్టలేరు..
మళ్లీ నేనే ముఖ్యమంత్రిని అవుతా: కేసీఆర్

బీఆర్ఎస్ శక్తి ప్రజల శక్తి.. ప్రజల బలం బీఆర్ఎస్ బలం.. తెలంగాణ ప్రజల పక్షాన బలంగా వాదించే పంజు బీఆర్ఎస్

- ఏం కోల్పోయారో ప్రజలు ఇప్పుడే తెలుసుకుంటున్నరు
- జనం లేక సీఎం సభలు అట్టర్‌ఫ్లాప్ అవుతున్నయ్
- కాకా, బాకా మీడియాది వికృతం, విశృంఖలత్వం
- కాంగ్రెస్‌వి అజ్ఞానంతో కూడిన బోగస్ శ్వేతపత్రాలు
- కరెంటు కొనుగోలుపై కాంగ్రెస్ పార్టీది తప్పుడు ప్రచారం
- దద్దమ్మలకు కాళేశ్వరం ప్రాజెక్టు విలువ తెలువదు
- మేడిగడ్డ లేకున్నా వానకాలంలో నీళ్లను ఎత్తిపోయొచ్చు
- ఉన్నవీ వాడుకోలేని అవివేక, అర్భక ప్రభుత్వమిది
- కేసీఆర్‌ను బద్నాం చేయాలనే తప్ప, సర్కారుకు తెలివి లేదు
- ఎల్అండ్‌టీ రిపేర్‌చేస్తామన్నా ప్రభుత్వం వద్దంటున్నది
- టెయిల్‌పాండ్ నుంచి ఏపీకి నీళ్లతరలిపోతున్నా దిక్కులేదు!
- ప్రజాపాలనలో అసెంబ్లీ ముందు గ్రిల్స్ ఎందుకొచ్చినయ్?
- బీఆర్ఎస్‌ను వీడినవాళ్లు.. తిరిగొస్తామని ఫోన్లు చేస్తున్నరు
- జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ భాగస్వామ్యం అనివార్యం
- బీఆర్ఎస్ పేరును టీఆర్ఎస్‌గా మార్చే అవకాశం లేదు.
- కార్యకర్తలూ మీరు కొట్లాడండి.. మీకు అండగా నేనున్నా
- దమ్ముంటే ప్రజా దరఖాస్తులపై శ్వేతపత్రం ఇవ్వండి
- ఓటుకు నోటు కేసులో పట్టుకున్నందుకే నాపై రేవంత్‌కు కక్ష
- సీఎం హుందాగా, బాధ్యతగా వ్యవహరించాలి: కేసీఆర్



కేసీఆర్ ఉన్నప్పుడు కరెంట్ ఎట్లుండె.. ఇప్పుడెట్లున్నది? కరెంట్‌పై నేను చెప్పింది నిజమైతేనే ఈ ఎన్నికల్లో మాకు ఓటెయ్యండి

కేసీఆర్ తెలంగాణ సాధకుడు.. కేసీఆర్ ఈజ్ హిస్టరీ ఆఫ్ తెలంగాణ. నోబడీ కెన్ వైప్ ఇట్. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తరా? ఇది సాధ్యమేనా? కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలంటే తెలంగాణను తీసేయాల్సిందే!

లిక్కర్ స్కామ్.. మోదీ పొలిటికల్ స్కీమ్
కవిత కడిగిన ముత్యంలా బయటకొస్తది

భారీగా అప్పులు చేసామన్నది పిచ్చివాదన
సంపన్న అమెరికాకూ అత్యధికంగా అప్పులు

ఎవరు దొర.. ఎవరిది దొరల పాలన?
మాది మానవీయం.. కాంగ్రెస్‌దే దొరతనం

నేను ఇంజినీర్‌ను కాదు.. ఆ భాష తెల్వదు
తెలంగాణ కోసం రీ డిజైన్‌కు సలహాలిచ్చిన

ఫోన్ ట్యాపింగ్‌పై థర్డ్ క్లాస్ ఆరోపణలు
నిఘా వ్యవహారాలతో సీఎంకు ఏం పని?

రాజకీయాల్లో వారసుడిని నిర్ణయించలేం

అసెంబ్లీకి వెళ్తా.. సర్కారును నిలదీస్తా: కేసీఆర్

మరికొద్ది గంటల్లో సుదీర్ఘ ఎన్నికల ప్రచారయాత్ర ప్రారంభం కానుండగా.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజలముందుకు వచ్చారు. రాష్ట్రంలో ఏం జరుగుతున్నదో, దాని వెనుక ఏం దాగున్నదో కుండబద్దలు కొట్టారు. 14ఏండ్ల తర్వాత టీవీ9 స్టూడియోకి వచ్చిన కేసీఆర్.. లైవ్ డిబేట్‌లో అనేక అంశాలపై చెలరేగిపోయారు. ధాటిగా, ఘాటుగా, దీటుగా ప్రతిస్పందించారు. సవివరంగా, సాధికారికంగా సమాధానమిచ్చారు. ఇటీవలి పలు పరిణామాలపై తొలిసారిగా కేసీఆర్ స్పందించారు. ప్రభుత్వ ఆరోపణల్లోని డొల్లతనాన్ని బయటపెట్టారు. జనంలో మెదులుతున్న ప్రశ్నలకు జవాబిచ్చారు. ఇది నాలుగుగంటల పొలిటికల్ మారథాన్ డిబేట్. తెలుగు ఎలక్ట్రానిక్ మీడియాలో ఇంత సుదీర్ఘం గా టీవీ లైవ్‌లో మాట్లాడిన రాజకీయ నేత కేసీఆర్ ఒక్కరే. ఓ యాగంలా చేపట్టిన తెలంగాణ పునర్నిర్మాణం.. కాంగ్రెస్ చేతిలో ఎలా ఆగం అయ్యిందో కేసీఆర్ కండ్లకు కట్టారు. రెండు పిల్లర్లు కుంగితే.. మహా కాళేశ్వరానికి మరక అంటబోదని సుదీర్ఘంగా విశ్లేషించారు. కేసీఆర్ మీద కక్షతో కాంగ్రెస్ ఎలా వికృత రాజకీయ క్రీడకు దిగుతున్నదో ససాక్ష్యంగా ఆయన బయటపెట్టారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విఫల యత్నాలను చిల్లర రాజకీయ వికృత క్రీడగా కేసీఆర్ కొట్టిపారేశారు. కాకా, బాకా మీడియా సాగిస్తున్న విషప్రచారాన్ని ఎండగట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో 8 నుంచి 12 సీట్లు గెలవబోతున్నామని కేసీఆర్ ధీమా వ్యక్తంచేశారు.

ట్యాపింగ్‌తో సీఎంకు ఏం సంబంధం?

ఫోన్‌ట్యాపింగ్ సిల్లీ, థర్డ్ క్లాస్ ఆరోపణ. లా అండ్ ఆర్డర్ కాపాడటానికి, ప్రతీప శక్తులను అడ్డుకోవడానికి పలు మార్గాల్లో పోలీసులు సమాచారం సేకరిస్తుంటారు. అందులో ఇంటర్‌సెప్షన్ ఒకటి. అది అధికారికంగా చేస్తారు. 'ఫలానా వ్యక్తుల ఫోన్లను ట్యాప్ చేసినం' అని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పరు. సీఎంకు సంబంధముండదు. ఇప్పుడున్న ముఖ్యమంత్రికీ రోజూ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ వస్తుంది. దీన్నికూడా రాజకీయం చేయడమంత దివాళాకోరుతనం ఇంకోటి ఉండదు.

నాపై మోదీ కక్షసాధింపు

లిక్కర్ స్కామ్ బోగస్. అది మోదీ పొలిటికల్ స్కీమ్. అన్ని రాష్ట్రాల్లోలాగానే అది ఢిల్లీ ప్రభుత్వ మద్యం పాలసీ. స్కామ్ ఎట్లయితది? అందులో ఒక్క రూపాయైనా దొరికిందా? కవితకు లిక్కర్ స్కామ్‌కు సంబంధం లేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలును అడ్డుకున్నందుకే కక్షగట్టి.. గాల్లో ఓ కట్టుకథ అల్లి ఈ కేసును ముందుకు తెచ్చారు. కవిత నిర్దోషి. కడిగిన ముత్యంలా బయటకొస్తది.

అహంకారం ఎవరిది?

మాది దొరలపాలన అంటారా..? దర్జాగా కాలు మీద కాలేసుకుని.. రైతు నడి ఇంట్ల పన్నది దొరలపాలనా? ప్రపంచంలో ఎక్కడా లేనట్టు దళితుల కోసం దళితబంధు తెచ్చింది దొరలపాలనా? పేద విద్యార్థుల కోసం 1100 గురుకులాల పెట్టింది, 20లక్షల ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చింది దొరలపాలనా? 200 పెన్షన్‌ను 2వేలు చేసింది దొరలపాలనా? కేసీఆర్ కిట్ ఇచ్చింది, బస్తీ దవాఖానలు పెట్టింది దొరల పాలనా? రైతు కోసం ధాన్యం కొన్నది దొరలపాలనా? మాది ముమ్మాటికీ మానవీయ పాలన! ఎవరిది అహంకారం? మాదా.. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడ్తామంటున్నవాళ్లదా? వడ్లు కొనని, కరెంటు ఎగబెట్టిన ముఖ్యమంత్రిదా?





నేటినుంచి కేసీఆర్ రోడ్‌షో

మిర్యాలగూడలో శ్రీకారం.. రాత్రికి సూర్యాపేటలో బస

12 లోక్‌సభ నియోజకవర్గాల్లో రోడ్‌షోలు.. శ్రేణుల్లో ఫుల్ జోష్

కాంగ్రెస్, బీజేపీ నాయకుల్లో కలవరపాటు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు బుధవారం నుంచి లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. రైతుల కోసం, రాష్ట్రం కోసం 17 రోజులపాటు రాష్ట్రంలో పర్యటించి, 12 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల పరిధిలోని రైతులు, వివిధ వర్గాల ప్రజలతో మమేకం కానున్నారు. లోక్‌సభ 11వ పేజీలో



నేడు ఇంటర్ ఫలితాలు

11 గంటలకు విడుదల చేయనున్న ఇంటర్‌బోర్డ్ 9

రేపు జేఈఈ ఫైనల్ రిజల్ట్స్

27 నుంచి అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్ షురూ 9

కేసీఆర్ ఈజ్ హిస్టరీ ఆఫ్ తెలంగాణ

కులమతాల వివక్ష లేకుండా పాలించా

వికృత, వ్యతిరేక భావనకు వెళ్లలే

మనకంటే 23 రాష్ట్రాలకు అప్పులు అధికం

కోటిమందికిపైగా మాకు ఓటేశారు



హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ అంటేనే ఓ చరిత్ర అని, దానిని ఎవరూ తుడిపేయలేరని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ స్పష్టం చేశారు. 'టీవీ9'కు మంగళవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పలు ప్రశ్నలకు సూటిగా సమాధానాలు చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో భంగపాటు తప్పదన్న ఫ్రస్ట్రేషన్ కాంగ్రెస్‌లో కనిపిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఆడుతున్న వికృత క్రీడ వెనక ముఖ్యమంత్రి, ఆయన ముఠా ఉన్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ ఇక కనుమరుగేనంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంపై స్పందిస్తూ.. పదేండ్లు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ కనుమరుగైందా? అని ప్రశ్నించారు.

ప్రశ్న: మీరు ఉద్యమం చూశారు. తెలంగాణ తీసుకొచ్చారు, రాష్ట్రం వచ్చిన తర్వాత 'బంగారు తెలంగాణ' నినాదంతో అభివృద్ధి దిశగా అడుగులు వేయించడానికి మీ వంతు ప్రయత్నం చేశారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ప్రజాగళం వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. మూడు దశలు చూసిన మీకు ఇప్పుడు నడుస్తున్న తెలంగాణ ఎలా అనిపిస్తున్నది?

జవాబు: ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అడ్డగోలు హామీలతో ప్రజలు టెంప్ట్ అవడంతో వాళ్లకు మాకంటే 1.8 శాతం ఎక్కువ ఓట్లు వేయడం ద్వారా అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత ప్రజలు గాయపడ్డారు. రైతాంగం విలవిలలాడుతున్నది. ఏ కోణంలోనూ పరిస్థితులు సరిగా లేవు. ఇప్పుడు రాష్ట్రంలో 'దేవుళ్ల మీద ఒట్లు.. కేసీఆర్ మీద తిట్లు' మాత్రమే నడుస్తున్నది. ముఖ్యమంత్రి, ఇతరులు వాళ్లు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేక విలవిల్లాడుతున్నారు. కాంగ్రెస్ సభలు అట్టర్ ఫ్లాప్ అవుతుంటే, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి, భంగపాటు తప్పదని ఫ్రస్ట్రేషన్‌తో ఇలా చేస్తున్నారు. సోషల్ మీడియా కూడా తన వికృత రూపాన్ని చూపిస్తున్నది. మీడియాలో ఉన్న ఒక సెక్షన్ వికృత రూపం, విశృంఖలత్వం, విచ్చలవిడితనాన్ని సమాజం చూస్తున్నది. 18 రోజుల్లోనే రూ. 700 కోట్ల బీర్లు తాగేశారని ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ బాకా, కాకా చానళ్లు, కొన్ని విషం చిమ్మే పత్రికలు నేను అధికారంలో ఉన్నప్పుడు మద్యం అమ్మకాలు పెరిగితే ప్రజలను తాగుబోతులు చేస్తున్నరని అన్నరు. ఇప్పుడు బీర్ల అమ్మకాలు పెరిగితే ఎండతాపం వల్ల ప్రజలు తాగుతున్నరు అని సమర్థించే ప్రయత్నం చేస్తున్నరు.

ప్రశ్న: మీపై పాత కోపంతో కాంగ్రెస్ ఇలా చేస్తున్నదంటారా?

జవాబు: గతంలో విలీనం చేస్తామని చెప్పిన మాట వాస్తవం. నేను చెప్పిన మాట వారు వినని మాట వాస్తవం. తెలంగాణ ఏర్పాటుకు జూన్ 2ను అపాయింటెడ్ డే పెట్టారు. అయితే రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించడంపై నేను అభ్యంతరం చెప్పాను. ఇది తలాతోక లేని వ్యవహారం అని చెప్పినా వాళ్లు వినలేదు. తదనంతరం నేను విలీనం చేయడానికి ఒప్పుకోలేదు.

ప్రశ్న: తెలంగాణ ఉద్యమం మీద కావొచ్చు, మీపై ఆంధ్ర పాలకులు, పెట్టుబడిదారులు కావొచ్చు, ఇప్పటికంటే ఎక్కువ దాడి జరిగింది. అప్పుడు తట్టుకొని నిలబడ్డారు. ఇప్పుడు తట్టుకోలేని పరిస్థితి కనిపిస్తున్నదా?

జవాబు: మీకు అలా అనిపిస్తుంది. కానీ నేను అసలు లెక్క చేయడం లేదు. కేసీఆర్ ఒక వ్యక్తి కాదు. ఒక ఇన్‌స్టిట్యూషన్. శూన్యంలో నుంచి సునామీ సృష్టించా. దిక్కుతోచని పరిస్థితిలో మన బతుకులు ఇక ఇంతేనా అన్నట్టు ఉన్న తెలంగాణ ప్రజల కోసం స్వయంగా ఒక పార్టీని స్థాపించి, ఆ పార్టీని ఒక మహా సుడిగాలిగా, మహోధృతమైన ఉద్యమ రూపంలో నడిపి, అనుకున్న లక్ష్యాన్ని సాధించా. తదనంతరం పదేండ్లు కులం, మతం, జాతి, వివక్ష లేకుండా పాలించా. రాజకీయ నాయకులు కొన్ని విషయాలను ప్రజల్లోకి ప్రబలంగా తీసుకుపోవాలనుకున్నప్పుడు కొంత ఉద్వేగంతో, వ్యంగ్యంతో మాట్లాడుతారు. అలా ఆ రోజుల్లో సమైక్య వాదులు నామీద చేసే దాడికి ప్రతిగా కొంత వ్యంగ్యం కూడా కలిపి మాట్లాడేవాడిని. చాలామంది నేను ఆంధ్రాప్రాంత వ్యక్తులకు వ్యతిరేకం అని అనుకునే పరిస్థితి వచ్చింది. తెలంగాణ వచ్చిన తర్వాత దివంగత పొత్తూరు వెంకటేశ్వర్‌రావు ఓ సందర్భంలో మాట్లాడుతూ 'ఉద్యమకారులు పాలకులుగా విజయవంతం కాలేదు. రాజ్యం నడపలేదు. బ్రిటన్‌లో విన్‌స్టల్ చర్చిల్ కూడా వార్‌టైం బెస్ట్ పీఎంగా ఉండేవారు. ప్రభుత్వం నడపలేక విఫలమై ఓడిపోయారు. మీరు కూడా అలాగే అయిపోతరని అనుకున్నం. కానీ మీ ప్రవర్తన, పద్ధతి చాలా భిన్నంగా ఉన్నది' అని నాతో చెప్పారు. పదేండ్లలో ఇతర రాష్ట్రాలకు చెందిన ఏ ఒక్క వ్యక్తి కూడా ఇసుమంతైనా బాధపడలేదు. ఆ పరిస్థితి రానీయలేదు. ఎందుకంటే, తెలంగాణ మీద తెలంగాణ ప్రజలకు అధికారం కావాలి. తెలంగాణ వనరుల మీద, తెలంగాణ ఉద్యోగాల మీద, తెలంగాణ నదుల మీద, హక్కుల మీద, మా రాజ్యం మాకు ఉండాలని కోరుకున్నం. అది వచ్చేసింది. శంషాబాద్‌లో ఇప్పుడు రోజూ 500 విమానాలు రాకపోకలు జరుగుతాయి. వందల రైళ్లు వస్తుంటయి. అందులో నుంచి తెలంగాణవాళ్లే దిగాలంటే ఎలా? దానికి రాజ్యాంగం కూడా ఒప్పుకోదు. ఒక రాష్ట్రం ఏర్పడిన తర్వాత దానిని ఎలా ముందుకు తీసుకుపోవాలని ఆలోచించాలే తప్ప వికృతమైన వ్యతిరేక భావన, అసహజమైన వ్యతిరేక భావన పెట్టి, మనుషుల మధ్య గోడలు కట్టడం కరెక్ట్ కాదు. తెలివైన పని కాదు. అందుకోసం చాలా సంయమనంతో, చాలా బాధ్యతతో, కొన్ని సందర్భాల్లో కొన్ని విమర్శలు వచ్చినా, వాళ్లకు కూడా సర్దిచెప్పి, రాష్ట్రాన్ని పదేండ్లు అద్భుతంగా ఒక చిన్న మత కల్లోలం లేకుండా అద్భుతమైన లా అండ్ ఆర్డర్‌తో చాలా గొప్పగా తీసుకుపోయినం. ప్రభుత్వం అంటే అట్లా నడపాలి. తిడుతూ కాదు. మూడుకోట్ల మందిలో ఓట్లలో కోటిమందికిపైగా మాకు ఓట్లేశారు. అంటే ప్రజలు మమ్మల్ని తిరస్కరించలేదు. అనుకోకుండా జరిగిన సంఘటనలో ఏదో గ్యాప్‌లో మీకు అధికారం వచ్చింది. ఆ అధికారం కూడా ఎందుకు ఇచ్చారో అర్థం చేసుకోకుండా శ్వేతపత్రాల నుంచి మొదలుపెట్టి ఐదు నెలల కాలాన్ని వృథా చేశారు. ప్రజలను గాలికి వదిలేసి, వాళ్ల ఖర్మానికి వదిలేసి, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ఒకటే రొడ్డ కొట్టుడు. దీంతో జనం విసుగెత్తిపోతున్నరు.

ప్రశ్న: కాంగ్రెస్ నేతల లక్ష్యం ఏమిటని అనుకుంటున్నారు?

జవాబు: వాళ్ల అజ్ఞాన, అహంకారపూరిత పద్ధతిలో వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చెరిపేస్తాం అని శాసనసభలో సీఎం మాట్లాడారు. ఇది సాధ్యమేనా? అసలు ఆ ఆలోచనే ఎంత వికృతమైనది. కాంగ్రెస్ పదేండ్లు అధికారానికి దూరంగా ఉంది కదా. కనుమరుగయ్యిందా? ఎవరైనా వాళ్ల సమయం కోసం ఎదురు చూస్తరు. ప్రజల ఆలోచన సరళిలో మార్పు వచ్చినప్పుడు కచ్చితంగా వారి టైం వస్తది. అంతేగానీ కృత్రిమంగా, వికృతంగా చేసే ఆలోచనలు, ఇలాంటి ప్రయత్నాలు బెడిసికొడుతాయి. చరిత్రలో సక్సెస్ కాలేదు. కావు.

ప్రశ్న: కేసీఆర్‌ను తిట్టడం వెనుక ఏదైనా రాజకీయ ఎజెండా ఉన్నదా? దీని వెనుక పీసీసీ అధ్యక్షుడో, ముఖ్యమంత్రో ఉన్నారని అనుకుంటున్నారా?

జవాబు: కేసీఆర్ ఈజ్ హిస్టరీ ఆఫ్ తెలంగాణ. నో బడీ కెన్ వైప్ ఇట్. కేసీఆర్‌ను తగ్గిద్దామని చాలామంది, చాలా ప్రయత్నాలు చేసి, భంగపడి విఫలమయ్యారు. నేను పెరగాల్సిన ఎత్తు పెరిగాను. నన్ను తగ్గించడం అంటూ ఉండదు. ఇది కాంగ్రెస్, బీజేపీ ఆడుతున్న ఒక రాజకీయ వికృత క్రీడ దీని వెనుక ముఖ్యమంత్రి, ఆయనను ఎన్నుకున్న ముఠా ఉన్నది.

ప్రశ్న: తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాలతో జరిగింది. పదేండ్లలో ఈ నినాదాలను సాధించామని అనుకుంటున్నారా?

జవాబు: కాంగ్రెస్ వాళ్లు మాపై మొదట చేసిన ఆరోపణ అప్పులు. లంకెబిందెలు ఉన్నయనుకున్నం అంటూ ఏదేదో చెప్పారు. ప్రపంచంలో ధనిక దేశం అమెరికా. అత్యధిక అప్పులు ఉన్న దేశం కూడా అమెరికానే. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు 27 ట్రిలియన్ డాలర్లు, చైనా 18,566 ట్రిలియన్ డాలర్లు, జర్మనీ, జపాన్, భారత్ 4 ట్రిలియన్ డాలర్లతో ఉన్నాయి. దేశంలో జీఎస్డీపీతో పోల్చితే రాష్ట్రం 24వ స్థానంలో ఉన్నది. అంటే మనకన్నా 23 రాష్ట్రాలు ఎక్కువగా అప్పులు ఉన్నాయి. ఒక వ్యక్తికి కొంత ఆదాయం వస్తే దానికి తగ్గటట్టుగా భవిష్యత్తును ప్లాన్ చేసుకుంటారు. ప్రభుత్వంలో మాత్రం రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల ఆకాంక్షలు తీర్చే అవసరాల కోసం ముందుగా ప్లాన్ ముందుగా తయారవుతుంది. ప్లాన్‌కు తగ్గట్టుగా నిధుల కూర్పు జరుగుతుంది.

ప్రశ్న: గతంలో జరిగిన తప్పులు చెప్పకుండా భవిష్యత్తు నిర్మాణం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎలా చెప్తున్నరు?

జవాబు: తప్పులు జరిగితే కదా. తప్పులు అంటే ఊదరగొట్టుడా? ప్రచారమా? మీడియాలో లాబీ చేసేవాళ్ల ద్వారా పిచ్చిరాతలు రాయించడమా? తప్పు అంటే ఎంక్వైరీ జరగాలి, రుజువు కావాలి.



పరిమితికి లోబడే అప్పులు

జమా లెక్కలు ఎవరైనా చూసుకోవచ్చు

కాంగ్రెస్ శ్వేతపత్రం.. చిలిపి వికృతక్రీడ

టీవీ9 ఇంటర్వ్యూలో కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ):ఎఫ్ఆర్‌బీఎంకు మించి అప్పులు చేశారని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు అవాస్తమని, పరిమితికి లోబడే అప్పులు చేసినట్టు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు స్పష్టంచేశారు. మంగళవారం టీవీ9 ఇంటర్వ్యూలో కేసీఆర్ మాట్లాడారు. లెక్కలు ఎవరైనా చూసుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వ జమాఖర్చులపై పూర్తిగా కాగ్ ఆడిట్ చేస్తుందని వెల్లడించారు.

ప్రశ్న: ఎఫ్ఆర్‌బీఎంకు మించి అప్పులు చేశారని, 25 శాతానికి పరిమితి ఉండగా 27 శాతానికిపైగా అప్పులు చేశారని ఆరోపిస్తున్నారు. దీనికి మీరేమంటారు?

జవాబు: అది పచ్చి అబద్ధం. బోగస్ శ్వేతపత్రం. వీళ్లకి చరిత్ర, భూగోళం తెలియదు. అంత అజ్ఞానులు. పరిమితికి లోబడే అప్పులు చేశాం. లెక్కలు ఎవరైనా చూసుకోవచ్చు. నేను పదేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తిగా చెప్తున్న. ప్రతిపక్ష పార్టీలను దెబ్బగొట్టాలనే ఉద్దేశంతో నరేంద్రమోదీ ఎన్నికలకు మూడేండ్ల ముందు రాష్ట్రాల అప్పులపై పూర్తిగా పరిమితి విధించారు. లేకుంటే మన రాష్ట్ర జీఎస్డీపీ రూ.16 లక్షల కోట్లకు చేరేది. ప్రస్తుతం రూ.14 లక్షల కోట్ల దగ్గర ఉన్నది. వివిధ ఫండింగ్ ఏజెన్సీల నుంచి రావాల్సిన వాటిని కూడా రాకుండా చేశారు. మార్చి 31 నుంచి మళ్లీ మార్చి 31వరకు ప్రభుత్వ జమాఖర్చులపై పూర్తిగా కాగ్ ఆడిట్ చేస్తుంది. ఆ లెక్కలు చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా సభ ముందు ఉంచుతారు. దానిపై కూడా గాలిమాటలు మాట్లాడితే ఎలా?

ప్రశ్న: మిమ్మల్ని, మీ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికే ఈ శ్వేతపత్రం పెట్టారంటారా?

జవాబు: ఇది ఒక వికృతక్రీడ.

ప్రశ్న: అప్పులను క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్‌గా కాకుండా దుబారా చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తున్నది.

జవాబు: దేశంలో అత్యధిక క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్ చేసిన రాష్ట్రం తెలంగాణ అని కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ ప్రతి సంవత్సరం పదిసార్లు చొప్పున చెప్పాయి. కాబట్టి ఇదొక అర్థం లేని, పస లేని, బట్టకాల్చి మీద వేసే తుగ్లక్ చర్య అని అర్థం అవుతున్నది.

మళ్లీ ట్యాంకర్లు మీ అసమర్థత కాదా?

ఐదేండ్లు సక్సెస్ అయిన మిషన్ భగీరథను మీరు ఎందుకు నడిపించలేకపోతున్నరు?

అద్భుత స్కీం నిర్వహణను పట్టించుకోలే

అందుకే తాగునీటికి కూడా ప్రజల అవస్థ

టీవీ9 ఇంటర్వ్యూలో మాజీ సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): తాగునీటి సమస్యను అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకొని మహాఅద్భుతమైన మిషన్ భగీరథ పథకాన్ని రూపొందించినట్టు మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారు. మంగళవారం టీవీ9 ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. గతంలో టీడీపీ, కాంగ్రెస్ 58 ప్రభుత్వాలు పాలించిన 58 ఏండ్లలో 17,500 ఓహెచ్ఎస్ఆర్‌లు నిర్మిస్తే పదేండ్ల తమ ప్రభుత్వంలో 18 వేల ట్యాంకులను నిర్మించినట్టు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి ఐదేండ్ల తరువాత నల్లగొండ జిల్లాలో కొత్తగా ఫ్లోరైడ్ కేసులు నమోదు కాలేదని, నల్లగొండ ఫ్రీ ఫ్లోరైడ్ జిల్లా అని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా పార్లమెంట్‌లో ప్రకటించిందని గుర్తుచేశారు.

ప్రశ్న: గతంలో కాంగ్రెస్, టీడీపీలు అమలు చేసిన పథకానికే మేకప్ వేసి ఇంటింటికి నల్లా నీటిని ఇచ్చి, దానికి మిషన్ భగీరథ పేరు పెట్టారని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు?

జవాబు: బీఆర్ఎస్ ప్రభుత్వం రాక ముందు ఎందుకు నీళ్ల ట్యాంకర్లు ఉండేవి. వీధి నల్లాలు ఉండేటివి, ఆడబిడ్డలు నీళ్లు మోసే వారు అనేది గుర్తు చేసుకోవాలి. తాగునీటి సమస్యను కూడా అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకున్నాం. మహాఅద్భుతమైన పథకాన్ని రూపకల్పన చేశాం. గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు 17,500 ఓహెచ్ఎస్ఆర్‌లు నిర్మించాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పది సంవత్సరాల కాలంలో 18 వేల ట్యాంకులను నిర్మించాం. వాళ్ల 58 ఏండ్ల పాలన కంటే ఎక్కువగానే మేము ట్యాంకులు నిర్మించాం. మిషన్ భగీరథలో 19 ఇన్‌టెక్ వెల్ సోర్సులు ఉన్నాయి. గతంలో నదుల నీళ్లు ఇచ్చే వాళ్లు కాదు. ఒక్కో గ్రామంలో 10-20 బోర్లు ఉండేవి. బోర్ల నీటినే ఇచ్చే వారు. ఫ్లోరైడ్ నీళ్లు వచ్చేవి. ఫ్లోరైడ్‌తో నల్లగొండ జిల్లాలో 1.50 లక్షల మంది నడుములు వంగిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం రాక ముందు నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ విషంతో నిండుకపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి ఐదేండ్ల తరువాత నల్లగొండ జిల్లాలో కొత్తగా ఫ్లోరైడ్ కేసులు నమోదు కాలేదని, నల్లగొండ ఫ్రీ ఫ్లోరైడ్ జిల్లా అని కేంద్ర ప్రభుత్వమే పార్లమెంట్‌లో ప్రకటించింది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కూడా ప్రకటించింది. నాగార్జునసాగర్ టెయిల్ పాండ్, ఎస్ఆర్ఎస్పీ, దుమ్ముగూడెం, ఎల్లంపల్లి లాంటివి 19 ఇన్‌టెక్ వెల్ పాయింట్లు ఉంటాయి. 123 వాటర్ ట్రిట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశాం. సర్వీసు రిజర్వాయర్లు ఉంటాయి. 38 వేల ట్యాంకులు ఉంటాయి. ఏ గ్రామంలో సర్పంచ్‌లకు, ప్రజలకు నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియదు. గ్రావీటి ద్వారా ట్యాంకులకు నీళ్లు వెళ్తాయి. నిర్వహణ చార్జీలు ఉండవు. 1.50 లక్షల కిలోమీటర్ల మేర పైపులైన్లు ఉన్నాయి. ప్రతి ఇంటికి నల్లా నీటిని ఇచ్చాం. 141 మున్సిపాలిటీలకు ఇంటింటికి నీటిని ఇచ్చాం. ఒక్క రూపాయికి నల్లా కనెక్షన్ ఇచ్చాం. హైదరాబాద్‌లో 20 వేల లీటర్ల నీళ్లను ఉచితంగా ఇచ్చాం. మిషన్ భగీరథ గురించి నేను స్వయంగా అసెంబ్లీలో చాలెంజ్ చేశాను. ఐదు సంవత్సరాల్లో పూర్తి చేయకుంటే ఓట్లే అడగమని నేను ప్రకటించాను. చెప్పిన ప్రకారం పూర్తి చేశాం. ఆ తరువాత ఏ ఒక్క ఆడబిడ్డ బిందె పట్టుకొని బయటికి రాలేదు. వీధి నల్లాలు బంద్ పెట్టాం. ట్యాంకర్లు లేవు. ఇంత అద్భుతమైన స్కీంను పట్టుకొని (విండో డిస్మి) పథకం అంటే ఎలా....? వాటిని వాడే తెలివి లేక, గాలికి వదిలేసి, దాని నిర్వహణను పట్టించుకోలేదు. వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసి 3 వేల మందిని మిషన్ భగీరథకు కేటాయించాం. మళ్లీ ట్యాంకర్లు వచ్చేశాయి. ట్యాంకర్లు రావడానికి మీ అసమర్థత కాదా..? మీ తెలివి తక్కువ తనం కాదా? ఐదు సంవత్సరాలు విజయవంతంగా నడిచిన మిషన్ భగీరథను మీరు ఎందుకు నడిపించలేకపోతున్నారు. ఇది మీ అసమర్థత, మీ తెలివి తక్కువ తనం. దీంట్లో కూడా అవినీతి ఉంది... తోక మట్ట ఉందంటున్నారు. పోలీసు కమాండ్ కంట్రోల్ కట్టినాం, సెక్రటేరియట్ కట్టినాం అందులో కూడా అవినీతినా?!.

కరెంట్ కోతలు కాంగ్రెస్ చేతకానితనం

మేం వచ్చిన్నాడు 7,700 మెగావాట్ల కరెంటు ఉండేది • మేము దిగిపోయేనాటికి ఉత్పత్తి చేసింది 19,100పైగా

ఎన్టీపీసీ అందుబాటులోకి రావడంతో 20,000 మెగావాట్లు • వనరులను వాడుకోలేని దద్దమ్మలు కాంగ్రెస్ నాయకులు

టీవీ9 ఇంటర్వ్యూలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నేతలు వసతులు, వనరులను వాడుకోలేని దద్దమ్మలు, అవివేకులు, తెలివి తక్కువవాళ్లు అని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. టీవీ9 ఇంటర్వ్యూలో కేసీఆర్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన్నాడు 7,700 మెగావాట్ల కరెంటు ఉండేదని, దిగిపోయేనాటికి 19,100పైగా మెగావాట్లు.. మొన్న ఎన్టీపీసీ అందుబాటులోకి రావడంతో 20,000 మెగావాట్లు దాటిందని, తొమ్మిదేండ్లు నిరాటంకంగా వచ్చిన కరెంటు కేసీఆర్ పక్కకు పోగానే కటక బంద్‌చేసినట్టు కరెంటు ఎందుకు పోయిందని నిలదీశారు. మంచినీళ్లు ఎందుకు రావడంలేదు, ఎందుకు సాగునీళ్ల ఇబ్బంది వచ్చిందని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ పాలకుల అసమర్థత, అవగాహన లేమికి నిదర్శనమన్నారు.



ప్రశ్న. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంటు కష్టాలు వచ్చాయి. మీరు వెళ్తూ వెళ్తూ ఏమైనా చేసి వెళ్లారా.. కరెంటు కష్టాలకు కారణం ఏమిటి?

జవాబు: కరెంటుపై కూడా వాళ్లు వెకిలి ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చేనాటికి కరెంటు షార్టేజ్ 2,700 మెగావాట్లు. ఆంధ్రా, తెలంగాణ ప్రాంతంలో విద్యుత్ వినియోగం ఆధారంగా ఆనాటి విద్యుత్ ఉత్పత్తిలో పదేండ్లపాటు 53.89 శాతం తెలంగాణకు, 46.11శాతం ఏపీకి కరెంటు ఇవ్వాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ చట్టాన్ని రాజ్యాంగం సాక్షిగా ఏపీ ఉల్లంఘించింది. ఏపీ చట్టాన్ని ఉల్లంఘించగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏడు మండలాలను ఏపీకి ఇవ్వడమే కాకుండా 400 మెగావాట్ల సీలేరు పవర్‌ప్లాంట్‌ను కూడా ఏపీకి ఇచ్చారు. దీనిపై మేము పోరాటంచేస్తే కేంద్రం పట్టించుకోలేదు. ఏపీలో అధికారంలో ఉన్న పార్టీ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండటంతో మా వాదనను ఆనాడు పట్టించుకోలేదు. తెలంగాణకు న్యాయంగా రావాల్సిన విద్యుత్ కూడా ఇవ్వలే. ఉమ్మడి రాష్ట్రంలో చివరి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ అంధకారమవుతుందని చెప్పారు. ఇది కూడా ఓ చాలెంజ్ మాకు. రాష్ట్రంగా మేము నిలదిక్కుకోవాలి. ఏపీలో అధికారంలో ఉన్న పార్టీ ఎమ్మెల్యేలు కూడా కొందరు తెలంగాణలో గెలిచారు. ఇయ్యాల రాష్ట్రానికి ఉన్న ముఖ్యమంత్రి కూడా ఆ పార్టీ లోని వాడే. కరెంటు ఇవ్వాలంటూ అతను అసెంబ్లీలో గోల.. నానా హంగామా. దీంతో కరెంటు కొనక తప్పని పరిస్థితి. ఈ రాష్ట్రం నేషనల్ గ్రిడ్‌లో లేనందున ఎక్కడినుంచంటే అక్కడినుంచి కొనే అవకాశం లేదు. మనం సదరన్ గ్రిడ్‌లో ఉన్నాం. సదరన్ గ్రిడ్ నుంచి కొనాలంటే ఇక్కడ కరెంటు లేదు. దీంతో తెలంగాణను నేషనల్ గ్రిడ్‌లోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాం. వార్ధా-డిచ్‌పల్లి, అంగుల్-పలాస, వరంగల్-వరూర లైన్లను కలిపితేనే నేషనల్ గ్రిడ్‌లోకి వచ్చే అవకాశం ఉంది. తెలంగాణను విఫల రాష్ట్రంగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మల్ల రెండు రాష్ట్రాలను కలిపేస్తాం..బెర్లిన్ గోడలను బద్దలు కొట్టి ఐక్యం కాలేదా.. అనే వాదనలు వినిపించాయి. వీళ్లని నల్లిపై చేయాలంటే మనం నిలదొక్కుకోవాలి అనే సంకల్పంతో, పరిశ్రమలను ఆకర్షించాల.. రియల్ ఎస్టేట్‌ను పెంచాల అనే ఉద్దేశంతో మేము ప్రయత్నం చేశాం. ఇండియాలో ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలోనే కరెంటు లభ్యత ఉంది. అయినప్పటికీ కరెంటు ఉన్నా ఇవ్వలేని గందరగోళ పరిస్థితి ఉండేది. డిస్ట్రిబ్యూషన్ సిస్టం కూడాసరిగా లేదు. దీనికి రూ. 12000కోట్లు అవసరమవుతుందని ఇంజినీర్లు చెబితే వెంటనే చేయమని చెప్పాను. మేము జూన్‌లో అధికారంలోకి వస్తే సెప్టెంబర్ చివరి వరకు వ్యవసాయరంగం మినహా అందరికీ 24 గంటల కరెంటు ఇచ్చాం. అంతా ఎంతో ఆశ్చర్యపోయారు.

ప్రశ్న: 24 గంటలు కరెంట్ ఇచ్చామని మీరు, ఇవ్వలేదని వాళ్లు అంటున్నారు?

జవాబు: మాటలు మాట్లాడడం వేరు. విద్యుత్‌పై నేను చెప్పే మాటలు ప్రజల అనుభవంలోనే ఉన్నాయి కదా. కేసీఆర్ ఉన్నప్పుడు పరిశ్రమలకు, ఐటీ రంగానికి, గృహాలకు, వ్యవసాయానికి ఎలా వచ్చిందనేది ప్రజలందరికీ తెలుసు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే నిర్ణేతలు. అందుకే నేను ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా... కేసీఆర్ ఉన్నప్పుడు కరెంట్ నిరంతరంగా వచ్చిందా లేదా, ఇప్పుడు ఇబ్బందులు కలుగుతున్నాయా లేదా. కరెంట్‌పై నేను చెప్పే మాటలు నిజమైతే పార్లమెంట్ ఎన్నికల్లో మా వాళ్లను గెలిపించండి లేదా మావాళ్లను ఓడించండి.

ప్రశ్న: ప్రతిదీ ఆడిట్ ప్రకారమే జరిగిందని మీరు అంటున్నారు. మరి యాదాద్రి పవర్ ప్లాంట్‌లో దాదాపు రూ.10,000 కోట్లు అవినీతి జరిగిందని వాళ్లు ఆరోపిస్తున్నారు. మాజీ జస్టిస్ నర్సింహారెడ్డితో ఒక కమిటీ కూడా వేశారు?

జవాబు: రూ.13కు విద్యుత్ కొన్నామనేది దారుణమైన ఆరోపణ. వాస్తవంగా విద్యుత్ కొనుగోలు చేసింది రూ.3.90కి మాత్రమే. విద్యుత్ కొనుగోలు రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి పీపీఏ చేసుకొని కొనుగోలు చేయడం, రెండోది.. షేర్ మార్కెట్ తరహాలో ఓపెన్ మార్కెట్‌లో కొనడం. పీక్ లోడ్ వచ్చినప్పుడు తాత్కాలికంగా ఓపెన్ మార్కెట్‌లో కొనుగోలు చేస్తారు. ఇది రోజురోజుకూ రేటు మారుతూ ఉంటుంది. కేరళలో కాయంకూరంలోని ఎన్‌టీపీసీ ప్లాంటు నుంచి కొనుగోలు చేయాలని తానే స్వయంగా వాళ్లతో మాట్లాడితే రూ.17 చొప్పున ఇస్తామన్నారు. తక్కువకు ఇచ్చేందుకు వాళ్లు ఒప్పుకోకుంటే మేము వారివద్ద తీసుకోలేదు. కొన్ని సందర్భాల్లో మూడు-నాలుగు-ఐదు రోజులకోసం రూ.15-20కి కూడా కొంటారు. దీనికి రెగ్యులేటరీ కమిషన్ అడ్డంరాదు. పరిశ్రమల కోసం, పంటలను కాపాడుకోవడం కోసం తాత్కాలిక పద్ధతిలో ఇలా ఓపెన్ మార్కెట్‌లో కొనాల్సి వస్తుంది. ఈ ప్రభుత్వం కూడా అధికరేట్లకు కొనుగోలు చేస్తున్నది. రూ.13 కన్నా ఎక్కువ ధరకు కూడా కొన్నారు. మరి ఈ ప్రభుత్వం ఎందుకు కొంటున్నది. దీనికి ఏమి సమాధానం చెబుతారు?

ప్రశ్న: రూ. 81 వేల కోట్లు విద్యుత్ సంస్థలు అప్పచేస్తే.. మీ హయాంలోనే రూ.50 వేల కోట్ల అప్ప అయిందంటున్నారు? అధిక రేటుకు కొన్నారు అంటున్నారు?

జవాబు: అమ్మ పెట్టదు.. అడుక్కోని తిననివ్వదు. కరెంటు ఎలా వస్తుంది చెప్పండి. అతి భయంకరంగా, అతి దారుణంగా ఉన్న కరెంటు వ్యవస్థని చక్కగచేసి, భవిష్యత్తుకు ప్రణాళికలు రచించి, అనేక పవర్‌ప్లాంట్లకు శ్రీకారం చుట్టి, ఎన్టీపీసీలో 4,000 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నాం. కరెంటు ఉత్పత్తి వెంటనే కాదు కాబట్టి అందుబాటులో ఉన్నచోట కొనుక్కోక తప్పదు. విద్యుత్ అధికరేట్లకు కొన్నట్టు, యూనిట్ రూ.13 చొప్పున కొన్నట్టు బాకా, కాకా పట్టే మీడియా ద్వారా, అమ్ముడుపోయే కొన్ని యూట్యూబ్ చానళ్ల ద్వారా చెప్పారు. వాస్తవానికి రూ.3.90 చొప్పున మాత్రమే విద్యుత్ కొనుగోలు చేశాం. టారిఫ్ రెగ్యులేటరీ కమిషన్ ఉంటుంది. వాళ్లే ధరలు నిర్ణయిస్తారు. ఇందులో కంపెనీలకు, ప్రభుత్వాలకు ఎటువంటి పాత్ర ఉండదు. తెలంగాణ, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల ఈఆర్సీలు అప్రూవ్ చేసిన రేటు ఇది.

ప్రశ్న: భవిష్యత్తును కూడా దృష్టిలో ఉంచుకొని కరెంటు కష్టాలు రాకుండా అన్నీ చేశాము అంటున్నారు. మరి మీరు దిగిపోయిన నాలుగు నెలల్లో ఎందుకు కరెంటు షార్టేజ్ వచ్చింది?

జవాబు: మేం వచ్చిన్నాడు 7,700 మెగావాట్ల కరెంటు ఉండేది. మేము దిగిపోయేనాటికి ఉత్పత్తి చేసింది 19,100పైగా మెగావాట్లు. మొన్న ఎన్టీపీసీ అందుబాటులోకి రావడంతో 20,000మెగావాట్లు దాటింది. కేసీఆర్ పక్కకు పోగానే కటక బందేసినట్టు కరెంటు ఎందుకు పోయింది, మంచినీళ్లు ఎందుకు రావడంలేదు, ఎందుకు సాగునీళ్ల ఇబ్బంది వచ్చింది అని మేము కూడా అడుగుతున్నాం. అందుకే నేను అంటున్న.. వీళ్లు ఉన్న వసతులు, వనరులను వాడుకోలేని దద్దమ్మలు, అవివేకులు, తెలివి తక్కువవాళ్లు. తొమ్మిదేండ్లు నిరాటంకంగా వచ్చిన కరెంటు ఎందుకు పోయింది. ఇది అసమర్థత, అవగాహన లేమి. నేను ఐఏఎస్‌లను తీసి మొత్తం టెక్నోక్రాట్స్‌ను పెట్టాను. నేడు మళ్లీ టెక్నోక్రాట్స్‌ను తీసేసి ఐఏఎస్‌లను పెట్టారు. మా పదేండ్లలో మేము పెట్టిన ఖర్చు రూ.14.5 లక్షల కోట్లు. తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. యుఎన్‌వోసహా అనేక సంస్థలనుంచి ప్రశంసలు వచ్చాయి.

ప్రశ్న: విద్యుత్‌పై కాంగ్రెస్ ఆరోపణలకు మీ సమాధానం ఏమిటి..?

జవాబు: అతి భయంకరంగా, అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్‌రంగాన్ని అందరూ ఆశ్చర్యపడేలా, అన్ని వర్గాలవారికి 24 గంటల నిరంతర కరెంట్ ఇచ్చే ఏకైక రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన కేసీఆర్ దోషి అయితడా? అంతా సిద్ధంగా ఉన్నటువంటి వ్యవస్థను అందించలేని అర్భకులు మాపై చేసే ఆరోపణలు నిజం. ఇదా.. ఎవరిదైనా అంతరాత్మ ఒప్పుకుంటుందా. దీన్ని బుద్ధి ఉన్నవాళ్లేవరైనా ఒప్పుకుంటారా. ఇక నేను బాధ్యతలు అప్పగించిన విద్యుత్ సంస్థల సీఎండీ ప్రభాకర్‌రావు కరెంట్‌రంగంలో తలపండిన వ్యక్తి. ఆయనతోపాటు హైడల్ డైరెక్టర్ వెంకట్రాజం, భాగ్యత్‌రెడ్డి, రఘుమారెడ్డి వీళ్లంతా అద్భుతమైన టెక్నోక్రాట్స్. ఎప్పటికప్పుడు సమావేశం నిర్వహించుకుంటూ ఆలోచన చేసి అతి తక్కువ ధరలో కరెంట్ వచ్చేలా ప్రణాళికలు వేసే వాళ్లం. ఇదంతా పక్కనపెట్టి 'మమ్మల్ని బద్నాం చేస్తాం. మేం అసమర్థులం కరెంట్ ఇవ్వలేం.' అంటే ఇది ఎవరి తప్పు. అసలు నేరస్థులు, అసమర్థులు వాళ్లు.

ప్రశ్న: విద్యుత్ ఒప్పందాలపై కాంగ్రెస్ ప్రభుత్వం జ్యుడీషియల్ కమిటీ వేసి విచారణ చేస్తా అంటున్నది. విచారణకు సిద్ధమేనా?

జవాబు: అసెంబ్లీలో మా ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్ ఇప్పటికే స్పష్టంగా చెప్పారు. సొల్లు పురాణం చెప్పుడు కాదు.. విచారణ చేయించండి. మీ డొల్ల ఆరోపణను మేము నిరూపిస్తాం. మేము సిద్ధంగా ఉన్నాం. ప్రజాకోర్టులో దోషులుగా నిలబెడతాం.



కాళేశ్వరం ప్రాజెక్టును ఏ విధంగా వాడుకోవాలో ఈ అర్భకులకు తెలియలేదు. అసలు ఆ ప్రాజెక్టుపై వాళ్లకు అవగాహనే కాలేదు. ఇంజనీర్లు చెప్పినా కూడా వాళ్లు వినేందుకు సిద్ధంగా లేరు. **-కేసీఆర్**

ప్రశ్న: రైతులు రిపేర్ చేసుకొనుడు సాధ్యమా?

కేసీఆర్: ఎందుకు సాధ్యంకాదు. సాధ్యమే. ఐ విల్ డూ ఇట్. నా కండ్ల ముందే తెలంగాణను, కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నాశనం చేస్తుంటే నేను మౌనం పాటించే ప్రసక్తిలేదు. ఎవరడ్డొస్తరో రండి. 50వేల మంది రైతులను తీసుకుని పండబెట్టి తొక్కుకుంట పోయి రిపేర్‌చేయిస్త. పంపులు నడుపుత. ఇదే విషయాన్ని మొన్న కరీంనగర్ సభలో కూడా చెప్పిన.

ప్రశ్న: పొలిటిల్ స్టేట్‌మెంట్స్ సరే. ప్రభుత్వం చేయాల్సిన పని మీరెలా చేస్తారు?

కేసీఆర్: ప్రభుత్వ చేయాల్సిన పని చేయకపోతే ఏం చేయాలె. ఇది ప్రజాస్వామ్యం. ప్రభుత్వం మొండికేసి చేయకపోతే ప్రజానీకమే చేసుకుంటారు. మేం చేసి చూపిస్తాం. టైమ్ గెట్ ఇట్ డన్. ఇది కోటానుకోట్ల కుటుంబాలు. లక్షలాది రైతులు కుటుంబాలకు సంబంధించిన సమస్య. ఒక చీప్ పొలిటికల్ టాక్‌టిక్స్ కోసం, చిల్లర రాజకీయాల కోసం బలిపెడతమంటే ఎట్లా ఊరుకుంటాం. తెలంగాణ సమాజం ఎట్లా సహిస్తది. ఎందుకు ఊకోవాలె? ఇది నిజం కాదా? టన్నెల్స్‌కు ఏమన్నా అయ్యిందా? రిజర్వాయర్లకు ఏమన్నా అయ్యిందా? పంప్‌హౌజ్‌లకు ఏమైనా అయ్యిందా? కాల్వలకు ఎమైనా అయ్యిందా? మీది రెండు బ్యారేజీలకు ఏమన్నా అయ్యిందా? ఇంత వెర్రి చేతలా? ఈ గ్రౌటింగులు, గ్రోటింగ్‌లు ఎప్పుడూ ఉండేవే.



కాళేశ్వరాన్ని బలిస్తే ఊరుకోం

తన కండ్ల ముందే తెలంగాణను కాంగ్రెస్ నాశనం చేస్తున్నదని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సైతం నాశనం చేస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ నాశనమవుతుంటే తాను మౌనం పాటించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. 50వేల మంది రైతులను తీసుకుని పండబెట్టి తొక్కుకుంట పోయి మేడిగడ్డను రిపేర్‌చేయిస్తానని పునరుద్ఘాటించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తమకు ప్రయోజనం చేకూరిందని ప్రజలే చెప్తున్నరని, ఒకప్పుడు 50 టన్నుల వడ్లు పండించిన తెలంగాణ నేడు మూడున్నర కోట్ల టన్నులు ఎంట్ల పండించిందని కేసీఆర్ ప్రశ్నించారు. టీవీ ఇంటర్వ్యూలో కేసీఆర్ కాళేశ్వరంపై పూసగుచ్చినట్టు చెప్పిన వివరాలు ఇవీ..

ప్రశ్న: కాళేశ్వరం ప్రాజెక్టులో మొత్తం అవినీతి జరిగింది. అవినీతి కోసమే ఈ ప్రాజెక్టు నిర్మించారని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. కాళేశ్వరంలో అసలు ఏం జరిగింది?

జవాబు: ఇది ఒక్క కాళేశ్వరానికి సంబంధించిన అంశం కాదు. తెలంగాణ నదులు, నీళ్ల ఇలా అన్నింటికి సంబంధించినది. మనకు ఉండేవి రెండే రెండు నదులు ఒకటి గోదావరి, మరొకటి కృష్ణా నది. ఉమ్మడి పాలనలో సమైక్య పాలకులు తెలంగాణపై వివక్ష చూపారు. చేస్తమని చెప్పిన ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. ఇక తెలంగాణ ఉద్యమానికి గులాబీ జెండాకు జడిసి రెండో దశ ప్రారంభించామని చెప్పి అక్కడింత ఇక్కడింత చేశారు. దేవాదులు పూర్తికాలేదు, నెట్టెంపాడు పూర్తికాలేదు. బీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల ఇలా ఏదీ పూర్తికాలేదు. ఎల్లంపల్లి పూర్తికాలేదు, మిడ్ మానేరు పూర్తికాలేదు.. అన్నీ అసంపూర్తే. ఇక తెలంగాణ వచ్చింది మేం అధికారంలోకి వచ్చాం. తెలంగాణకు ఎత్తిపోతలే తప్ప మరో గత్యంతరం లేదనేది సత్యం. తెలంగాణ భౌగోళిక వ్యవస్థ ఆ విధంగా ఉంటుంది. తెలంగాణ రెండు బేసిన్లుగా ఉంటుంది. కృష్ణా, గోదావరి బేసిన్లుగా ఉంటుంది. మహారాష్ట్ర నుంచి వచ్చిన గోదావరి తెలంగాణలో కందకుర్తి గ్రామం వద్ద కలుస్తుంది. ఇది మంజీర, గోదావరి నదులు కలిసే ప్రదేశం. ఇక్కడ 323 మీటర్ల ఎత్తులో ఉంటుంది. మేడిగడ్డ బ్యారేజీ(కాళేశ్వరం ప్రాజెక్టు) 85 మీటర్ల ఎత్తులో, సమ్మక్క బ్యారేజ్ వద్ద 70 మీటర్లు, సీతమ్మ సాగర్ 47 మీటర్ల ఎత్తులో ఉంటుంది. గోదావరి క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత పెద్దగా ఉంటదంటే.. దీన్ని 'గ్యాంజెస్ ఆఫ్ ది సౌత్' గా పిలుస్తారు. 3,00,812 చదరపు కిలోమీటర్లు ఉంటుంది. ఇది దాదాపు 7.70 కోట్ల ఎకరాలకు సమానం. ఇంత ప్రాంతంలో కురిసే వర్షం ఈ నదికి వస్తుంది. 1974లో ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినప్పుడు బచావత్ గారు సబ్ డివిజన్ మాదిరిగా తీసుకుని నీళ్లు పంపిణీ చేశారు. పలానా సబ్ డివిజన్ వరకు మహారాష్ట్రకు, మరో సబ్ డివిజన్ వరకు మధ్యప్రదేశ్‌కు, కర్ణాటక, ఒడిశాకు సబ్ డివిజన్ల వారీగా నీళ్లు కేటాయించారు. మిగిలిన నీళ్లు మొత్తం ఆంధ్రప్రదేశ్‌కు చెందుతాయని చెప్పారు. దీనిపై సుమారు 1500 టీఎంసీలు ఉంటాయని లెక్కకట్టారు. దీని కన్నా చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ నీళ్లు ఎక్కడ ఉంటాయంటే.. గోదావరి నదికి మూడు ముఖ్యమైన ఉపనదులు ఉన్నాయి. ప్రాణహిత పెద్ద ఉపనది. ఆ తర్వాత ఇంద్రావతి, ఆ తర్వాత శబరి. ఇందులో 1700 టీఎంసీల నీళ్లు తీసుకొచ్చే నది ప్రాణహిత. 650-700 టీఎంసీల నీళ్లు ఇంద్రావతిలో, 400-600 టీఎంసీల నీళ్లు తెచ్చేది శబరి. ఇందులో శబరి ఆంధ్రప్రాంతంలోని పోలవరానికి ఉపయోగపడుతుంది. ఇక తెలంగాణకు ఉన్న అవకాశం ఇంద్రావతి లేదా ప్రాణహిత. ఇంద్రావతిలో వరద ఒకేసారి వేగంగా వస్తుంది, ఆ తర్వాత ఆగిపోతుంది. ఇక ఏకైక జీవనది ప్రాణహిత. అసలు ప్రాణహిత లేకుంటే గోదావరి నదే లేదు. నీళ్లు ఎక్కడి నుంచి తీసుకోవాలంటే ప్రాణహిత నుంచి మాత్రమే. సమైక్య పాలకులు కేటాయించిన 968 టీఎంసీలు వాడుకోవాలంటే ప్రాణహిత మాత్రమే అవకాశం. గోదావరి బేసిన్‌లో హయ్యెస్ట్ పాయింట్ 680 మీటర్ల ఎత్తులో ఉంటుంది. అక్కడ 15 టీఎంసీల కొండపోచమ్మ సాగర్ నిర్మించినం. 85 మీటర్ల నుంచి 680 మీటర్లకు రావాలి.. ఇది గోదావరి కథ. ఇక కృష్ణ... కృష్ణలో శ్రీశైలం నుంచి తీసుకోవాలి. కృష్ణ బేసిన్‌లో హయ్యెస్ట్ పాయింట్ లక్ష్మీదేవిపల్లి గ్రామం. ఇది 670 మీటర్ల ఎత్తు. తెలంగాణలో పాలించిన కాకతీయులు పుణ్యాత్ములు... వాళ్లకు ఆ టెక్నాలజీ ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ ఈ పరిస్థితిని గమనించి 75వేలకు పైగా చెరువులను నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన కుతుబ్‌షాలు, నిజాంలు కూడా ఆ పరంపర కొనసాగించారు. అసలు తెలంగాణ జీవిత ఆధారమే ఆ చెరువులు. సమైక్య రాష్ట్రం ఏర్పడిన తర్వాత దీనికి మైనర్ ఇరిగేషన్ అని పేరుపెట్టి.. ఒక్క రూపాయి కూడా బడ్జెట్ ఇచ్చేవారు కాదు. దీన్ని మొత్తం ధ్వంసం చేశారు. చెరువులు మొత్తం తాంబాలాలుగా మారిపోయాయి. తూంలు కూలిపోయాయి. చెరువుల ఉనికే కోల్పోయింది. దీంతో తెలంగాణలో భూగర్భ జలాలు పడిపోయాయి. 500-800 ఫీట్లు బోర్ వేస్తేగానీ నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణకు నీళ్లు కావాలి. ఏం చేయాలి. ఎత్తిపోతలను కేసీఆర్ తలపెట్టలేదు. సమైఖ్య పాలకులే దీనికి నాంది పలికారు. మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి కావచ్చు, కిరణ్‌కుమార్‌రెడ్డి కావొచ్చు ప్రాణహిత చేవెళ్ల, కాంతనపల్లి, దేవాదుల పేరుపై ఎత్తిపోతల పథకాలను ఇచ్చారు. కృష్ణాపై కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు పేరుతో ఇచ్చారు. నీళ్లు తీసుకొని ఎత్తులోకి తీసుకురావాలి.

ప్రశ్న: కేఆర్‌ఎంబీ వివాదంపై మీరేం చెబుతారు?

జవాబు: కేఆర్‌ఎంబీని మేము దద్దరిల్లిచ్చాం. 'మా రెండు రాష్ట్రాల మధ్య నువ్వొక సమన్వయ కర్తవు మాత్రమే. నువ్ మాకు బాస్‌వు కాదు. బీకేర్‌ఫుల్' అని చెప్పాం. ప్రాజెక్టులు అప్పగించమంటే మేము అప్పగించలేదు. వీళ్లు పోయి కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించారు. నేను గొడవ చేస్తే అసెంబ్లీ ఎజెండా పక్కకు పెట్టి మళ్లీ రెజుల్యూషన్ పెట్టారు. ఇవన్నీ ప్రజలు చూస్తున్నారు. నిన్నటికినిన్న గోదావరి కింద ఉన్న టెయిల్‌పాండ్‌లో ఏపీ ప్రభుత్వం దురాక్రమణ చేసి నీళ్లు ఎత్తుకుపోయింది. వీళ్లు ప్రభుత్వం నడుపుతున్నారా? ఏం చేస్తున్నారు? గుడ్లు అప్పగించి చూస్తున్నారు. ప్రజలకు సమాధానం చెప్పాలి. అందుకే అసమర్థ, అవివేక, ఉన్న వసతులు వాడుకోలేని అర్భక ప్రభుత్వం ఇది. మిషన్ భగీరథ ఇంటేక్ పాయింట్ అది. అది ఖాళీ అయితే నీళ్లు ఎక్కడ్నుంచి ఇవ్వాలి.

హైదరాబాద్, 23 (నమస్తే తెలంగాణ): ''గోదావరిలో వర్షాలు పడేకొద్దీ వరద పెరుగుతుంది. 70వేలు, 80వేలు, లక్ష క్యూసెక్కులకు పైగా వరదొస్తుంది. మేడిగడ్డ బ్యారేజీలు మొత్తం గేట్లు మూయకుండా వరద పోయేందుకు అటు చివరన రెండు, ఇటు చివరన రెండు, నాలుగు చొప్పున గేట్లు తెరుస్తుంటరు. మధ్యలో ఉన్న గేట్లు మూసి పెడతరు. నీళ్లు వచ్చినకొద్దీ కిందికి వదులుతుంటరు. కాలం గడుస్తున్నకొద్దీ నదీ ప్రవాహాన్ని గమనించుకుంటూ ఒక్కో గేట్ తెరుస్తుంటరు. కాళేశ్వరం స్టోరేజీ కెపాసిటీయే 16 టీఎంసీలు. మొదట 20 టీఎంసీలు అనుకున్నా, 16 టీఎంసీలకు మహారాష్ట్రను ఒప్పించినం. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి కెపాసిటీ16 టీఎంసీలు ఒకేసారి నింపి ఉంచరు. వరద ఒకేసారి వస్తే వాష్ అవుట్ అవుతుందని మొత్తం నింపరు. ఫిబ్రవరిలో గోదావరిలో 30-40 వేల క్యూసెక్యులొస్తాయి. 6-8 టీఎంసీలు బ్యారేజీలో ఉంచుకుంటూ విడుదల చేస్తుంటారు. ఈ నీళ్లు రెండోపంటను కాపాడుకోవడం, సాగునీరు, తాగునీటికి ఉపయోగిస్తరు. మేం మూడు బ్యారేజీలు కట్టినం. ఒకటి 16 టీఎంసీలు, మరొకటి 7 టీఎంసీలు, ఇంకొకటి 11 టీఎంసీలు. ఈ మూడింటి మీద ఎల్లంపల్లి వద్ద 20 టీఎంసీలుంటాయి. రాజశేఖర్‌రెడ్డి పెట్టిన 14 టీఎంసీల ప్రాణహిత చేవెళ్ల నుంచి మేం 147 టీఎంసీల స్టోరేజీ గల బ్యారేజీలు కట్టినం. 200 కిలోమీటర్ల టన్నెల్స్, బహ్మాండమైన సర్జ్‌పూల్స్, 1500 కిలోమీటర్ల కాల్వలు తవ్వినం. మూడు బ్యారేజీల మీద కట్టిన అన్ని పిల్లర్లు క్షేమంగా నిక్షేపంగా ఉన్నయి. కాల్వల మీద కట్టిన బ్రిడ్జిలు, వాటి కింద కట్టిన వందలాది పిల్లర్లు క్షేమంగా ఉన్నయి. ఏం ప్రమాదం జరగలే. ప్రపంచం మునిగిపోలే. ఇటీవలే నా దాడికి తట్టుకోలేక నందిమేడారం పంపుహౌజ్‌ను కాంగ్రెసోళ్లే నడిపింద్రు. ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్, అన్నపూర్ణ టన్నెల్స్, సర్జ్‌పూల్స్ అని ఇన్‌టాక్ట్ ఉన్నాయి. ఒక్క మేడిగడ్డ బ్యారేజీ వివిధ బ్లాకుల్లో ఉన్నది. అందులోని 7వ బ్లాక్‌లో 10, 11 పిల్లర్లున్నాయి. వీటిలో రెండు పిల్లర్లు కొంచెం ఎక్కువగా, ఒక పిల్లర్ కొంచెం తక్కువ పగుళ్లు చూపాయి. ఎన్నికలకు ముందే పగుళ్లు వచ్చాయి. ఎందుకు జరిగిందని నేను ఆరాతీసిన. అంతకు ముందు సంవత్సరంలో 28 లక్షల క్యూసెక్కుల భయంకరమైన వరదొచ్చింది. అప్పుడే కన్నెపల్లి పంప్‌హౌజ్ మునిగింది. దాన్ని రిపేర్ చేసినం. ఇంతకు ముందు లేనట్టుగా ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్‌ఎం) ఈఎన్సీ పోస్టును క్రియేట్‌చేసినం. నాగేందర్ అనే మంచి ఇంజినీర్‌ను నియమించినం. సీఈ దానిని సరిచేయాల్సి ఉండె. అది సర్దకపోవడం వల్ల ఇసుక కుంగి ఒక బ్లాక్‌లో పగులొచ్చాయి. అట్లనే వదిలేస్తే కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ గవర్నమెంట్‌ను, కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మరింత బద్నాం, డ్యామేజీ చేయాలన్న దురుద్దేశంతో వదిలేశారు. ఇసుక కాఫర్ డ్యాం వేసినా పంపులు నీళ్లను పంపింగ్ చేస్తయి. కాంగ్రెసోళ్లు మొత్తం బ్యారేజీ కొట్టుకుపోవాలని చూశారు. ఈ ప్రభుత్వం ఈ ఒక్క బ్లాక్‌ను రిపేర్ చేయకపోయినా, మిగతా బ్లాక్‌లు వందేండ్ల వరకు అలాగే ఉంటాయి. తెలంగాణ రావడానికి ఒకటిన్నర సంవత్సరాలకు ముందే మిషన్‌కాకతీయ ప్లాన్ చేసినం కాబట్టే కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి నీళ్లు తెచ్చినం. మిషన్ కాకతీయతో చెరువుల నీటి సామర్థ్యాన్ని పెంచినం. కట్టలు బందబస్తుచేసినం. మత్తళ్లు, చెరువులు, తూములు బందబస్తు చేసినం. ఎంత పెద్ద వరదొచ్చినా కొట్టుకు పోకుండా చేసినం. కాళేశ్వరం కాలువలు, గతంలో ఉన్న కాలువల ద్వారా 11వేల చెరువులు నింపినం. మీ టీవీ 9లోను ఎండాకాలంలో మత్తళ్లు దుంకుతున్న చెరువులు, చెక్‌డ్యామ్‌లు అన్న వార్తలొచ్చినయి. రూ. 4వేలకోట్లు పెట్టి అన్ని ఉపనదులు, వాగులు, వంకల మీద 1200 చెక్‌డ్యామ్‌లు మంజూరుచేసినం. ఇప్పటికే ఐదారు వందలు నిర్మాణం పూర్తయినయి. హల్దీవాగు, కూడవెల్లి, మంజీరావాగు, నిజామాబాద్ జిల్లాలో పెద్దవాగు, కప్పలవాగు మీద చెక్‌డ్యామ్‌లు కట్టినం. మా ఎమ్మెల్యేలు నిలబడి చెక్‌డ్యామ్‌లు కట్టిచ్చారు. నీళ్లు కాల్వలకే ఇస్తం. వాగులకెట్ల ఇస్తమని ఇంజినీర్లు, ఐఏఎస్‌లు అంటరు. వాళ్లకు తెలంగాణ ఆత్మ తెలియదు. మేం పరిపాలకులం కాబట్టి తెలంగాణ ఎట్లా బతుకుతదో మాకు తెలుసు. అందుకే భూగర్భజలాలను బోర్లు ఎంత ఎత్తిపోస్తే అంత భూగర్భజలాలను రీచార్జ్‌చేసినం. మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లను రెండోపంటకే తీసుకుంటాం. సెప్టెంబర్, అక్టోబర్‌లోనే నీళ్లు తీసుకుంటం. ఆ సమయంలో 75-100 టీఎంసీల నీళ్లు తీసుకుంటం. మల్టీస్టేజ్ లిఫ్టుల ద్వారా పైకి పంపింగ్ చేస్తుంటం. కాబట్టి భూగర్భజలాలు పడిపోవు. బోర్లు ఎండిపోవు. పొలాలు ఎండిపోవు. ఇగ దొరికింద్రని పిచ్చి అదుర్దాతో కేసీఆర్‌ను బద్నాం చేయవచ్చని మొత్తం మేడిగడ్డ బ్యారేజీ గోల్‌మాల్ అన్నట్టు ప్రచారం చేస్తుంద్రు. మేడిగడ్డ బ్యారేజీ కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఒక భాగం మాత్రమే. ఒక్క చిన్న ప్రాజెక్ట్ మాత్రమే. దీని వ్యయం నాలుగు నాలుగున్నర వేలు కోట్లు. ఈ ప్రాజెక్టులో 88 పిల్లర్లు ఉంటే మూడు పిల్లర్లలో ఒక్కో పిల్లర్‌కు 40-50కోట్లు ఖర్చవుతుంది. మూడు పిల్లర్లు సరిచేస్తే 150 కోట్లలో అయిపోతుంది. ప్రాజెక్టుకేం ప్రమాదం రాలే. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం నుంచి స్వామిరెడ్డి అనే రైతు కాంగ్రెస్ దుర్మార్గులు కేవలం కేసీఆర్‌ను బద్నాంచేసేందుకు కాళేశ్వరం రిపేర్‌చేయక మన పొలాలు ఎండబెట్టింద్రని పేపర్ల వ్యాసం రాసిండు.



ప్రశ్న: కాళేశ్వరం ప్రాజెక్టుకు 90వేల కోట్ల ఖర్చయింది. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టు కట్టామని చెప్పగలరా?

కేసీఆర్: మేం కాదు, ప్రజలే చెప్తున్నరు. ఐదేండ్లు ప్రజలు కాళేశ్వరం ఫలితాలు పొందిద్రు. ఒకప్పుడు 40-50 టన్నుల వడ్లు పండించిన తెలంగాణ మూడున్నర కోట్ల టన్నులు ఎట్ల పండిచ్చింది? ఇది కాళేశ్వరం పుణ్యం కాకపోతే. లెట్ ది కాంగ్రెస్ ఆన్సర్ ది పీపుల్? ఊరికే ఇష్టమొచ్చిట్లు మాట్లాడతామంటే కుదరదు. మూడున్నర కోట్ల టన్నుల వడ్లు పండిన మాట నిజమా? కాదా? మేం పండించిన పంటను అసమర్థ నరేంద్రమోదీ ప్రభుత్వం కొనకపోతే, ఎఫ్‌సీఐ తీసుకోక మొండికేస్తే తెలంగాణ క్యాబినెట్, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఢిల్లీలో ధర్నాచేయలేదా?

కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మూడు బరాజ్‌లు. అసంపూర్తిగా ఉన్నటువంటి ఎల్లంపల్లిని, మిడ్‌మానేరును పూర్తి చేయడం. ఇది మల్టీస్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం. 200 కిలోమీటర్ల టన్నెల్స్ ఉన్నాయి. 9 సర్జుపూల్స్ ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కడుతున్నప్పుడు ఇక్కడికి వచ్చిన సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ కాళేశ్వరం ప్రాజెక్టు వండర్ అని, ల్యాండ్‌మార్క్ అని ప్రశంసించారు. ప్రాజెక్టుకు లోన్ ఇచ్చినటువంటి ఆర్‌ఈసీ ప్రాజెక్టుకు 'ఏ' గ్రేడ్ ప్రాజెక్టుగా కితాబిచ్చింది. హైకోర్టు అప్పటి సీజేఐ రాఘవేంద్రసింగ్ చౌహాన్ మరో ఐదారుగురు జడ్జీలతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. నందిమేడారం పంప్‌హౌస్‌ను చూసిన ఆయన ఆశ్చర్యపోయి హైదరాబాద్‌కు వచ్చి 'కేసీఆర్ గారు మీరు అనుకుంటే ఏమైనా చేయగలుగుతారు. మాకు హైకోర్టు భవనం కట్టించండి' అని అడిగారు.

ప్రశ్న: డ్యామ్ సేఫ్టీ అథారిటీ వచ్చి విచారించి తప్పు జరిగిందని రిపోర్ట్ ఇచ్చింది కదా?

కేసీఆర్: ఇటీవలే ప్రధానమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్‌లో గంగానది మీద బ్రిడ్జి కడుతుంటే బ్రిడ్జి కూలిపోయింది. బీహార్‌లో బ్రిడ్జి కూలిపోయింది. నదుల్లో, ఇసుకలో కట్టే ప్రాజెక్ట్‌లు కొట్టుకుపోతాయి. అమెరికాలో గతంలో హోవర్ డ్యామ్ కూలిపోయింది. మళ్లీ కట్టుకున్నారు. కడెం డ్యామ్ కొట్టుకుపోయింది. నాగార్జునసాగర్ కట్టిన తర్వాత కుడివైపు కూలిపోయింది. మళ్లీ సరిచేశారు. మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌ను కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తమ్ముడు కట్టిండు. ఒకటే వానకు కొట్టుకుపోయింది. ఆయన్ను జైలులో వేసినమా? కేసుపెట్టినమా? కట్టినప్పుడు జియాలజీ వాళ్లు టెస్టులు చేయలేదేమో, ఇంకోచోట కింద లీకేజీ ఏర్పడింది. దాన్ని మేం సరిచేసినం. తెలంగాణకు నీళ్లు రావాలె. పచ్చటిపంటలు పండాలె. ప్రజలు బతకాలన్నదే మా జిద్దు. మేం కాంగ్రెస్‌లా చిల్లర రాజకీయాలు చేయలే. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ప్రజలకు నీళ్లు ఇవ్వాలన్న తొందరలో ప్రజల మీదున్న ప్రేమతో తెలంగాణ ఆత్మను ఆవిష్కరించినోళ్లం కాబట్టి, ఉద్యమం చేసినోళ్లం కాబట్టి నీళ్లు తేవాలని తెచ్చినం. ఇచ్చినం. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఫలితాన్నిచ్చింది కదా! మూడున్నరకోట్ల టన్నుల పంటపండింది కదా. విజయవంతమైంది కదా.

ప్రశ్న: కాళేశ్వరం ద్వారా కేవలం 90వేల ఎకరాలకే నీళ్లు ఇచ్చారని కాంగ్రెస్ అంటున్నది.

జావాబు: ఇదంతా బ్లఫ్. ఈ కాకిలెక్కలు చెప్పడం మంచి పద్ధతి కాదు. తెలంగాణకు నీళ్లు ఇచ్చే ఒక వనరు గోదావరి. మేము కష్టపడి మేధోమథనం చేసి బ్రహ్మాండంగా కాళేశ్వరాన్ని తీసుకొచ్చాం. ఒక చిన్న లోపం జరిగింది. ఒక పన్ను ఊడితే.. మొత్తం 32 పండ్లు ఊడగొట్టు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఈ దెబ్బ కనిపిస్తది.

ప్రశ్న: మేడిగడ్డను ఎలా బాగు చేయాలి? మంత్రి ఉత్తమ్‌కు, సీఎంకు మీరేమన్నా సాంకేతిక సలహా ఇవ్వగలరా?

జవాబు: కాళేశ్వరంలో ఉన్న ఒక్క మేడిగడ్డ బ్యారేజ్‌లోని 7వ బ్లాక్‌లో 11 పిల్లర్లు ఉన్నాయి. వాటిల్లో రెండో మూడో క్రాక్ అయ్యాయి. ఆ బ్లాక్ మొత్తానికి సింగిల్ ర్యాఫ్ట్ తీసేసి కట్టాలన్నా ఖర్చు అయ్యేది రూ.400 నుంచి రూ.500 కోట్లే. మీరు చెయ్యకపోయినా మీ పరువు పోతది. ఒకవేళ కొట్టుకుపోవాలంటే మొత్తం పోదు.. ఆ ఒక్కబ్లాకే కొట్టుకుపోతుంది. అప్పుడూ మీ పరువే .

ప్రశ్న: కాళేశ్వరంతో 98వేల ఎకరాలు మాత్రమే సాగైందని అంటున్నారు?

కేసీఆర్: రబ్బిష్. మొత్తం 30-40లక్షల ఎకరాలు కాళేశ్వరంతోనే సాగవుతున్నది. కాళేశ్వరం లేకపోతే శ్రీరాంసాగర్ స్టేజ్-2 ఎక్కడుంది. తుంగతుర్తి, డోర్నకల్, సూర్యాపేట, మహబూబాబాద్‌కు శ్రీరాంసాగర్ నీళ్లు వచ్చినయా. పేరుకది ఎస్సారెస్పీ స్టేజ్ -2. కానీ ఎప్పుడన్నా భూపాలపల్లి, నర్సంపేట ప్రాంతాలకు ఎప్పుడన్నా నీళ్లు వచ్చాయా? వరంగల్ జిల్లాకు కడుపునిండా నీళ్లు వచ్చాయా? ఎప్పుడూ కరీంనగర్ జిల్లా దాటకపోయేవి.

ప్రశ్న: కాళేశ్వరం ద్వారా వ్యవసాయానికి అయ్యే ఖర్చుకంటే దానికయ్యే ఖర్చే ఎక్కువ అంటున్నారు. ఎకరానికి నీళ్లు ఇవ్వాలంటే లక్ష రూపాయలు ఖర్చు అవుతుంది. ఆదాయం మాత్రం రూ.50వేలు రావడం లేదని అంటున్నారు?

జవాబు: ఈ మంచి ప్రశ్న అడిగినందుకు నేను మిమ్మల్ని అభినందిస్తున్నాను. ప్రాణహిత చేవెళ్లను రాజశేఖర్‌రెడ్డి ఎందుకు మొదలు పెట్టారు? గోదావరం నుంచి నీళ్లు చేవెళ్లకు రావాలంటే ఇదే స్కేల్‌తోనే మొదలు పెట్టారు కదా? కల్వకుర్తి ఎందుకు మొదలుపెట్టారు? ఎందుకంటే ప్రాధాన్యతల క్రమంలో భౌగోళిక పరిస్థితులను అర్థం చేసుకొని, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రాజెక్టులు నిర్మిస్తాం. ఈ విషయాన్ని మేము అసెంబ్లీలో పదేపదే చెప్పాం. ప్రజలను బతికించడం కోసం, పరిశ్రమలు తీసుకు రావడం కోసం, సాగు, తాగునీటి అవసరాలను తీర్చుకోవడం కోసం ప్రాజెక్టు కట్టాం. అంతకుమించి మాకు మరే ప్రాధాన్యత లేదు. ఒక వేళ ఆ ప్రాజెక్టును కట్టకపోతే వచ్చే డబ్బులు ఏం చేయాలి? దేనికి ఖర్చు చేయాలి? ఎవరైనా ఎకనమిస్టు చెబుతురా? వారిదంతా బుర్రతక్కువ ఆలోచన. మళ్లీ బిందెలు పట్టుకోవాలి, ట్యాంకర్లు రావాలె, రైతులు భిక్షగాళ్ల లాగ ఉండాలె, తెలంగాణ ఎడారిలాగ ఉండాలి, వలసలు పోవాలనేది ఈ ప్రభుత్వ ఆలోచనా? 60వేల కోట్లతో మొదలైన బడ్జెట్.. 3 లక్షల కోట్లకు బడ్జెట్‌ను ఎలా తీసుకొచ్చాం? దానిని పూర్తిస్థాయిలో వాడితేనే కదా.. దాని లాభాలు తెలిసేది. సీడబ్ల్యూసీ చైర్మన్‌గా కాళేశ్వరాన్ని సందర్శించి.. తన ఇంజినీర్లను పంపిస్తాం.. వారికి మంచి శిక్షణ దొరుకుతుందని నాకు ఆయన చెప్పారు

ప్రశ్న: ప్రాణహిత క్రెడిట్ కాంగ్రెస్‌కే ఇస్తారా?

జవాబు: ప్రభుత్వం ఏదైనా మంచి జరిగినప్పుడు ఆ మంచిని ఒప్పుకోవాలి. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపివేస్తాం అనే బదులు.. మేము చేసిన మంచి పనులను గుర్తిస్తే సరిపోతుంది. ఆ నాడు వైఎస్ హయాంలో కొనసాగిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కొనసాగించాం. అసెంబ్లీనే నేను స్వయంగా ఒప్పుకున్నా. కనీసం పేరు కూడా మార్చబోమని చెప్పా. వీటితోపాటు కేసీఆర్ కిట్, అమ్మ ఒడి, బస్తీదావఖానా, పల్లె దావఖానా పెట్టాం. మాకంటే ఎక్కువ చేయాలి కానీ దిగజారకూడదు.

ప్రశ్న: మేడిగడ్డ గురించి ఇంకేమైనా చెబుతారా?

జవాబు: కాళేశ్వరంలో మేడిగడ్డ ఒక కాంపోనెంట్ మాత్రమే. జరిగింది చాలా చాలా చిన్న క్రాక్ మాత్రమే. దాన్ని బూతద్దంలో చూడొద్దు. కొత్తగా కట్టిన ప్రాజెక్టులు సెటిల్ అవుతుంటే కొన్ని సమస్యలు వస్తాయి. వాటిని పరిష్కరించాల్సిందే. శ్రీశైలంలో కూడా చేశారు. దేశంలో అన్ని చోట్లా చేస్తారు. కేసీఆర్‌ను బద్నాం చేద్దామనే ప్రయత్నం ఆపాలి. లేకపోతే ప్రభుత్వం వదిలేస్తే ఊరుకోం. ఇది ప్రజా యుగం. ప్రజలే పోయి దాన్ని నిర్మించుకుంటారు.

మేము కాళేశ్వరాన్ని సందర్శించాం. చాలా ప్రణాళికాబద్ధంగా నిర్మించారు. నాణ్యతతో కూడిన పనులు జరిగాయి. తెలంగాణకు ఇదొక లాండ్‌మార్క్ ప్రాజెక్ట్. నేను ఈ ప్రాజెక్టును సందర్శించినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాను. ఇదొక పెద్ద ప్రాజెక్ట్, చాలా చాలెంజింగ్ ప్రాజెక్ట్. శాస్త్ర, సాంకేతికంగా,నాణ్యమైన పద్ధతిలో నిర్మాణం జరిగింది.

-సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ మసూద

కాళేశ్వరాన్ని డిజైన్ చేయలే.. సలహాలు ఇచ్చా

ప్రశ్న: కాళేశ్వరం డిజైన్ మొత్తం మీరు చేశారంటూ కాంగ్రెస్ చెబుతున్నది?

కేసీఆర్: కాళేశ్వరం డిజైన్ నేను చేయలేదు. ఇంజినీర్లు చేశారు. నేనే డిజైన్ చేశాననడం కాంగ్రెస్ వాళ్ల వాళ్ల మూర్ఖత్వానికి పరాకాష్ట. అది వాళ్ల విజ్ఞతకే వదిలేయాలి. నేను ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్‌ను కాదు. అలాంటప్పుడు నేనెలా డిజైన్ చేస్తాను. రాజకీయ నాయకులం స్ట్రాటజిస్టులమే తప్ప డిజైన్లు చేసేవాళ్లం కాదు. వైఎస్సార్‌ప్రాణహిత చేవెళ్లను మొదలుపెట్టారు. దీని కెపాసిటీ కేవలం 14 టీఎంసీలు. ఒక పంపు పోస్తే మరో పంపు నడవాలి. కరెంట్ పోతే నడవదు. అంటే వాళ్లకు తెలంగాణకు నీళ్లు ఇచ్చే ఉద్దేశం లేదు. కాబట్టి 14 టీఎంసీలు కాదు. దీన్ని మొత్తం రీడిజైన్ చేయాలని ఇంజినీర్లకు చెప్పా. ఇది కేసీఆర్ స్ట్రాటజీ. వాళ్లు తమ్మిడిహట్టి నుంచి తీసుకుంటామన్నారు. ఇదోక పెద్ద కుట్ర. తమ్మిడిహట్టి నుంచి కింద ఉన్నటువంటి 100-150 టీఎంసీలు ధవళేశ్వరం వెళ్లాలి. అక్కడ తెలంగాణను ముట్టుకోనివ్వరు. కాబట్టి మా ఇంజినీర్లతో చెప్పి సర్వే చేయించడమే కాకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సెంట్రల్ వాటర్ కమిషన్ పరిధిలోని వ్యాప్కోస్‌ను పిలిపించాము. వ్యాప్కోస్ వాళ్లే పూర్తిగా సర్వే చేశారు. ఇంకా పూర్తి స్థాయిలో రావాలంటే రక్షణ మంత్రిత్వ శాఖ అనుమతి తీసుకొని సర్వే చేయించాం. ఇందుకు సంబంధించి లారీల కొద్దీ ఫైల్స్ ఉన్నాయి. వీటిని ఎవరైనా చూసుకోవచ్చు. 'మీరు తీసుకోవాలనుకుంటున్న నీళ్ల మొత్తాన్ని తమ్మిడిహెట్టి వద్ద తీసుకోలేరు' అని సీడబ్ల్యూసీ, వ్యాప్కోస్ రిపోర్ట్ ఇచ్చాయి. ఇక నీళ్లు ఎక్కడ తీసుకోవాలంటే ప్రాణహిత గోదావరిలో కలిసిన తర్వాత తీసుకోవాలి. అదే మేడిగడ్డ. అక్కడ బరాజ్ నిర్మించినం. ఉమ్మడి రాష్ట్రంలో గోదావరిపై చిన్న ఆనకట్ట కూడా కట్టలేదు. డైరెక్ట్‌గా ఎస్సారెస్పీ నుంచి ధవళేశ్వరం. ఇక్కడ చుక్క నీళ్లు కూడా ఆగవు. పక్కన గోదావరి నీళ్లు పోతుంటాయి కానీ దేవాదులకు నీళ్లురావు. ఇదీ పరిస్థితి. మరి నీళ్లు ఎలా తీసుకోవాలి. రైతులు నష్టపోకుండా తక్కువ ముంపుతో వరద సమయంలో పైకి తీసుకెళ్లి స్టోర్ చేసుకోవాలి. ఇందుకోసం మూడు బ్యారేజీలు పూర్తి చేయాలి. ఎల్లంపల్లి తర్వాత మిడ్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్. ఈ క్రమంలో ఒక్కో స్టేజీలో



లక్షల ఎకరాలకు సాగు నీళ్లు అందుతున్నాయి. తెలంగాణ రాకముందు, కాళేశ్వరం లేకముందు శ్రీరాం సాగర్ ప్రాజెక్టే పూర్తిగా ఎండిపోయింది. అప్పుడు మేం అనుకున్నది.. అవసరమైతే శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరుకు కూడా కాళేశ్వరం ద్వారా నీళ్లు అందించాలని. ఇలా కాళేశ్వరం ప్రాజెక్టుతో 40 లక్షల ఎకరాలకు ఢోకా లేదు. ప్రాణహితకు ఉన్నటువంటి గొప్పతనం. దేశం మొత్తం కరువు ఏర్పడిన పరిస్థితుల్లోనూ 465 టీఎంసీల నీళ్లు వచ్చాయి. అంటే నీళ్లకు ఢోకా లేదు. అక్కడి నుంచి నీళ్లు తీసుకోవచ్చు.

ప్రశ్న: ఎందుకు రేవంత్‌కి మీరంటే అంత కోపం?

జవాబు: అది కోపం కాదు. ఒకరకమైన అజ్ఞాన తిమిరం. తెలంగాణ వచ్చిన కొత్తలో రాష్ట్రాన్ని ఆగం చేయాలని, తెలంగాణను ఆంధ్రాలో కలపాలని అనుకున్నారు. అందుకు జరిగిన ప్రయత్నం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ. అందుకు ఓటుకు నోటు అనే విషప్రయోగం జరిగింది. అందులో స్టీఫెన్‌సన్ అనే ఎమ్మెల్యేను కొనాలని రూ.50 లక్షలు పంచుతూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడిన దోషి అతను. ఇప్పుడా కేసు సుప్రీంలో ఉంది. అప్పుడు పట్టుబడ్డాడు కాబట్టే.. అతనికి నాపై కోపం. ప్రత్యేకతంగా, వ్యక్తిగతంగా ఏమీ లేదు.

ప్రశ్న: సాగునీటి రంగానికి సంబంధించి ప్రతిరోజూ ఏదో ఒక విమర్శలు వస్తూనే ఉన్నాయి?

జవాబు: మేమూ వాటిని వదిలేద్దామనే అనుకుంటున్నాం. వీటికి వేసే టెండర్లు చాలా పారదర్శకంగా ఉంటాయి. ఎల్‌ఎండ్‌టీకి అంతర్జాతీయ గుర్తింపు ఉంది. మేడిగడ్డ కట్టింది ఎల్‌ఎండ్‌టీ. రెండోది కట్టింది ఆఫ్కాన్స్. ఇంకొకటి నవయుగ. ఎల్‌అండ్‌టీ కంపెనీ వాళ్లు రిపేర్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని అంటున్నారు. అయినా వీళ్లు ఒప్పుకోవడం లేదు. మా హయాంలో 18 పంటలకు ఒక్క పంట ఎండకుండా బ్రహ్మాండంగా నీళ్లు ఇచ్చాం.

ప్రశ్న: రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గానికి నీళ్లు తెస్తా అంటుండు?

జవాబు: కొడంగల్‌కు నేను కొత్త ప్రాజెక్టు కడతా అని కొత్త దుకాణం పెట్టిండు. జూరాల ప్రాజెక్టుపై ఒత్తిడి పెరుగుతుంది. దాని సామర్థ్యమే 17 టీఎంసీలు. దాని లైవ్ కెపాసిటీ 11 టీఎంసీలు. అందులో యూజ్‌ఫుల్ వాటర్ 6 టీఎంసీ. దానిమీద భీమా లిఫ్ట్, నెట్టంపాడు, గట్టు లిఫ్టు ఉన్నాయి. వీటికితోడు మళ్లీ ఓ లిఫ్టు పెడతామంటే ఎలా? జూరాలలో స్టోరేజ్ కెపాసిటీ లేదు. అందుకే పాలమూరు ఎతిపోతల పథకం పాయింట్‌ను శ్రీశైలంలో పెట్టినం. అక్కడ 200 టీఎంసీ కెపాసిటీ ఉంది. కేసీఆర్ ఆనవాళ్లు కాబట్టి పాలమూరు ప్రాజెక్టును పక్కన పెట్టారా? ఎందుకు డబ్బులు ఇవ్వడం లేదు. దీనిపై ప్రజలతో ఉద్యమాలు చేయిస్తాం.

ప్రశ్న: డ్యామ్‌సేఫ్టీ ఆథారిటీ చెప్తేనే ఖాళీ చేశామంటున్నారు?

కేసీఆర్: ఎవరూ చెప్పలే. ఎవరూ ఖాళీ చేయమనలే. పగుళ్లు చూపిన తర్వాత 50-60 టీఎంసీల నీళ్లు వృథాగా వదిలిపెట్టారు. నీళ్లు వదిలిపెట్టాలని ఎవరూ చెప్పలె. వీళ్ల మూర్ఖత్వానికి నీళ్లను వదిలేశారు.

ప్రశ్న: కేసీఆర్ ఆనవాళ్లు అన్నీ తీసేస్తాం అని సీఎం రేవంత్‌రెడ్డి అంటుండు?

జవాబు: ఎప్పుడు చూసినా కేసీఆర్ ఆనవాళ్లన్నీ తీసేస్తా అంటుండు. సాధ్యమైతదా? నువ్ కూర్చుంటున్న సెక్రటేరియట్ ఎవరు నిర్మించింది? మీ ఎమ్మెల్యేల క్వార్టర్లు ఎవరు నిర్మించారు? యాదాద్రి దేవాలయం, పాలమూరు, సీతమ్మ సాగర్, సమ్మక్క బ్యారేజీ, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఎవరు నిర్మించారు? వాటిని కూల్చేస్తవా? కేసీఆర్ 33 కొత్త జిల్లాలు పెట్టిండు తీసేస్తవా? కొత్త మండలాలు తీసేస్తావా? తండాలను గ్రామ పంచాయతీలను చేసిండు తీసేస్తవా? అట్లయితే తెలంగాణనే తీసేయ్యాలి. 'ఒకరి ఆనవాళ్లు తీసేయడమంటే మూర్ఖత్వానికి పరాకాష్ట. కేసీఆర్ హిస్టరీ ఆఫ్ తెలంగాణ. చరిత్రను సృష్టించిన వ్యక్తి కేసీఆర్. తెలంగాణ తెచ్చిన వాడు కేసీఆర్.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

అనుసంధానంలో తిరకాసు

తమిళనాడులో ఏ మాత్రం సందు దొరికినా కాలు మోపాలని బీజేపీ తెగ ఆరాటపడుతున్నది. ప్రధాని నరేంద్ర మోదీ ఆ రాష్ట్రంలో అదేపనిగా చక్కర్లు కొడుతున్నారు. తమిళ తంబిలను దువ్వేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నదుల అనుసంధానం అంశాన్ని కేంద్ర సర్కారు బయటకు తీయడం గమనార్హం. ఇచ్చంపల్లి ఎత్తు పెంచి తమిళనాడుకు నీళ్లను తరలించే లివర్ లింకు గురించి పార్లమెంటు ఎన్నికల పోరు ఊపందుకున్న సమయంలో నేషనల్ వాటర్ డెవలప్ మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) అనే కేంద్ర సంస్థ చేస్తున్న హడావుడిని అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి అయినా తమిళనాడుకు నీళ్లు అందిస్తామనే ధోరణిలో ఆ సంస్థ మాట్లాడటం అనుమానాలకు తావిస్తున్నది.

గోదావరి-కావేరీ అనుసంధానానికి ఛత్తీస్‌గఢ్ వాడుకోకుండా వదిలేస్తున్న 148 టీఎంసీల నీటిని వాడుకుంటామని కేంద్రం అంటున్నది. గోదావరి నుంచి కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలానికి, అటునుంచి తమిళనాడులోని కావేరీ బేసిన్‌కు నీళ్లను తరలించే ప్రక్రియను ముందుకు తీసుకుపోతున్నట్టు కేంద్రం సంకేతాలిస్తున్నది. దీనివల్ల అంతిమంగా తెలంగాణ ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చంపల్లి నిర్మాణం వల్ల బరాజ్ ఎగువన ఉండే తెలంగాణ ప్రాజెక్టులు ముంపునకు గురవుతాయి. దిగువన ఉండే ప్రాజెక్టులకు నీళ్లందవు. అన్నిటికన్నా కీలకమైన అంశం మేడిగడ్డ బరాజ్ భవిష్యత్తు. కొత్త రాష్ట్రమైన తెలంగాణకు ఒక్క జాతీయ ప్రాజెక్టు ఇవ్వని కేంద్రం తెలంగాణకు కొత్తజీవం పోసిన మేడిగడ్డ బరాజ్‌ను పండబెట్టేందుకు కుట్రలు పన్నుతున్నది. మేడిగడ్డ మరమ్మతులపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదిక రాకముందే.. అది నిరర్థకమైతే ఇచ్చంపల్లి డ్యాం ఎత్తు పెంచి ఇటు తెలంగాణకు, అటు తమిళనాడుకు నీళ్లు తరలిస్తామని కేంద్రం అనడం కచ్చితంగా పెద్ద కుట్రేనని చెప్పాలి. దీనివల్ల తెలంగాణకు ముంపు సమస్య తలెత్తడమే కాకుండా నీటి హక్కులూ ప్రమాదంలో పడతాయి. ఇది భావావేశాలతో కూడుకున్న అంశం. దీని వెనుకనున్న అసలు ఉద్దేశాలు ఏమిటో విడిగా చెప్పాల్సిన పనిలేదు.

తమిళనాడుకు నీటిని ఎలాగైనా తరలించుకుపోతామని హంగామా చేయడాన్ని ఎలా చూడాలి? జాతీయపార్టీలు రైల్వేల వంటి ప్రజాసేవా విభాగాలను స్వీయ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవటం మనకు తెలిసిందే. ఇప్పుడు ప్రాజెక్టులు, నదీజలాలు ఆ కోవలోకే వచ్చి చేరాయన్న మాట. నదుల అనుసంధానంలో పరీవాహక ప్రాంతాల అవసరాలు, హక్కుల పరిరక్షణ తప్పనిసరి. అంతర్జాతీయ సంప్రదాయాలూ ఇదే చెప్తున్నాయి. ప్రాజెక్టులు కట్టి ఉంటే వాటి మేరకు నీటి హక్కులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పుడు నదుల అనుసంధానం పేరు మీద ఇచ్చంపల్లిని ప్రతిపాదించి తెలంగాణ నీటి భరోసాను ప్రమాదంలో వేస్తున్నది కేంద్ర ప్రభుత్వం. కండ్లల్లో వత్తులు వేసుకొని కాళేశ్వరం కట్టించిన కేసీఆర్ అధికారంలో లేకపోవడమే ఈ బరితెగింపునకు కారణమని చెప్పాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించే ప్రాంతీయ పార్టీ నేతగా కేసీఆర్ తపన వేరేగా ఉంటుంది. ఆ సోయి లేని ఢిల్లీపార్టీలకు అధికారం అప్పగిస్తే అంతిమంగా నష్టపోయేది మన రాష్ట్రం, మన ప్రజలే. ఇచ్చంపల్లి ప్రతిపాదనే ఇందుకు నిదర్శనం.

జాతీయ పార్టీల జులుంపై గులాబీ గళం

ఇప్పుడు మనం వేయబోయే ఓట్లు ఎంపీలను పార్లమెంటు మెట్లు ఎక్కిస్తాయి. కేంద్రంలో మళ్లీ పీఠం తమదేనని, ఆ పీఠం తమ హక్కు అని ఎన్డీయే భావిస్తున్నది. కాదు, కాదు ఈసారి అధికారం తమదేనని ఇండియా కూటమి అంటున్నది. ఎన్డీయేకు నేతృత్వం వహిస్తున్న బీజేపీ-మోదీ, ఇండియా కూటమిని నడిపిస్తున్న కాంగ్రెస్-రాహుల్ ప్రజలపైనే ఒక రకమైన జులుం చేస్తున్నాయి. రాజ్యాంగాన్ని మార్చడానికే 400 ఎంపీల గెలుపు లక్ష్యాన్ని మోదీ విధించుకున్నారని ప్రజలను కాంగ్రెస్ హెచ్చరిస్తున్నది. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. మంగళ సూత్రాలనూ విడవకుండా ఆస్తులు చెరబడుతుందని మోదీ భయపెడుతున్నారు.

పౌరుల మెప్పు, విశ్వాసం పొందడానికి బదులు బెదిరించి, భయపెట్టే రకంగా జులుం కాని జులుం ప్రదర్శిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో లోక్‌సభలో గులాబీ గళం ధ్వనించాలనే ఆకాంక్షకు విస్తృతి పెరుగుతున్నది. ఏ అంశాన్నైనా పాలకు పాలు, నీళ్లకు నీళ్లలా వేరుచేసి విశదీకరించి చెప్పే కేసీఆర్ వంక నిజానిజాల కోసం జనావళి చూస్తున్నది. నాయకత్వ లోటు పుణికిపుచ్చుకున్న ఇండియా కూటమి హస్తాలే ఎన్డీయే హ్యాట్రిక్ పల్లకి మోయాలని మోదీ కోరుకుంటున్నట్టే కాంగ్రెస్ చేజేతులా చేస్తున్నట్టుంది!



ఇల్లెందుల దుర్గాప్రసాద్
94408 50384



కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే పుస్తెలతాడును వదలకుండా ఆస్తులు గుంజుకుంటుందనే భ్రాంతిని స్వయానా మోదీ సృష్టిస్తున్నారు. నిజానికి చట్ట వ్యతిరేకం కానంతవరకూ ఎవరి వ్యక్తిగత ఆస్తులూ లాక్కొనే వీలుండదు. అక్కడిదాకా వస్తే సెంట్రల్‌లో ఏ పార్టీ/ ఏ అలయెన్స్ అధికారంలోకి వచ్చినా అంతే. కాబట్టి మోదీ, బీజేపీ మాయలోకి జారకుండా మోదీ-షా ద్వయం ప్రచారం చేస్తున్న సందేహాలు కేవలం అపోహలేనని జనాలకు సావధానంగా చెప్పగలిగే ఘనమైన గొంతుగా కేసీఆర్‌ను చూస్తున్నారు.

విదేశాల్లోంచి మన దేశపు నల్లధనం రికవరీ చేసి, ఇంటింటికీ రూ.15 లక్షలు పంచడమే రెండు పర్యాయాల సుదీర్ఘ కాలంలో మోదీ సర్కారుకు సాధ్యం కానప్పుడు.. మన దేశ మెజారిటీ ప్రజల ఆస్తులు గుప్పిట పట్టి మరో మతం వాళ్లకు పంచడం కాంగ్రెస్‌కైనా, ఇండియా కూటమికైనా ఎట్లా సంభవం? ఈ సూక్ష్మాన్ని ప్రజలకు వివరించడంలో హస్తం విఫలమవుతున్నది. ఎంతసేపు మతోన్మాద పార్టీ అంటూ బీజేపీని, మోదీని తిట్టడమే కాంగ్రెస్ చేస్తున్న పని. ఆ తరహా చివాట్లు, మూస ధోరణుల వల్లే వరుసగా రెండుసార్లు విజయంతో కమలం విరబూసి మురిసింది. ఇండియా కూటమిని లీడ్ చేస్తున్న కాంగ్రెస్ చెయ్యితోనే ఎన్డీయే హ్యాట్రిక్ పల్లకీ మోయించాలనే మోదీ అప్‌డేటెడ్ ప్లాన్ కిటుకు కనిపెట్టలేక రొటీన్ విమర్శలకే పరిమితం అవుతున్నది. అయోధ్యలో రామాలయానికి అదనంగా తన మేనియా నెలకొన్న మోదీ మొదటి దశ పోలింగ్ సరళి మేరకు ఇప్పుడు వ్యూహాల్లో ఆస్తులకు అపాయమనే బూచిని ఉపాయంగా జత చేశారు. మతం పేరిట ఓట్ల రాజకీయాలనే ముద్ర మరింత గట్టిగా నాటుకోవాలి. ఆ మేరకు తానే మెజారిటీ వర్గమైన ఓటరు మైండ్‌లో సెటిలవ్వాలి. తాను చెప్పేదానికన్నా కాంగ్రెస్, వామపక్షాలే ఎక్కువగా మొత్తుకొని టాంటాం చేయాలి. తద్వారా కాంగ్రెస్ వల్ల తమకు ఇంత నష్టం పొంచి ఉంటుందనే భావనతో దేశంలోని 144 కోట్ల జనాభాలోని మెజారిటీ ప్రజల ఆదరణ కొనసాగాలి. అత్యధికులైన మతం వారి సంఘటితంతో టోకున ఈవీఎంలపై మీట నొక్కించుకోవాలనేదే మోదీజీ అసలైన కిటుకు బోధపడుతున్నది.

అయోధ్యలో రాములోరి కోవెలతో ప్రజల్లో ఆధ్యాత్మిక సంతృప్తి కలిగించిన మోదీకి ఇంకా ఏదో వెలితి తోచినట్టుంది. వీస్తున్నట్టుగా భావిస్తున్న తన గాలి మీదా మనసు పూర్తిగా నిండటం లేదేమో. కేంద్రపాలిత ప్రాంతాలు సహా 21 రాష్ట్రాల్లో 102 చోట్ల ముగిసిన తొలి దశ పోలింగ్ సరళి మోదీకి ఎటువంటి ఉప్పందించిందో! అకస్మాత్తుగా ఎప్పుడో 2006లో నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ వ్యాఖ్యలుగా ప్రధాని నరేంద్ర మోదీ 18 ఏండ్ల అనంతరం ఉటంకిస్తున్నారు. మెజారిటీగా ఉన్న ఒక మతం వారి ఆస్తులు లాగేసి మైనారిటీలకు పంచడమే ఇండియా కూటమి విధానమనే భయాన్ని పౌరుల మీదికి మోదీ విసురుతున్నారు.

రాజస్థాన్‌లో ఆ విధంగా గురిపెట్టి.. యూపీ మీదుగా అంతకుమించిన ఊపుతో దక్షిణాదికి రేపో ఎల్లుండో రాబోతున్నారు. మొత్తానికి దేశంలో ఆ మూల నుంచి ఈ మూలకు పోలింగ్ జరగాల్సిన పార్లమెంటు స్థానాల్లో ఇదే అంశాన్ని హైలైట్ చేసేలా ఉన్నారు. మోదీ-బీజేపీ, కాంగ్రెస్-రాహుల్ గాంధీల గందరగోళ ఉపన్యాసాల్లోని నిజాలను ప్రజలకు వివరించి, మంచి చెడుల చైతన్యం వ్యాప్తి చేయడంలో బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ అవసరం చాలా ఏర్పడుతున్నది. వాస్తవానికి, ప్రాక్టికల్‌కు దగ్గరగా ప్రజలకు వివరించే ఖ్యాతి సొంతమైన కేసీఆర్ దక్షిణాదికి వరమైన జనజీవన స్వరం. సౌత్‌లోని 130 లోక్‌సభ సీట్లలో ఎన్ని ఎక్కువ స్థానాలు గెలువగలిగితే అంతగా అధికారానికి, లక్షిత 400 ఎంపీల బలగానికి ఎన్డీయే చేరువవుతుందనే అంచనాలు, ఆశలతో తెలంగాణపై మోదీ నజర్ పెట్టారు. అలాంటి ఆశలతోనే కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. కాంగ్రెస్, బీజేపీలను వెనక్కు నెట్టి, మెజారిటీ స్థానాల్లో బీఆర్ఎస్‌ను విజేతగా నిలిపేందుకు ప్రజల్లోకి కేసీఆర్ వెళ్తుండటం సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్నది.

(వ్యాసకర్త:సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

నికార్సయిన నాయకుడు

ఇది కేసీఆర్ ఓటమి కాదు, తెలంగాణ ప్రజల ఓటమి. ఓడిపోయింది బీఆర్ఎస్ కాదు, తెలంగాణ. పదేండ్ల పాటు రారాజులా బతికిన తెలంగాణ.. నేడు కాంగ్రెస్ పాలనలో గోస పడుతున్నది. సాగు నీళ్లు లేక, పంటలు ఎండిపోయి రైతాంగం తల్లడిల్లిపోతున్నది. తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. 'మార్పు.. మార్పు..' అంటూ కాంగ్రెస్‌ను నమ్మి తినే అన్నంలో మట్టి పోసుకున్నరు.

దేశానికి అన్నం పెట్టే రైతన్న సంక్షేమాన్ని కాంక్షించే పాలకుడే నిజమైన, నికార్సైన దేశ భక్తుడు. ఆ లెక్కన చూస్తే రైతును కంటికి కాచుకున్న తెలంగాణ రథసారథి కేసీఆర్‌ను మించిన దేశభక్తుడు ఎవరున్నారు? దేశభక్తి అంటే నిత్యం తప్పుడు ప్రచారాలు చేయడం కాదు. దేశభక్తి అంటే ప్రజల క్షేమాన్ని కాంక్షించడం. వారి మంచి కోసం నిత్యం మథనపడటం. ఆ గుణం కేసీఆర్‌లో పుష్కలంగా ఉన్నది. పాజిటివ్‌గా ఆలోచించే వాళ్లకు, సమాజాన్ని ప్రేమించే వాళ్లకు మాత్రమే కేసీఆర్ ఆలోచనలు, ఆశయాలు, ఆయన పథకాలు అర్థమవుతాయి. చిల్లర మాటలు మాట్లాడుతూ అదే రాజకీయమని అనుకునేవాళ్లకు కేసీఆర్ ఆలోచనలు, ఆచరణలు అర్థమయ్యే అవకాశమే లేదు. తెలంగాణ ఏమైపోయినా ఫర్వాలేదు కానీ కేసీఆర్ అధికారంలో ఉండొద్దని కుట్రలు చేసే మూర్ఖులు తప్ప బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలందరూ సంతోషంగానే ఉన్నారు. ప్రజలందరి సమస్యలను ఒకేసారి పరిష్కరించడం ఏ పాలకుడికీ సాధ్యం కాదు. ఒకప్పటి తెలంగాణ ఎలా ఉండేది? ఇప్పుడు ఎలా ఉందనేది ప్రతి ఒక్కరికీ తెలుసు. సరైన పాలకుడు లేక నానా కష్టాలు పడుతున్న రాష్ట్రాలు, దేశాలు చాలా ఉన్నాయి. తెలంగాణపై విషం చిమ్మేవాళ్ల మాటలు పొరపాటున నమ్మితే మళ్లీ మన రాష్ట్రం మరో 20 ఏండ్లు వెనక్కివెళ్లిపోతుంది. తెలంగాణ వ్యతిరేకులు ఒక్కటవుతున్నారు. తెలంగాణ ప్రేమికులందరూ ఏకం కాకపోతే నష్టపోయేది మనమే.

కేసీఆర్ ఆషామాషీ నాయకుడు కాదు. తెలంగాణ పట్ల నిబద్ధత కలిగిన నాయకుడు. అందుకే దశాబ్దాలుగా ఎవరికీ సాధ్యం కాని తెలంగాణను సాధించారు. సాధించిన తెలంగాణను ప్రగతి పథంలో నడిపారు. కనీసం మూడు దశాబ్దాల సమయం పట్టే కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టును మూడేండ్లలోనే పూర్తిచేసి తెలంగాణను సస్యశ్యామలం చేశారు. సాగును బాగు చేశారు.

విమర్శలు ఆయనకు కొత్తకాదు. బహూశా ఈ దేశంలో ఆయనకున్నంత శత్రువులు (రాజకీయంగా) ఎవ్వరికీ ఉండకపోవచ్చు. తెల్లారి లేస్తే కేసీఆరే వారి టార్గెట్. అయితే విమర్శ అనేది కొంచెం వివరణాత్మకంగా ఉండాలే. కానీ, ఈ మూర్ఖుల ముఠా చేసే విమర్శలు అర్థం పర్థం లేనివి. ఒక ఆరోపణ చేస్తారు. కానీ, దాన్ని నిరూపించరు. అడ్డదిడ్డంగా మాట్లాడుతారు. ఒక నాయకుడి గురించి మాట్లాడేటప్పుడు కొంత విజ్ఞత అవసరం. ఆ విజ్ఞతను కోల్పోయి వికృత చేష్టలతో కొందరు మూర్ఖులుగా మిగిలిపోతున్నరు. ఎవరో చెప్పేది కాదు, కేసీఆర్ అంటే ఏంటో చరిత్ర చెప్తుంది. ఆయన్ను ఎంత అణగదొక్కాలని చూస్తే అంతకు రెట్టించిన వేగంతో పైకి లేస్తడు. ఇది చరిత్ర చెప్తున్న సత్యం.



ఆలేటి రమేష్
99487 98982

విషం చిమ్ముతున్న ఎన్నికల ప్రచారం

'దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపద మొత్తం ముస్లింలకు పంచుతుంది.. మహిళల మంగళ సూత్రాలనూ వదలరు, ముస్లింలకే పంచేస్తారు..' రాజస్థాన్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగం ఇది. ఇక మన రాష్ట్రానికి వస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయిని కూడా మరిచిపోయి 'మానవ బాంబులమవుతాం, పేగులు మెడలో వేసుకుంటా, ఉరికించి కొడతా' అంటూ ప్రసంగిస్తున్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో రాజకీయపార్టీల ప్రసంగాలు ఈ స్థాయిలోనే ఉన్నాయి. ఎన్నికలు, ప్రజాస్వామ్యం అంటేనే ప్రజలు అసహ్యించుకునే స్థాయిలో నాయకుల మాటలు సాగుతున్నాయి.

హైదరాబాద్ మహా నగరంలో పాతబస్తీలో కేవలం మత ప్రాతిపదికనే ఎన్నికల ప్రచారం సాగుతుంది. బీజేపీ, ఎంఐఎం పార్టీలు మతం పేరుతోనే ప్రచారం సాగిస్తుంటాయి. ఒక పార్టీ అభ్యర్థి మరో పార్టీ మతానికి చెందిన ప్రార్థనాలయంపైకి బాణం ఎక్కుపెట్టి కొట్టినట్టు నటిస్తే దానికి బోలెడు ప్రచారం. ఇలాంటి కవ్వింపు చర్యలు ఆయా మతాల వారి అభిమానాన్ని సంపాదించవచ్చు, మతం ఓట్లు సంపాదించవచ్చు కానీ, ఆ ప్రచారం సమాజంపై చూపే దుష్ప్రభావం వీరికి అవసరం లేదు. రెచ్చగొడితే ఓట్లు వస్తాయి, విజయం సాధిస్తే చాలు సమాజంపై అది ఎలాంటి ప్రభావం చూపిస్తుందనేది వీరికి అవసరం లేదు.



బుద్దా మురళి



బేగంబజార్‌లో హోల్‌సేల్‌లో గతంలో అల్లం వెల్లుల్లి పేస్ట్ కిలోకు రూ.20 అని తెలిసి ఆశ్చర్యం వేసింది. అప్పుడు అల్లం కిలో వంద రూపాయలు. రూ.100కు కిలో అల్లం ఉంటే దాన్ని పేస్ట్ చేసి రూ.20కి కిలో ఎలా అమ్ముతారు? వ్యాపారుల్లో మరీ ఇంత సేవాభావమా? అని ఆశ్చర్యం వేసి వివరాలు తెలుసుకుంటే, సేవాభావం కాదు, మన్ను కాదు. ఫక్తు లాభాపేక్ష. ఆంధ్రా నుంచి ప్రతి రోజు పెద్ద ఎత్తున నగరానికి అరటి పళ్లు తీసుకువస్తారు. వాటితో పాటు అరటి బోదెలు ఉచితంగా లభిస్తాయి. అరటి బోదెలు, ఆలుగడ్డ పేస్ట్ చేసి, వాసన కోసం కొద్దిగా అల్లం వెల్లుల్లి పేస్ట్ కలిపి అమ్ముతారు. అలా చేయడం అన్యాయం, పాపం కదా? అంటే వారికి కావలసింది వ్యాపారంలో కేవలం లాభమే కానీ, పాపపుణ్యాలు కాదు. ఈ కల్తీ సరుకు తిని ప్రజలు అనారోగ్యాలపాలైనా వారికి అవసరం లేదు. కనికరం ఉండదు, పాపభీతి ఉండదు. సరిగ్గా రాజకీయ వ్యాపారాలు సైతం అంతే. కావలసింది రాజకీయ వ్యాపారంలో లాభమే తప్ప సమాజానికి కలిగే లాభనష్టాల గురించి వారికి పెద్దగా ఆలోచన ఉండదు. రాజకీయపక్షాలు, రాజకీయ నాయకులు రాజకీయాన్ని కేవలం వ్యాపారంగానే చూస్తున్నారు. ప్రజలు సైతం ఇది మనకు సంబంధం లేని వ్యాపారం అన్నట్టుగా వదిలివేశారు. గల్లీ లీడర్లు ఉద్రిక్తతలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడితే వేరు, ప్రధాని స్థాయి వ్యక్తి అలా మాట్లాడితే కిందివారు వారినే అనుసరిస్తారు.

బండి సంజయ్‌తో పోటీ పడి నరేంద్ర మోదీ మాట్లాడితే ఏం చేయగలం. దేశ సంపదను అంతా చొరబాటుదారులకు, ఎక్కువ మంది పిల్లలున్నవారికి పంచుతారు, మీ మహిళల మంగళసూత్రాలను కూడా వదలరు, ముస్లింలకు పంచుతారని మోదీ ప్రసంగించారు. ఓట్ల కోసం, ప్రజల మధ్య మతపరమైన విభజన కోసం ఎంతకైనా తెగిస్తామన్నట్టుగా ఉన్నది మోదీ ప్రసంగం. ఎంఐఎం ఇలా ప్రసంగించడం లేదా? అని కొందరు ప్రశ్నిస్తారు. పాత నగరానికే పరిమితమైన ఎంఐఎం ఎన్నికల సభలు, పార్టీ సభలు అర్ధరాత్రుళ్లు జరుగుతాయి. వాళ్లు ఏం మాట్లాడుతారో మీడియాలో కవరేజీ ఉండదు. ఎంఐఎం చేసిన ప్రసంగాలను ప్రస్తావించవచ్చు. పాత నగరంలో ఒక మతానికి పరిమితమైన రాజకీయపక్షంతో దేశాన్ని పాలిస్తున్న ప్రధానమంత్రి మోదీని ఒకేగాటన కట్టి చూడలేం. ఏ వ్యూహం ద్వారా ఎన్నికల్లో ప్రయోజనం పొందుతామనే లెక్కలే ముఖ్యం కానీ ప్రజల మధ్య ఉద్రిక్తతలు తలెత్తితే సమాజానికి కలిగే నష్టం ఏమిటి అనేది వారికి అనవసరం. మతాల మధ్య ఉద్రిక్తతలు ఎంత పెరిగితే వారికి అంత లాభం.

మైనారిటీలు మొదటినుంచి కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నారు. కాంగ్రెస్ ఐదారు దశాబ్దాల పాటు దేశంలో అధికారంలో ఉన్నది. అంటే మైనారిటీ ఓటు బ్యాంకు ఆ పార్టీకి బాగా ఉపయోగపడింది. కర్ణాటక, తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో సైతం మైనారిటీ ఓటు బ్యాంకు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిందనేది నిజం. ఆరు దశాబ్దాల పాటు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన మైనారిటీ ఓటు బ్యాంకు రాజకీయమే, గత పదేండ్ల నుంచి కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేసింది. దశాబ్దాల పాటు మైనారిటీ ఓటుబ్యాంకు రాజకీయాల ద్వారా అధికారాన్ని అనుభవించిన కాంగ్రెస్, ఇప్పుడు మైనారిటీ ఓటు బ్యాంకు రాజకీయాల సైడ్‌ఎఫెక్ట్‌తో అధికారానికి దూరమైంది.

ఈసారి అధికారంలోకి, సంకీర్ణంలో భాగంగానైనా వస్తుందా? అనే విషయమై స్పష్టమైన సూచనలూ లేవు. అలాంటిది 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులు, మంగళ సూత్రాలతో సహా మైనారిటీలకు కాంగ్రెస్ పంచుతుంది' అని ప్రధాని స్థాయి వ్యక్తి అనడం దురదృష్టకరం. అందరి ఆస్తులు ముస్లింలకు ఇవ్వడం సాధ్యమా? కాంగ్రెస్ ఇప్పుడు పుట్టిన పార్టీ కాదు. దాదాపు ఆరు దశాబ్దాల పాటు కేంద్రంలో పాలించిన పార్టీ. అధికారంలో ఉన్నప్పుడు మంగళసూత్రాలతో సహా అందరివీ తీసుకొని ముస్లింలకు కాంగ్రెస్ ఇచ్చిందా? అలా ఇవ్వడం సాధ్యమా?

దేశంలో పదేండ్ల పాలనలో ఇది చేశాం, మళ్లీ అధికారం ఇస్తే వచ్చే ఐదేండ్లు ఇది చేస్తాం అని చెప్పి ఓట్లడిగితే పెద్దగా ప్రయోజనం ఉండదనుకుంటున్నారు. అందుకే మతపరమైన చీలిక ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని మోదీ బృందం కోరుకుంటున్నది. దీని వల్ల నష్టపోయేది మాత్రం సమాజమే. సమాజ వాతావరణాన్ని ఎంత కలుషితం చేస్తున్నారో వారికి తెలియడం లేదు. గుజరాత్ ఉద్రిక్తతల పుణ్యమాని సీఎం సీటుకు ఢోకా లేకుండా చేసుకోవడమే కాకుండా ప్రధానమంత్రి స్థాయి వరకు వెళ్లారు. అందుకే అదే విజయ సూత్రాన్ని పదే పదే నమ్ముకుంటున్నారు.

'కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకిందట' అనే సామెత చెప్పినట్టు ప్రధాని రెచ్చగొట్టే ప్రసంగాలను విమర్శిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తమ పార్టీ వారి అనైతిక చర్యలను, రెచ్చగొట్టే ప్రసంగాలను ప్రశ్నించలేక పోతున్నారు, అడ్డుకోలేకపోతున్నారు. ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీలో చేరి పోటీ చేయడాన్ని రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. తమ పార్టీ తరపున అలా పోటీ చేస్తున్న వారి గురించి రాహుల్‌గాంధీకి తెలియదా? చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ ఎంపీగా గెలిచి, పార్లమెంట్ సభ్యత్వానికి కూడా రాజీనామా చేయకుండా ఇప్పుడు అదే చేవెళ్ల నుంచి కాంగ్రెస్ తరపున రంజిత్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇక దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి శాసనసభకు ఎన్నికై కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నీతులు చెప్పడానికే... ఆచరిస్తే ఆ మాత్రం బలమైన అభ్యర్థులు కూడా దొరకరనుకొని రాహుల్‌గాంధీ వీరి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారేమో. అల్లం పేరుతో అరటి బోదె గుజ్జును అమ్మే వ్యాపారికి, తమ ప్రసంగాలతో సమాజాన్ని కలుషితంగా మార్చి రాజకీయ ప్రయోజనం పొందే రాజకీయ నాయకులకు పెద్దగా తేడా లేదు. స్వచ్ఛ భారత్ అంటూ రోడ్లపై చెత్తా చెదారాన్ని ఏరి పారేయడాన్ని ఒక ఉద్యమంలా ప్రారంభించిన ప్రధాని మోదీ తన రాజకీయ ప్రసంగాల్లో అంతకుమించిన ప్రమాదకరమైన చెత్త పోగుపడుతున్నదనే విషయాన్ని గ్రహించాలి.

'కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకిందట' అనే సామెత చెప్పినట్టు ప్రధాని రెచ్చగొట్టే ప్రసంగాలను విమర్శిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తమ పార్టీ వారి అనైతిక చర్యలను, రెచ్చగొట్టే ప్రసంగాలను ప్రశ్నించలేక పోతున్నారు, అడ్డుకోలేకపోతున్నారు. ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీలో చేరి పోటీ చేయడాన్ని రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. తమ పార్టీ తరపున అలా పోటీ చేస్తున్న వారి గురించి రాహుల్‌గాంధీకి తెలియదా?

ఒరిజినల్ కాషాయ రంగు లోగోలోకి దూరదర్శన్ రావడం ప్రారంభం మాత్రమే. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఒకవేళ బీజేపీ గెలిచి, నరేంద్ర మోదీ సర్కార్ మూడోసారి అధికారంలోకి కనుక వస్తే.. ప్రసారభారతి, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ (ఎంఐబీ)లో భారీగా మార్పులు చేయాలని యోచిస్తున్నట్టు సంబంధిత వర్గాలు న్యూస్ 18కి తెలిపాయి.

కాషాయ 'ప్రసారం'!



అమన్ శర్మ

15 దేశాల్లో బ్యూరోలను అనుసంధానించడం ద్వారా దూరదర్శన్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా అభివృద్ధి చేయడం, ప్రసారభారతికి చెందిన శబ్ద్ పోర్టల్ పరిధిలోకి విదేశీ అవుట్‌లెట్‌లతో సహా 1000కి పైగా మీడియా సంస్థలను తీసుకొచ్చి దాన్ని గ్లోబల్ న్యూస్ ఏజెన్సీగా అభివృద్ధి చేయడం, ఎంఐబీలో ఇంటెలిజెన్స్ హబ్ ఏర్పాటు, సాధారణ పౌరుల కోసం భారత్ నమన్ పోర్టల్‌ను ప్రారంభించడం లాంటివి ఈ ప్రణాళికలో భాగంగా ఉన్నాయి. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్లను వివిధ ప్రాంతాలకు విస్తరించడం ద్వారా గ్లోబల్ మీడియా అండ్ ఎంటర్టైన్‌మెంట్ సమ్మిట్‌ను ప్రకటించి, ఫేక్ న్యూస్‌లను అడ్డుకోవాలని భావిస్తుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (ఐఐఎంసీ)లో మాస్టర్ కోర్సును ప్రవేశపెట్టనుంది.

ఇవన్నీ ప్రధాని మోదీ ఆదేశాల మేరకు మోదీ 3.0 కోసం మంత్రిత్వ శాఖలు రూపొందిస్తున్న పంచవర్ష, 100 రోజుల ప్రణాళికల్లో భాగమే. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని దూరదర్శన్ తన నీలి రంగు లోగోను కాషాయ రంగులోకి మార్చడం వివాదాస్పదంగా మారింది. ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని ప్రతిపక్షం అభివర్ణిస్తుంది.1982లో ఇందిరాగాంధీ ఎంపిక చేసిన ఒరిజినల్ రంగు ఇదేనని, దాన్నే తాము మళ్లీ పునరుద్ధరించామని బీజేపీ తెలిపింది.

భారతీయ సినిమాలు, ప్రసారాల విదేశీ గుర్తింపును వివరించడం, భారతీయ సాఫ్ట్ పవర్‌ను బలోపేతం చేయడం లాంటివి ప్రసార భారతి ప్రణాళిక అని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇందులో భాగంగా డీడీ ఇండియా, ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఐఎఫ్ఎఫ్ఐ)లను గ్లోబల్ బ్రాండ్లుగా తీర్చిదిద్దనున్నారు. డీడీ ఫ్రీ డిష్‌ను పొరుగు దేశాలకు విస్తరించాలని, దాని కింద చానళ్ల సంఖ్యను పెంచాలని కేంద్రం ప్లాన్ చేస్తున్నది. విదేశీ అవుట్‌లెట్‌లతో సహా 1000కి పైగా మీడియా సంస్థలను అనుసంధానించడం ద్వారా ఇటీవల ప్రారంభించిన శబ్ద్ పోర్టల్‌ను భారత గ్లోబల్ న్యూస్ ఏజెన్సీగా అభివృద్ధి చేయనున్నారు.వీడియో, ఆడియో, టెక్స్ట్, ఫొటో, ఇతర రూపాల్లో రోజువారీ న్యూస్ ఫీడ్‌ను వినియోగదారులైన మీడియా సంస్థలకు అందించడానికి ఆడియో-విజువల్ నెట్‌వర్క్ శబ్ద్ రూపొందించబడింది. దేశవ్యాప్తంగా కల ప్రసారభారతి నెట్‌వర్క్‌కు చెందిన రిపోర్టర్లు, కరస్పాండెంట్లు, స్ట్రింగర్లు అందించే ఫీడ్ ఆధారంగా ఇది పని చేస్తుంది.

ఐఐఎంసీలో మాస్టర్ కోర్సును ప్రారంభించే అవకాశం ఉంది. అలాగే ఈ రంగంలో నియంత్రణ చట్టం రూపొందించడానికిబ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ బిల్లును కూడా క్యాబినెట్ ముందుకు తీసుకురావచ్చు. బీజేపీ సర్కార్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే ఐజ్వాల్‌లో 500వ కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను ప్రారంభించాలని కేంద్రం ప్లాన్ చేస్తున్నది.

జన్ సంవాద్, భారత్ నమన్ అనేవి మోదీ 3.0 కోసం మరో రెండు భారీ ప్రాజెక్టులని సంబంధిత వర్గాలు తెలిపాయి. రియల్‌టైమ్ ట్రాన్స్‌లేషన్, డబ్బింగ్, సబ్‌టైటిలింగ్, ఏఐ ఆధారిత కంటెంట్ జనరేషన్ కోసం ఎంఐబీలో ఏఐ హబ్ ఉంటుంది.ప్రజల ఉచిత వినియోగానికి ఉచిత కంటెంట్ నేషనల్ వీడియో గేట్‌వేల ఏర్పాటును కలిగి ఉంటుంది.

భారత్ నమన్‌ను జాతీయ భాండాగారంగా (నేషనల్ ఆర్కైవల్),మీడియా యాక్సెస్ కోసం పౌరుల ప్లాట్‌ఫామ్‌గా అభివృద్ధి చేస్తారు. దేశంలోని అన్ని భాషల్లో ఉండే పుస్తకాలు, ప్రసిద్ధ డాక్యుమెంట్లు, ఫొటోలు ఇక్కడ అందుబాటులోకి తెస్తారు. వాణిజ్య అవసరాల కోసం చిత్ర నిర్మాతలు, నిర్మాణ సంస్థలకు వాడుకునే అవకాశం ఇవ్వడం ద్వారా ఆదాయం ఆర్జించే ప్రయత్నాలు జరుగుతాయని విశ్వసనీయ వర్గాలు న్యూస్ 18కు తెలిపాయి.



ఎన్నికల కమిషన్ విశ్వసనీయత ఏమిటి?

దేశ ప్రధాని కూడా భారత పౌరుడే. భారత పౌరులకు, భారత చట్టాలకు ఆయన అతీతుడేమీ కాదు. చట్టాలను ఉల్లంఘించినప్పుడు ఆయనపై కూడా చర్యలు చేపట్టాలి. ప్రధానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోతే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత ఏమిటి?

- బృందాకారత్, సీపీఐ(ఎం) నాయకురాలు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇంటర్వ్యూను గ్రామస్థులంతా ఒకచోట చూసేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరంలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్

కేసీఆర్ ఇంటర్వ్యూకు రికార్డ్ వ్యూస్

4 గంటలు.. 95 వేల నాన్‌స్టాప్ లైవ్ వ్యూస్ • రికార్డు తిరగరాసిన కేసీఆర్ టీవీ 9 ఇంటర్వ్యూ

యూట్యూబ్ వ్యక్తిగత ఇంటర్వ్యూ వ్యూస్‌లో టాప్ • రాష్ట్రవ్యాప్తంగా టీవీలకు అతుక్కుపోయిన లక్షలాది మంది

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): 'కేసీఆర్' అన్న పదమే సంచలనం. ఆయన మాటే చెరపలేని శాసనం. ఆయన ఇంటర్వ్యూ అంటే.. రికార్డుల మోతే. మంగళవారం టీవీ9కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ తన రికార్డును తానే బద్ధలు కొట్టారు. 2012లో నాన్‌స్టాప్‌గా టీవీ9 రజనీకాంత్‌కే 3.30 గంటలపాటు ఇంటర్వ్యూ ఇచ్చిన కేసీఆర్.. పుష్కరకాలం తర్వాత మంగళవారం 4 గంటలపాటు ఏకధాటిగా అదే టీవీ9 రజనీకాంత్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 4 గంటలపాటు సాగిన ఈ ఇంటర్వ్యూకు సుమారు 95 వేలకు పైగా నాన్‌స్టాప్ లైవ్ వ్యూస్ రావడం తెలుగు మీడియా రంగంలోనే రికార్డుగా నిపుణులు తేల్చి చెప్పారు. ఈవెంట్స్ మినహా వ్యక్తిగత ఇంటర్వ్యూలకు ఈ స్థాయిలో భారీ లైవ్ వ్యూస్ రావడం రికార్డుగా అభివర్ణిస్తున్నారు. గ్రామాలు మొదలు, పట్టణాలు, మెట్రో సిటీల వరకూ లక్షలాది మంది జనం టీవీలకు అతుక్కుపోయారు. ఐపీఎల్ మ్యాచ్‌ను బంద్ పెట్టి మరీ కేసీఆర్ డిబేట్‌నే ఆసక్తిగా తిలకించారు. కొందరు బీఆర్ఎస్ నేతలు తమ నియోజకవర్గాల్లో, మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్లపై వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఈ డిబేట్‌ను ఆసక్తిగా విన్నారు. ఇంటర్వ్యూలో కేసీఆర్ చెప్తున్న ఒక్కొక్క డైలాగ్‌కు ఆయన అభిమానులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. చిన్నారులు మొదలు వృద్ధుల వరకూ టీవీలకు, మొబైల్‌లో యూట్యూబ్‌కు అతుక్కుపోయారు. 95కే వ్యూస్‌కు తోడు వేలాది మంది లైకులు, కామెంట్ల వర్షం కురిపించారు. మన దేశంలో మరే నాయకుడికి లేనంత క్రేజ్‌ను ఈ విధంగా కేసీఆర్ సొంతం చేసుకున్నారు. ఇరిగేషన్, విద్యుత్తు, ఆర్థిక, తాగునీటి తదితర రంగాలపై ఆయన చెప్పిన విశ్లేషణలను చెవులు రిక్కరించి మరీ విన్నారు.

కేసీఆర్.. మాస్టర్ క్లాస్: కేటీఆర్

కేసీఆర్ మారథాన్ ఇంటర్వ్యూను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'మాస్టర్ క్లాస్'గా అభివర్ణించారు. 'ఇది కేసీఆర్ మాస్టర్ క్లాస్. ఫాం తాత్కాలికం క్లాస్ శాశ్వతం అనడానికి ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

8 నుంచి 12 ఎంపీ స్థానాలు మావే

కేంద్రంలో ప్రభావం చూపుతాం

ప్రజల పక్షాన కొట్లాడుతాం

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ ఖాయం

తెలంగాణలో బీజేపీకి స్పేస్ లేదు

సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి గెలవడు

టీవీ9 ఇంటర్వ్యూలో కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, జాతీయ రాజకీయాల్లో ప్రభావం చూపుతుందని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ధీమా వ్యక్తంచేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో 8 నుంచి 12 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవబోతున్నారని చెప్పారు. మంగళవారం టీవీ 9కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగలబోతున్నదని, తెలంగాణలో బీజేపీకి స్పేస్ లేదని స్పష్టంచేశారు. సికింద్రాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గెలిచే అవకాశం లేదని, అక్కడ బీఆర్ఎస్ గెలవబోతున్నదని పేర్కొన్నారు.

ప్రశ్న: ప్రతిపక్షంగా బీఆర్ఎస్, కేసీఆర్ ఎలాంటి పాత్ర పోషించబోతున్నారు?

జవాబు: ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో ప్రజల పక్షాన బలంగా వాదించే పంచ్ కావాల్సి ఉన్నది. ప్రభుత్వ నియంతృత్వాన్ని ఎదుర్కొని, ప్రజల కష్టాలు, సమస్యల పరిష్కారానికి పంచ్‌గా పనిచేస్తాం. రాబోయే కాలంలో బీఆర్ఎస్సే ప్రజల బలం, శక్తిగా పనిచేస్తుంది. బీఆర్ఎస్ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రజల పక్షాన పోరాడుతుంది. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తూనే ఉంటాం. మళ్లీ అధికారంలోకి వస్తాం.



ప్రశ్న: కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తున్నది?

జవాబు: కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల్లోనే అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్ద ఎదురు దెబ్బతినబోతున్నది. బీజేపీకి తెలంగాణలో స్పేస్ లేదు. బీఆర్ఎస్ 8 నుంచి 12 స్థానాలు గెలుస్తున్నది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సికింద్రాబాద్‌లో గెలిచే అవకాశం లేదు. అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుస్తున్నాడు. రాష్ట్రాన్ని కాపాడుకుంటూనే, జాతీయ స్థాయిలో ప్రభావం చూపుతాం. మహారాష్ట్రలో బీఆర్ఎస్‌కు చాలా బాగుండే. అక్కడ రెండు పార్టీ కార్యాలయాలను కూడా ఏర్పాటుచేశాం. అక్కడి ప్రజలందరూ బీఆర్ఎస్ వెంట నడిచారు. దురదృష్టకరంగా ఇక్కడ ప్రభుత్వం కోల్పోయాం. లేకుంటే మహారాష్ట్రలో మంచి ప్రభావం చూపేవాళ్లం. పార్లమెంటు ఎన్నికల్లో మోదీ పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. మోదీ చెప్తున్నట్టు 400 సీట్లు వచ్చేది లేదు. మొదటి విడత ఎన్నికల్లో బీజేపీకి ఆశించిన విధంగా ఫలితాలు రావడం లేదు. రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారంలోకి వస్తాం. కేంద్రంలో ప్రభావం చూపుతాం.

ప్రశ్న: బీఆర్ఎస్‌గా పేరు మార్చిన తర్వాతనే పార్టీ ప్రభావం కోల్పోయిందనుకో వచ్చా? మళ్లీ బీఆర్ఎస్ పేరును టీఆర్ఎస్‌గా మార్చే అవకాశం ఉన్నదా?

జవాబు: ప్రజల అభిమానం ఉన్నంత కాలం పార్టీల గుర్తులు,పేర్లు మార్చినంత మాత్రంలో నష్టం జరుగదు. టీడీపీలో పని చేసిన 20 ఏండ్లపాటు సైకిల్ గుర్తుపై, ఆ తర్వాత రైతునాగలి గుర్తుపై, సిద్దిపేటలో ఒకసారి బస్సు గుర్తుపై గెలిచా. ఆ తర్వాత కారు గుర్తుపై గెలిచి, పదేండ్లపాటు ముఖ్యమంత్రిగా సమర్థంగా పనిచేశాను. పార్టీ పేరు మార్చినంత మాత్రాన ఓడిపోయామనుకోవడం లేదు. ప్రజలకు కావాల్సిన అన్ని అవసరాలు తీరినందున, ఒకసారి కాంగ్రెస్‌ను గెలిపిద్దామనుకున్నారు. నాలుగు నెలల్లోనే ప్రజలకు ఆ పార్టీ రంగు తెలిసింది. మళ్లీ బీఆర్ఎస్ పార్టీ పేరును టీఆర్ఎస్‌గా మార్చే ఆలోచన లేదు. అది సాధ్యం కాదు. ఎన్నికల కమిషన్ దగ్గర ఒక పార్టీ పేరు రద్దు అయిన తర్వాత ఐదేండ్ల వరకు దానిని ఫ్రీజింగ్ చేస్తుంది. మళ్లీ పార్టీ పేరు మార్చే ఆలోచన లేదు.

ప్రశ్న: బీఆర్ఎస్ కార్యకర్తలకు ఏమి చెప్పదలచుకున్నారు?

జవాబు: బీఆర్ఎస్ కార్యకర్తలకు ఒక్కటే చెప్తున్నాను. అక్కడక్కడ కార్యకర్తలపై జరుగుతున్న దాడుల గురించి తెలుసు. కాంగ్రెస్ నాయకులు మిమ్మల్ని వేధిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మీరు కన్ఫ్యూజ్ కావొద్దు. ఈ రోజు నా ఇంటర్వ్యూను రాష్ట్రంలోని కార్యకర్తలందరూ చూసి ఉంటారు. ఏ కొద్దిమందో మిస్ అయ్యి ఉంటారు. అద్భుతమైన పద్ధతిలో మళ్లీ మన పార్టీ అధికారంలోకి వస్తుంది. ఎందుకంటే, మనం తెలంగాణ సైనికులం. తెలంగాణ తేవడం కోసం ఆనాడు ఆకలికి అటుకులు బుక్కి పనిచేశాం. జైళ్లకు పోయి పని చేశాం. తెలంగాణ ప్రజలకు తెలంగాణ సాధించి పెట్టినం. పదేండ్లు ఏ వర్గానికీ పక్షపాతం లేకుండా, కులం, మతం విచక్షణ లేకుండా అన్ని వర్గాల ప్రజలను కంటికి రెప్పలా, కంటి పాపలా కాపాడుకున్నాం. రేపు మళ్లీ భవిష్యత్తు మనదే. అందరూ ఎవరి స్థాయిలో వాళ్లు పని చేయండి. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పనిచేయండి. సర్వేల ప్రకారం 8 నుంచి 12 స్థానాల మధ్య మన ఎంపీలు గెలవబోతున్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో మళ్లీ పార్టీ బ్రహ్మాండంగా ముందుకు పోతది. శక్తివంచనా లేకుండా మన పార్టీ ఎంపీలను గెలిపించండి. బీఆర్ఎస్ కార్యకర్తల మీద దాడులు, దౌర్జన్యాలు జరిగితే, పార్టీ తరపున కేసులు కొట్లాడటానికి పార్టీ లీగల్‌సెల్‌కు రూ.10 కోట్ల నిధులు కేటాయించాను. నాయకులకు నెంబర్లు కూడా ఇచ్చాం. వెంటనే పార్టీ రియాక్ట్ అవుతుంది. కేసీఆర్ రియాక్ట్ అవుతాడు. మరీ దాడులు తీక్షణంగా ఉంటే కేసీఆరే గద్దలెక్క వాలుతాడు. కాపాడుకుంటాడు. నాయకులు కొంత అటు..ఇటుగా ఉన్నారు. కానీ, కార్యకర్తలు ఉత్సాహంగా, ధైర్యంగా, మొండిగా ఉన్నారు. మీ కదలికలు నాకు కనిపిస్తున్నాయి. కార్యకర్తలు అలానే ఉండండి. తెలంగాణపై మన బాధ్యతలు తీరలేదు. తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ యుద్ధం చేస్తూనే ఉంటుంది. బంగారు తెలంగాణలో అందరూ భాగస్వామ్యంగా ఉంటారు. మంచి భవిష్యత్తు పార్టీకి ఉంటుంది. ఎవరూ కూడా అసంతృప్తికి గురికాకుండా పనిచేయండి. బంగారు తెలంగాణ సాధిద్దాం. అందరికీ శుభాకాంక్షలు.

ప్రశ్న: భవిష్యత్‌లో కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరిలో ఎవరో ఒకరు ఎమర్జ్ కావాలని అంటారా? లేక ఎవరో ఒకర్ని మీ వారసులుగా ఎంపిక చేస్తారా?

జవాబు: అలాంటిది నేను ఎప్పుడూ ప్రోత్సహించలేదు. ప్రాసెస్‌లోనే కావాలి. ప్రజల నుంచి కావాలి. పార్టీ నాయకుల నుంచి కావాలి. లేదంటే అది శాశ్వతంగా నిలబడదు.

ప్రశ్న: ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డికి ఏమి చెప్పాలనుకుంటున్నారు?

జవాబు: బాధ్యత మీకు కొత్తగా దొరికింది. సీఎం ఇప్పటికైనా మంచిగా, గంభీరంగా పనిచేయండి. ఈ చిల్లర, మల్లర అపవాదులు పెట్టే పిచ్చి ప్రయత్నాలు మానుకోండి. ప్రజలకు మంచి పనులు చేసి, మంచి పేరు తెచ్చుకోండి. ప్రభుత్వానికి శుభం కలగాలని కోరుకుంటున్నాను.

ప్రశ్న: కేసీఆర్‌ను చేతికర్రతో చూడటం బాగా అనిపించడం లేదు. ఎంతకాలం ఇది వాడాలి?

జవాబు: డాక్టర్ మరో ఆరు నెలలు చేతికర్ర వాడాలని సూచించారు. మరోసారి పడిపోకుండా సపోర్టింగ్ కోసం వాడమన్నారు. వాడుతున్నాను. హిప్ రీప్లేస్ చేశారు. సర్జరీ చేసిన చోట అప్పుడప్పుడు నొప్పిగా ఉంటుంది.

ప్రశ్న: ఏపీలో జరిగే ఎన్నికల్లో ఎవరు గెలిచే అవకాశం ఉన్నది? ఎవరు గెలిస్తే బాగుంటుంది?

జవాబు: ఏపీ ఎన్నికల్లో ఏమి జరిగినా మాకు సంబంధం లేదు. చంద్రబాబు గెలిచినాక జగన్ గెలిచినా మాకు బాధలేదు. మాకు అందుతున్న సమాచారం ప్రకారం.. మళ్లీ జగన్ గెలిచి అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్నది. ప్రస్తుత ఎన్నికల్లో కలుగజేసుకోవడం లేదు. భవిష్యత్తులో పరిశీలిస్తాం.



ట్యాపింగ్ ఇంటెలిజెన్స్ డ్యూటీ

సీఎం, మంత్రులకు సంబంధం ఉండదు

దీనిని రాజకీయం చేయడం దివాళాకోరుతనం

ఇది బుర్ర తక్కువ ప్రభుత్వం

టీవీ9 ఇంటర్వ్యూలో కేసీఆర్ స్పష్టీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ ఆరోపణ అత్యంత చీప్ ఆరోపణ అని, తాము సీఎంపై అలాంటి ఆరోపణలు చేయబోమని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం టీవీ 9కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశానికైనా, ఏ రాష్ట్రానికైనా నిఘా వ్యవస్థలు, వేగులు ఉండటం అత్యంత సహజమని, నేరాలను అరికట్టే చర్యల్లో భాగంగా ఇంటెలిజెన్స్ విభాగం ఫోన్ ట్యాపింగ్ లాంటివి చేయడం సహజమని వివరించారు. దీంతో ముఖ్యమంత్రికీ, మంత్రులకు ఎటువంటి సంబంధం ఉండదని స్పష్టంచేశారు. ప్రస్తుత ప్రభుత్వం బుర్ర తక్కువ ప్రభుత్వమని, అందుకే దీనిని రాజకీయం చేస్తున్నదని మండిపడ్డారు.

ప్రశ్న: మీ ప్రభుత్వం టెలిఫోన్ ట్యాపింగ్ చేసిందా? లేదా?

జవాబు: సమాచార సేకరణ నిమిత్తం ప్రభుత్వాల దగ్గర ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ ఉంటుంది. అందులో కౌంటర్ ఇంటెలిజెన్స్, ఎస్ఐబీ, ఎస్‌బీఐ ఇలా వివిధ విభాగాలు ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశానికైనా, ఏ రాష్ట్రానికైనా అనేక స్థాయిల్లో నిఘా వ్యవస్థ, వేగులు ఉండటం అత్యంత సహజమైన విషయం. వాళ్లకు ప్రభుత్వాలు రహస్యంగా నిధులు ఇస్తాయి. నేర నిరోధక విభాగం కాబట్టి, ముందే సమాచారం సేకరించేందుకు అనేక మార్గాలు ఎంచుకుంటారు. అవసరమైతే, ఫోన్ ట్యాపింగ్ చేయాలనుకుంటే చేస్తారు. టెలిగ్రాఫిక్ యాక్ట్- 1898 ప్రకారం ప్రభుత్వాలకు, పోలీసులకు ఆ అధికారాలు ఉంటాయి. దీనికి సీఎం, మంత్రులకు సంబంధం ఉండదు. హోంశాఖ మంత్రి స్థాయిలోనే ఉంటుంది. హోంశాఖ కార్యదర్శి అనుమతి తీసుకొని బాజాప్తా ఇంటర్‌సెప్ట్ (ట్యాపింగ్) చేస్తరు. ఇవి ముఖ్యమంత్రికి తెలియదు. అవసరమైతే సీఎంలు కొన్ని రిపోర్టులు అడుగుతారు. ఇవి పూర్తిగా పరిపాలనా సంబంధమైన అంశాలు. ఇప్పుడున్న ప్రభుత్వం బుర్ర తక్కువ ప్రభుత్వం కాబట్టి దానిని కూడా రాజకీయం చేసింది.

ప్రశ్న: మీ ప్రభుత్వం పూర్తిగా లీగల్‌గా ట్యాపింగ్ చేసిందంటారా? విదేశాల నుంచి ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ తెప్పించి, రాజకీయ నాయకుల ఇండ్ల చుట్టూ పెట్టి రాజకీయంగా కంట్రోల్ చేయడానికి ప్రయత్నించారని ఆరోపిస్తున్నారు కదా?

జవాబు: నా దృష్టికి వచ్చిన మేరకు పూర్తిగా చట్టపరంగా జరిగింది. ఎవరైనా అధికారి అక్రమంగా చేస్తే, ఆ సంగతి డిపార్ట్‌మెంట్ చూసుకుంటుంది. అలాంటి దుర్మార్గమైన పనిచేస్తే శిక్ష అనుభవిస్తారు. దానికి పొలిటికల్ ప్రభుత్వానికి సంబంధం ఉండదు. పోలీసులు తమ అవసరాల నిమిత్తం ఏ పరికరాలు కొన్నారు? ఏ వస్తువులు వాడారు? వంటివి మాకు తెలియదు. సీఎం ఆ పని పట్టించుకోరు. అది పోలీసుల అంతర్గత వ్యవహారం. డీజీపీ, హోం సెక్రెటరీ వంటివారి పని. వాళ్ల పని అడుతుగం, పనితీరు చూస్తం, బడ్జెట్ సపోర్ట్ చేస్తాం. అంతే. రాజకీయ అవసరాల కోసం ఇంటర్‌సెప్షన్‌ను వాడుకున్నామో లేదో నాకు తెలియదు. నాకు రిపోర్టులు మాత్రమే వస్తాయి. చాలా విషయాల మీద రిపోర్టులు అడుగుతాం. పోలీసులు కొన్ని ఆటోమేటిక్‌గా ఇస్తారు. దీనిని ఏదో ప్రపంచం మునిగిపోతున్నదన్నట్టు రాజకీయం చేయడం సరికాదు.

ప్రశ్న: ఇప్పుడున్న సీఎం కూడా ట్యాపింగ్ చేస్తున్నారంటారా?

జవాబు: ఇప్పుడున్న సీఎం తన స్థాయిని దిగజార్చుకుంటాడేమో కానీ.. నేను దిగజారను. అలాంటి చీప్ ఆరోపణలను సీఎం మీద పెట్టదలుచుకోలేదు.

ప్రశ్న: నిఘా వ్యవస్థను రాజకీయ నాయకులపై నిఘా పెట్టేందుకు వాడుకున్నారని ఆరోపిస్తున్నారు

జవాబు: ఇది సిల్లీ, థర్డ్ క్లాస్ ఆరోపణ. లా అండ్ ఆర్డర్ కాపాడటానికి, ప్రతీప శక్తులను అడ్డుకోవడానికి పలు మార్గాల్లో సమాచారం సేకరిస్తుంటారు. అందులో ఇంటర్‌సెప్షన్ ఒకటి. అది అధికారికంగా చేస్తారు. అవసరమైతే, నెట్‌వర్క్ కంపెనీలను కూడా అడుగుతారు. అంతేకానీ, 'ఫలానా వ్యక్తుల ఫోన్లను ట్యాప్ చేసినం' అని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పరు. ఇప్పుడున్న ముఖ్యమంత్రికి కూడా రోజూ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ వస్తుంది. దీనిని కూడా రాజకీయం చేయడమంత దివాళాకోరుతనం ఇంకోటి ఉండదు.

ఎన్నికల తర్వాత ఏమైనా జరగొచ్చు

హిమాచల్‌ప్రదేశ్‌లో ఆల్ రెడీ బీజేపీ బొక్క పెట్టేసింది

కర్ణాటకలోనూ మింగేస్తారు

ఇక ఆ తరువాత వంతు తెలంగాణదే: కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల తరువాత ఏమైనా జరిగే అవకాశం ఉన్నదని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ బతికనిచ్చే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఒకవేళ అటువంటి పరిస్థితి వస్తే.. అప్పటి పరిస్థితులను బట్టి తమ పార్టీ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టంచేశారు. మంగళవారం ఆయన టీవీ 9కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ చీలిపోతుందనే వార్తలను తోసిపుచ్చారు.

ప్రశ్న: మీకు 29 మంది ఉన్నరు, పాతిక మంది వస్తే ఈజీగా గవర్నమెంట్‌ను ఫామ్ చేయొచ్చు కదా..

జవాబు: ఈజీగా.. దానికి పెద్ద ఇష్యూ ఏమున్నది? నేను జ్యోతిష్యం చెప్పలేను కానీ, దేరీజ్ ఎవరీ పాసిబులిటీ. నేను చెప్పిన లాజిక్ ఏందంటే.. 119లో మాకు 111 సీట్లు ఉంటేనే బీజేపోళ్లు వచ్చి ఇక్కడ దుకాణం పెట్టిండ్రు. ఈ 64 మంది ఉన్న కాంగ్రెస్‌ను వీళ్లెక్కడ బతికనిస్తరు? పార్లమెంట్ ఎన్నికల తర్వాత అతి కొద్ది సమయంలో అదే జరుగుతుంది. మాకు వస్తున్న సమాచారం ప్రకారం కుండబద్దలు కొడుతున్నా. హిమాచల్‌ప్రదేశ్‌లో ఆల్‌రెడీ బీజేపీ బొక్క పెట్టేసింది. ఎన్నికల తర్వాత పది రోజులకో, పదిహేను రోజులకో ఫినిష్, ఢామ్. నరేంద్రమోదీ బాంబు పడ్తది. కర్ణాటకలో మరో బాంబు పడేయడానికి రంగం సిద్ధమైంది. దాన్ని మింగేస్తరు. దాని తర్వాత తెలంగాణదే.



ప్రశ్న: అప్పుడు బీఆర్ఎస్ పార్టీ స్టాండ్ ఏమిటి? కాంగ్రెస్ పార్టీ పడిపోయే పరిస్థితి వస్తే..

జవాబు : మేము ప్రజాస్వామిక వాదులం. నేను ఒక మాట చెప్తున్నా.. ఎన్నికల ముందు కూడా చాలా సందర్భాల్లో చెప్పిన. నిజంగా కూడా బీఆర్ఎస్ ఒకసారి ఓడిపోతే మంచిదే అని చెప్పిన. అప్పుడు తేడా తెలుస్తది.. మళ్లీ వెంటనే నెక్ట్స్ టర్మ్‌లో బీఆర్ఎస్ గవర్నమెంట్ వస్తది. మనం ఇరవై ఏండ్లు నిశ్చింతంగా, కదలకుండా ఉంటామని చెప్పిన. ఎందుకంటే, ప్రజలకు మన విలువ తెలుస్తది అని చెప్పి. గాడిద ఉంటే కదా గుర్రం విలువ తెలుస్తది అని అన్న.

ప్రశ్న: తెలంగాణ గురించి, తెలంగాణ పరిస్థితుల గురించి అణువణువు మీకు తెలుసు. మీరు చెప్తున్న పరిస్థితి వస్తే.. ఏ ప్రభుత్వం ఏర్పడాలన్నా బీఆర్ఎస్ పార్టీ డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ సపోర్టు లేకుండా జరగదు. అప్పుడు కేసీఆర్ స్టాండ్ ఏమిటి? బీఆర్ఎస్ స్టాండ్ ఏమిటి? సంకీర్ణ ప్రభుత్వం వైపు ఆలోచిస్తారా? మళ్లీ ఎన్నికలకు వెళ్లడం మీద దృష్టి పెడుతారా?

జవాబు: మేము ప్రజాస్వామికవాదులం. మేం గెలిచినప్పుడు బీజేపీ బాధ పెడితే బాధ పడ్డాం. ఈ గవర్నమెంట్ ఐదేండ్లు ఉండాలని కోరుకుంటాం. అప్పుడే పూర్తి రంగు బయట పడ్తది. వీళ్ల శక్తి సామర్థ్యం, తెలివితేటలు అన్నీ బయటపడుతయి. అప్పుడు ఆటోమెటిక్‌గా బీఆర్ఎస్ బ్రహ్మాండంగా గెలుస్తుంది. కానీ, మీరు చెప్తున్న పరిస్థితి వస్తే సందర్భాన్ని బట్టి ఆలోచిస్తాం.

ప్రశ్న : బీఆర్ఎస్ పార్టీ పనై పోయింది, ఇక రేపో ఎల్లుండో చీలిపోబోతున్నది అని పదే పదే అంటున్నరు?

జవాబు: అట్లా ఎప్పుడూ అయిపోదు కదా.. అదే అజ్ఞానం అనేది. పదేండ్లు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్.. అలా అయిపోలేదు కదా. సమైక్య రాష్ట్రంలో చంద్రబాబు పదేండ్లు ప్రతిపక్షంలో ఉన్నరు. మళ్లీ ఏపీ విభజన తర్వాత ఏపీకి ముఖ్యమంత్రి అయ్యారు. అట్లా అనుకుంటరా ఎవరైనా? అట్లా అనుకోవడమే మూర్ఖత్వం. అదే మంచిది కాదు. ఆ పిచ్చి ప్రయత్నాలు బంద్ చేసి, మీరు ప్రజలకు ఇచ్చిన ఆరు వాగ్దానాలు నెరవేర్చండి.

25, 26 మంది రెడీగా ఉన్నారు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): తమతో కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పునరుద్ఘాటించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్తాడనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌తో చేతులు కలిపేందుకు 25, 26 మంది రెడీగా ఉన్నామని తమ పార్టీ నేతలతో చెప్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం ఆయన టీవీ 9కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్పష్టంచేశారు.

ప్రశ్న: కాంగ్రెస్ నాయకుడొకరు 20 మందిని తీసుకొస్తానని చెప్పాడని అన్నారు కదా.. ఆ నేత ఎవరు?

జవాబు: ఎస్.. ఎందుకు చెప్తాను.. చెప్పను కదా? ఒక అనిశ్చితి ఉందండి. అందరి మాట విని, ఇప్పుడు ఈ ముఖ్యమంత్రి బీజేపీలోకి పోతడు. ఏకనాథ్ షిండే అవుతడు. ఎల్లయ్య అయితడు, మల్లయ్య అయితడు అని చెప్తున్నరు. అసలు ఈ పార్టీ ఉంటదా? బీజేపీఎల్పీ లీడర్ మహేశ్వర్‌రెడ్డి రెండు లేదా మూడు రోజులకోసారి వచ్చి స్టేట్‌మెంట్ ఇస్తరు. మూడు నెలల్లో ఈ ప్రభుత్వం పోతది, డబుల్ ఇంజిన్ సర్కారు వస్తది అని లక్ష్మణ్ స్టేట్‌మెంట్ ఇస్తరు. ఈ ముఖ్యమంత్రే మారుతడు అని వాళ్లు.. వీళ్లు మాట్లాడుతుంటే.. ఒక్కరోజు కూడా సీఎం ఖండించలే. ప్రధాని మోదీ ఏదో కార్యక్రమానికి హైదరాబాద్ వస్తే, 'ఆప్ బడే భాయ్ హై, మై చోటే భాయ్ హై' అని మాట్లాడిండు. అదేదో టీవీ ఇంటర్వ్యూ కోసం ఢిల్లీకి పోయి, అక్కడ యువకులు మోదీకి ఓటేస్తామంటే.. మోదీకే ఓటు వేయాలని చెప్పిండు.. అలా ఎలా చెప్తారండి? దాంతో కాంగ్రెస్ పార్టీలో కూడా చాలా అనుమానాలు కలుగుతున్నాయి. ఏం జరుగబోతున్నదనే అనిశ్చితి ఉన్నది. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌లో ఉన్న కొందరు మీరు, మేము కలిసి గవర్నమెంట్ ఫామ్ చేద్దాం, ఇక్కడంతా గోలగోలగా ఉన్నది అని మాట్లాడుడతున్నరు. తాము 25, 26 మందిమి రెడీగా ఉన్నామని మా వాళ్లతో చెప్తున్నరు. మన రెండు పార్టీలు కలిపి గవర్నమెంట్ ఫామ్ చేద్దాం.. మీరు మేము కలిసి.. అని.. చెప్తున్నరు. ఆవార్త నాకు వచ్చింది. కానీ, నేను చర్చించలేదు. ఫలాన వాళ్లు వస్తామంటున్నరంటే మాట్లాడుదామని చెప్పిన.

ఎన్నికలెప్పుడైనా అధికారం మాదే

అధికారానికి వస్తాం.. ప్రభుత్వం ఏర్పాటుచేస్తాం..

కాంగ్రెస్ 420 హామీలు నమ్మి కొందరు ఓటు వేశారు

అందువల్లనే మా అధికారం పోయింది: కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో బీఆర్ఎస్ వైబ్రంట్ (క్రియాశీలకం)గా ఉన్నదని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఎటువంటి భేదం లేకుండా పదేండ్లు పాలించామని, అన్ని రకాల స్కీంలు అందంచామని అన్నారు. బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు మధ్య ఓట్ల తేడా 1.8శాతం మాత్రమేనని.. ప్రజలు కాంగ్రెస్ మాటలు నమ్మి రెండు మూడు శాతం మంది అటు ఓటేశారని టీవీ9 ఇంటర్వ్యూలో చెప్పారు.

ప్రశ్న: పది సంవత్సరాలు ఉద్యమం చేశారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్నారు. 20 సంవత్సరాలు తెలంగాణతో మమేకం అయ్యారు. తెలంగాణకు సంబంధించిన ప్రతిదాంట్లోనూ మీ భాగస్వామ్యం కనిపిస్తుంది. అలాంటి మిమ్మల్ని ప్రజలు ఎందుకు ఓడించారు? మిమ్మల్ని ఓడించారా? ఎమ్మెల్యేలను ఓడించారా?

జవాబు: మేము కులం, మతం, వర్గం అనే భేదం లేకుండా అన్ని రకాల ప్రజలను, అన్ని రకాల స్కీంలు అందించి ఆదుకున్నాం. కంటికి రెప్పలా కాపాడుకున్నాం. ఎవరికీ ఏ లోటు రానివ్వలేదు. అందరినీ ఆదుకున్నాం. రైతు బంధు ఇచ్చాం. పంటలు కొన్నాం. నీళ్లు వచ్చాయి. కరెంటు వచ్చింది. కడుపు నిండిపోయింది. దాని మీద కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చింది. రైతుబంధు మేము రూ.10 వేలు ఇస్తే వాళ్లు రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. మేము పింఛన్ రూ.2 వేలు చెప్పితే వాళ్లు రూ.4వేలు చెప్పారు. మేము కల్యాణలక్ష్మి రూ.1లక్ష ఇస్తే వాళ్లు అదనంగా తులం బంగారం ఇస్తామన్నారు. నిరుద్యోగులకు రూ.4వేల భృతి ఇస్తామన్నారు. వాళ్లు 420 హామీలు ఇచ్చారు. అయినా కూడా వాళ్లకు మాకు 1.8 శాతం ఓట్ల తేడా మాత్రమే వచ్చింది. మిషన్ భగీరథ వచ్చింది, సాగునీళ్ల బాధ పోయింది, కరెంటు బాధ పోయింది, వాటి కంటే ఇంకా ఎక్కువ ఇస్తామంటున్నారు కదా అని రెండు మూడు శాతం ప్రజలు అటు చేయి చాపారు. దాంతో మా అధికారం పోయింది. అంతకుమించి ఏం జరగలేదు. అందులో బ్రహ్మపదార్థం లేదు. ఎవరి తప్పూ లేదు. మేము అందరం బాగా పనిచేశాం. బ్రహ్మాండంగా పనిచేశాం. కేసీఆర్ తప్పులేదు, ఎమ్మెల్యేలది ఎవరిది కూడా తప్పు లేదు. కాంగ్రెస్ చేసిన అడ్డగోలు హామీల ప్రభావంతోనే జరిగింది. మేము 39 మంది గెలిచాం. అనేకమంది 1000-1200 మెజార్టీతో ఓడిపోయారు. ఇట్ ఇజ్ నాట్ రౌట్ ఫర్ బీఆర్ఎస్. బీఆర్ఎస్ ఇజ్ వైబ్రంట్ పార్టీ ఇన్ తెలంగాణ. నత్తింగ్ రాంగ్ హాజ్ గాన్ (బీఆర్ఎస్ పూర్తిగా కుప్పకూలలేదు. తెలంగాణలో బీఆర్ఎస్ ఇంకా క్రియాశీలకంగా ఉన్నది. ఏ తప్పూ జరగలేదు). తెలంగాణలో అసెంబ్లీకి మళ్లీ ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తది, అధికారంలోకి వస్తది. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతాడు. నేను ప్రామిస్ చేస్తున్నా.. నేను మళ్లీ ముఖ్యమంత్రి కాగానే మొదటి ఇంటర్వ్యూ మీకే ఇస్తాను.



> **ప్రశ్న: కాంగ్రెస్ చెప్పిన మార్పు వైపు ప్రజలు ఆలోచించి ఓటు వేశారని ఎందుకు అనుకోకూడదు?**
>
> జవాబు: కొత్తక వింత పాతొక రోత అనే సామెత ఉన్నది. మేము కూడా రివ్యూ మీటింగ్ చేసి కనుక్కొన్నాం. అంత బాగనే ఉండే కదా ఏమైందని అడిగి తెలుసుకున్నాం. పదేండ్లు ఇటు వేసినం కదా సార్, ఒకసారి అటు వేద్దాం అనుకున్నారు. నిజంగానే భ్రమల్లో కొందరు, మెగా డీఎస్సీని నమ్మి కొందరు యువకులు, ఇలా రకరకాల కారణాలు కొన్ని ఉన్నాయి.

ప్రశ్న: ప్రజాపాలన తీసుకవచ్చాం అంటున్నారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలు వింటున్నాం, గత ప్రభుత్వం ప్రజా సమస్యలు పట్టించుకోలేదంటున్నారు. రోజు 1000 – 1500 మందిని కలుస్తున్నామని రేవంత్‌రెడ్డి అంటున్నారు.?

జవాబు: మా మంత్రులు ప్రజలను కలవలేదా. మా మంత్రులు ప్రజల్లో లేరా? ఇదంతా బోగస్. బక్వాస్. వాళ్లు ఆరు గ్యారెంటీలు ఇచ్చారు. అడ్డం పడిపోయారు. ఆరు ప్రధాన గ్యారెంటీలు, 420 హామీలు. ముఖ్యమంత్రి స్వయంగా, వందల సభల్లో.. కేసీఆర్ మొన్న లక్ష రూపాయల రుణ మాఫీ చేశారు కదా, వెంటనే బ్యాంకులకు పరుగెత్తండి, వెళ్లి రెండు లక్షల రుణం తీసుకోండి, డిసెంబర్ 9న 10.30 గంటలకు మేము మాఫీ చేసేస్తాం అని డేట్ చెప్పేశారు. డిసెంబర్ 9 పోయి ఎన్ని రోజులైంది. ఇంకెన్ని డేట్‌లు మారుస్తరు? భువనగిరికి పోయి యాదగిరి నర్సన్న మీద ఒట్టు, ఆదిలాబాద్‌కు పోయి బాసర సరస్వతి మీద ఒట్టు.. ఎందుకీ ఒట్లు పెట్టాలి? మీరు మొన్నటివరకు ప్రతిపక్షంలో ఉన్నరు కదా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసు కదా, కాగ్ రిపోర్ట్ అసెంబ్లీ టేబుల్ మీద ఉన్నదా కదా, వాటిని చదివారు కదా? బడ్జెట్ స్పీచ్‌లో దంచారు కదా. భట్టి విక్రమార్క ఎంత పచ్చి అబద్ధం చెప్తున్నారు.. మేము నిరుద్యోగ భృతి ఇస్తామని అననే లేదని అంటున్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఉంది. రుణ మాఫీ వంద రోజుల్లో చేస్తామని అనలేదని అంటున్నారు. ముఖ్యమంత్రి డిసెంబర్ 9న రుణ మాఫీ చెప్పారు.. దానివి వీడియోలు ఉన్నాయి. నీవు చెప్పిన ప్రకారం ప్రజలు టెంప్ట్ అయి రుణం తీసుకున్నారు. హరీశ్‌రావు సవాల్‌కు ముఖ్యమంత్రి నోరు ఎందుకు తెరుస్తలేదు. ముఖ్యమంత్రి నోరు ఎందుకు పడిపోయింది. ఆగస్టు 15 వరకు రుణ మాఫీ చేయకుంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తావా అని హరీశ్‌రావు అడిగారు. ముఖ్యమంత్రి రుణ మాఫీ చేయలేదు. రెండు లక్షల రుణ మాఫీ చేయాలంటే రూ.39 వేల కోట్లు చెల్లించాలి. చెల్లిస్తాడా ఈయన? గవర్నమెంట్‌లో బీరువాలో డబ్బులు ఉండవండి. ఈ ముఖ్యమంత్రి సిల్లీ విషయం మాట్లాడాడు. లంకె బిందెలు ఉన్నాయనుకొని వచ్చాం అన్నాడు. లంకెబిందెల గురించి ఏ ముఖ్యమంత్రి అయినా మాట్లాడుతాడా? లంకెబిందులు సమాజంలో ఎవరు వెతుకుతారు? గవర్నమెంట్‌లో ప్రతిరోజు డబ్బులు వస్తాయి..పోతాయి. గవర్నమెంట్ దగ్గర కట్టలకు కట్టలు డబ్బులు ఉండవు. రైతు బంధు పేరును రైతు భరోసా అని పెడుతాం, 15 వేలు ఇస్తాం అన్నారు. రైతు భరోసా పోయింది గంగల కలిసింది. మేము ఇచ్చిన రైతుబంధే ఇవ్వలేకపోయారు. వీళ్లు ఇచ్చిన గ్యారెంటీలు భయంకరంగా ఫెయిల్ అయ్యాయి. ప్రజలు వాళ్ల తీర్పును పార్లమెంట్ ఎన్నికల్లో చూపెడతారు.

ఆరు నెలల్లోనే అంత చేంజ్ వచ్చిందా?

మల్కాజిగిరి సీఎం మీటింగ్‌కు 3-4వేలు మంది కూడా రాలేదు, భువనగిరిలో జనం రాలేదు, మహబూబాబాద్, ఆదిలాబాద్‌లో సీఎం సభ అట్టర్‌ఫ్లాప్ అయింది. మెదక్‌లో ఫ్లాప్ అయింది. జనం ఎందుకు వస్తలేరు? భయంకరమైన అనిశ్చితి. రైతు బీమా ఉంటదా ఊడుతదా తెలువదు. నీళ్లు ఇయ్యలే, కరెంటు ఇయ్యలే.. ఫెయిల్ అయ్యారు. కరెంటు ఇవ్వక మోటర్లు కాలబెట్టారు. వేలాది మోటర్లు, వందలాది ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. మాయమైన బోరుబండ్లు మళ్లీ వచ్చాయి. బాయిలో పూడికలు తీసే క్రేన్‌లు మళ్లీ వచ్చినయి. ఇదంతా కాంగ్రెస్ అసమర్థ పాలన కాదా?

లిక్కర్ స్కాం బోగస్

కుంభకోణమే లేదు.. అది నరేంద్రమోదీ సృష్టి

కక్షతో నా కూతురు మీద కేసు పెట్టారు

కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తుంది

టీవీ9 ఇంటర్వ్యూలో కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : ఢిల్లీ మద్యం స్కాం.. నరేంద్రమోదీ సృష్టించిన కుంభకోణం అని కేసీఆర్ స్పష్టంచేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు జరిగిన కుట్రలో బీజేపీ జాతీయ నాయకుడు బీఎల్ సంతోష్‌కుమార్ కీలక సూత్రధారి అని, అతడిని పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నించడం వల్లనే తనపై కక్షగట్టారని చెప్పారు. అందులో భాగంగానే తన కూతురు కవితపై కేసుపెట్టి అరెస్టు చేశారని మంగళవారం రాత్రి టీవీ9 బిగ్ డిబేట్‌లో చెప్పారు.

ప్రశ్న: బీఆర్ఎస్‌కు అతి పెద్ద జలక్, లిక్కర్ స్కాంలో స్వయంగా మీ కూతురు అరెస్ట్ కావడం. ఆ స్కాంలో ఆమె ప్రమేయం ఎంతవరకు ఉంది? మీకు ఎంతవరకు సమాచారం ఉంది...?

జవాబు: లిక్కర్ స్కాం బోగస్. అది నరేంద్రమోదీ సృష్టి. కుంభకోణం ఎక్కడుంది? అది ఢిల్లీ ప్రభుత్వ మద్యం విధానం. ఈ పాలసీ అన్ని రాష్ట్రాలకు ఉంటుంది. దీనిలో నుంచి నా కూతురు కడిగిన ముత్యం లాగా బయటికి వస్తది. కవితకు లిక్కర్ స్కాంకు ఏ మాత్రం సంబంధం లేదు. కవితను మొదట సీబీఐ వాళ్లు సాక్షిగా విచారించారు. ఇయ్యాల అపరాధి అంటున్నారు. వాట్ ఇజ్ దిస్. మూడు సంవత్సరాల నుంచి అదే ప్రశ్న. ఇంకో ప్రశ్న లేదు. ఎక్కడా ఒక్క రూపాయి రికవరీ లేదు. ఢిల్లీ ముఖ్యమంత్రిని తీసుకపోయి జైల్లో పెట్టారు. అది నియంతృత్వానికి పరాకాష్ఠ. ఒక ముఖ్యమంత్రికి బెయిల్ ఇవ్వరా? ముఖ్యమంత్రి పారిపోతాడా..? కవిత కూడా ఎమ్మెల్సీ . ఆమె పారిపోతుందా? ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలకు బెయిల్ ఇవ్వకుండా సంవత్సరాల తరబడి జైల్లో పెట్టడం ఏమిటి? ఈ దేశంలో ఏం జరుగుతున్నది? గాల్లో కట్టుకథ అల్లారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను అడ్డం పెట్టుకొని ఆయన చేత ఆర్డర్ ఇప్పించి, స్కాం పరిశోధన చేయాలని చెప్పి, సీబీఐ, ఈడీకి ఇచ్చి, అనవసరంగా అమాయకులను నరేంద్ర మోదీ శిక్షిస్తున్నారు.

ప్రశ్న: ఎందుకిలా చేస్తున్నారు?

జవాబు: నరేంద్రమోదీ 700 మంది ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను తీసుకున్నారు. ఎంపీలను, ఎమ్మెల్యేలను తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టారు. కర్ణాటక, మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వాలను కూల్చారు. తెలంగాణలో ప్రభుత్వాన్ని కూల్చడానికి వచ్చారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని చూసి దొరికిపోయారు. వాళ్లను పట్టుకొని జైల్లో ఉంచాం. దీంట్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌కుమార్ మూల సూత్రధారి. బీజేపీ సెంట్రల్ ఆఫీసులో ఉండే ఆయనను అరెస్ట్ చేయమని పోలీసులను పంపించాం. దాన్ని దృష్టిలో పెట్టుకొని కక్షతో నా కూతురు మీద అనవసరంగా కేసు పెట్టారు. అరెస్ట్ చేశారు. ఆడపిల్ల అని చూడకుండా నిర్బంధించి ఎన్నికల ముందు అరెస్ట్ చేశారు. దీని ద్వారా కేసీఆర్‌ను అపఖ్యాతి పాలు చేయవచ్చు అని బీజేపీ అనుకున్నది. దాని ఫలితం అనుభవిస్తారు. తెలంగాణ ప్రజలు చూపిస్తారు.

> **ప్రశ్న: లిక్కర్ కేసులో నిందితులుగా ఉన్న వాళ్లే అప్రూవర్‌గా మారి కవిత పేరు చెబుతున్నారు. కవితకు ఇండో స్పిరిట్ కంపెనీలో 33 శాతం వాటా ఉంది, ఢిల్లీ లిక్కర్ పాలసీని ప్రభావితం చేశారని ఆరోపిస్తున్నారు..?**
>
> **జవాబు:** అది ఆరోపణే కదా. కేసులో అప్రూవర్‌గా మారిన వ్యక్తి బీజేపీకి రూ.50కోట్లు ఎన్నికల బాండ్ ఇవ్వడంతో బెయిల్ ఇచ్చారు. దానికేం సమాధానం చెప్తారు. అసలు అది స్కాం కాదు. అది నరేంద్రమోదీ పొలిటికల్ స్కీం. నరేంద్రమోదీ గవర్నమెంట్ సృష్టించిన కాకమ్మ కథ అది. అమాయకులను అనవసరంగా అరెస్ట్ చేసి వేధిస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చేతిలో మూడుసార్లు పరాభవానికి గురై అతని మీద గెలిచే శక్తి లేక అతన్ని స్కటిల్ చేయడానికి, అతని క్యారెక్టర్ అసాసినేట్ చేయడానికి, ఇక్కడ మమ్ముల కూడా ఇబ్బంది పెట్టడానికి కేజ్రీవాల్‌ను, కవితను అరెస్ట్ చేశారు. మాకు న్యాయ వ్యవస్థ మీద గౌరవం, నమ్మకం ఉన్నాయి. ఫైట్ చేస్తున్నాం. అరవింద్ కేజ్రీవాల్, కవిత కడిగిన ముత్యంలా బయటికి వస్తారు. నాకు విశ్వాసం ఉంది.

గ్రామీణం తడబడి.. ఇప్పుడు తల్లడిల్లి!

- **హైదరాబాద్ మాతోనే ఉన్నది**
- **గ్రామీణులు కాంగ్రెస్ ట్రాప్‌లో పడ్డరు**
- **ఈ సారి బీజేపీకి వన్ ఆర్ నో సీట్**
- **టీవీ9 ఇంటర్వ్యూలో కేసీఆర్**

హైదరాబాద్ ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఇచ్చిన అడ్డగోలు హామీలు నమ్మిన గ్రామీణ ప్రజలు మోసపోయారని, ఆలోచించగలిగిన నగరవాసులు తమతోనే ఉన్నారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారు. తమ పార్టీ మీద ప్రజల్లో 100 శాతం నెగెటివ్ లేదని టీవీ9 ఇంటర్వ్యూలో స్పష్టంచేశారు.

ప్రశ్న: హామీల వల్ల ప్రజలు మోసపోయి కాంగ్రెస్‌కు ఓట్లు వేశారా..?

జవాబు: కచ్చితంగా అదే జరిగింది. ఎన్నికల తర్వాత ఓడిపోయిన వాళ్లు, గెలిచిన వాళ్లు, మా పార్టీ నాయకులు నాకు ఒక విషయం చెప్పారు. 'సార్ ప్రజలకు మీ మీద ఏకాణా కోపం లేదు. కేసీఆర్ మీద జీరో నెగెటివ్. కొంత మంది అభ్యర్థుల పొరపాట్ల వల్ల ఓడిపోయాం. ఇంకా కొన్ని వేరే కారణాల వల్ల ఓడిపోయామే తప్ప.. 100 శాతం మీపై నెగెటివ్ లేదు. ప్రజలు అయ్యో కేసీఆర్ ఓడిపోతడని అనుకోలేదు' అని అంటున్నారని చెప్పారు.

ప్రశ్న: గత ఎన్నికల్లో గ్రామీణులు బీఆర్ఎస్‌కు ఓటేయలేదు. దీన్ని గుర్తించారా?

జవాబు: అందుకే నేను చెప్తున్నా. హైదరాబాద్ మాతోనే ఉంది. ఇక్కడ ఆలోచించగలిగిన వాళ్లు ఉన్నారు. అర్థం చేసుకున్నారు. కానీ గ్రామీణ ప్రజలు అమాయకులు కాబట్టి.. కాంగ్రెసోళ్ల అడ్డగోలు హామీలను చూసి ట్రాప్‌లో పడిపోయారు. ఇప్పుడు అదే గ్రామీణ ప్రజలు, గ్రామీణ ప్రాంతం తల్లడిల్లుతున్నది.

ప్రశ్న: మళ్లీ ఆ గ్రామీణ ప్రజలను మీ ట్రాక్‌లోకి తెచ్చుకోవడానికి ఏం చేస్తారు?

జవాబు: ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ వైపు వస్తారు. పార్లమెంట్ ఎన్నికలే ఇందుకు 100 శాతం పునాది వేస్తాయి.

ప్రశ్న: ఇప్పుడు ఈ వేదిక ద్వారా కొన్ని అంశాలు వివరించారు. రేపు ప్రజలకు ఇంకా వివరించదలుచుకున్నారా..?

జవాబు: కచ్చితంగా.. బస్సు యాత్రలో నేను చేసే పనే అది. బస్సు యాత్రలో వాస్తవాలను కుండబద్దలు కొడతాం.

ప్రశ్న: బీజేపీ రాముడి నినాదం తీసుకొని వస్తున్నది. ఆ నినాదం తెలంగాణలో మిమ్మల్ని ఆపే అవకాశం లేదా?

జవాబు: ఇక్కడ బీజేపీకి గ్రౌండ్ దొరకలేదు. ప్రజాభిమానం దొరికి ఉంటే.. అభ్యర్థుల కోసం బీఆర్ఎస్ వాళ్ల చుట్టూ ఎందుకు తిరుగుతున్నది? బీబీ పాటిల్‌ను ఈ రోజు పార్టీలో చేర్చుకొని రేపు టికెట్ ఇచ్చారు. ఇలా ఎంతోమందికి టికెట్లు ఇచ్చింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 107 సీట్లలో డిపాజిట్ పోయింది. మొన్నటి ఎన్నికల్లోనూ 64 సీట్లలో డిపాజిట్ పోయింది. అందుకే బీజేపీకి 'వన్ సీట్ ఆర్ నో సీట్ ఇన్ తెలంగాణ'. ఆ ఒక్క సీటు కూడా ఎక్కడ అని చెప్పలేం. మా సర్వే రిపోర్టుల్లో అనేకచోట్ల కాంగ్రెస్ థర్డ్ ప్లేస్‌లో, మరికొన్ని చోట్ల బీజేపీ థర్డ్‌ప్లేస్‌లో ఉంది.

ప్రశ్న: కాంగ్రెస్, బీజేపీ వాళ్లు బీఆర్ఎస్‌కు ఒక సీటు వస్తుందని అంటున్నారు.?

జవాబు: ఫలితాలొస్తాయి కదా.. చూద్దాం.

ప్రశ్న: బీఆర్ఎస్ పార్టీ పెట్టిన తర్వాత 24 ఏండ్లలో చాలా ఆటుపోట్లు చూశారు. కానీ గత ఆటుపోట్లు వేరు.. ఈ ఆటుపోట్లు వేరు. కేసీఆర్ మళ్లీ బ్యాక్ రాగలుగుతారా అనే వాళ్లకు సమాధానం?

జవాబు: అలా అనుకునేవాళ్ల మూర్ఖులు. కేసీఆర్ బ్రహ్మాండంగా ప్రజ్వలంగా ఉజ్వలంగా వస్తడు.

ప్రశ్న: అప్పుడు తెలంగాణ నినాదం ఉంది. ఇప్పుడు లేదు కదా. ఇప్పుడు ఏం చెప్పి వస్తారు అని అడుగుతున్నారు..?

జవాబు: అభివృద్ధి నినాదంతో సెకండ్ టర్మ్‌లో 88 సీట్లతో వచ్చినం. నెక్ట్స్ టైం మేం 98 సీట్లతో వస్తాం. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అంత ఆగ్రహం ఉంది. సోషల్ మీడియా వాళ్లు ప్రజలను అడిగితే.. 'ఇప్పుడు ఎలక్షన్స్ పెట్టండి.. మా సంగతి చూపి స్తాం.. కేసీఆర్‌ను మళ్లీ తీసుకొస్తాం' అని అంటున్నారు.

ప్రశ్న: కేటీఆర్ ఇంటర్వ్యూకి వచ్చిన ప్రతిసారి అడుగుతా.. సీఎం ఎప్పుడు అవుతారని. ఇప్పుడు మిమ్మల్నే అడుతున్నా.. బీఆర్ఎస్‌లో మీ వారసుడెవరు?

జవాబు: వారసుడిని నిర్ణయించే అధికారం ఎవరికీ ఉండదు. సమయం సందర్భాన్ని బట్టి నాయకులు తయారవుతారే తప్ప.. తయారు చేస్తే నాయకులు కారు.

ప్రశ్న: పార్టీలో మీరు ఇంతమంది నాయకుల్ని తయారు చేశారు. మీ కుటుంబంలో నాయకులను తయారు చేశారా లేదా..?

జవాబు: ఉద్దేశపూర్వకంగా ఎవర్నీ నాయకులను తయారు చేయలేదు. ప్రాసెస్‌లో వచ్చారు. సపోజ్ కేటీఆర్, హరీశ్ ఉన్నారు.. వాళ్లకు ఒకసారి నేను సీటు ఇచ్చిన. ఆ తర్వాత వాళ్లకు ప్రతిభ ఉంటే.. ప్రజల్లో కలిసిపోతే.. హరీశ్ ఆరేడుసార్లు గెలిచాడు. రాము కూడా ఐదుసార్లు ఎమ్మెల్యే అయిండు. అవకాశం వస్తే దాన్ని సద్వినియోగం చేసుకొని నిలబెట్టుకున్నవాళ్లు ఎదుగుతారు.

కడియం భూ స్థాపితమే

- *వరంగల్‌లో లాభమే జరిగింది*
- *ఆయనో పొద్దుతిరుగుడు పువ్వు*
- *టీవీ 9 ఇంటర్వ్యూలో కేసీఆర్*

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): కడియం శ్రీహరి తన రాజకీయ భవిష్యత్తును తానే భూస్థాపితం చేసుకున్నారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారు. మంగళవారం టీవీ9 కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ మాట్లాడుతూ.. ఓడిపోయి ఇంటి కాడ ఉన్న శ్రీహరికి ఉపముఖ్యమంత్రిని చేశానని గుర్తుచేశారు.

ప్రశ్న: టికెట్ ఇచ్చిన కడియంశ్రీహరి ఎందుకు బయటకు వెళ్లారు? మీరు డబ్బులు ఇచ్చారా? లేదా?

జవాబు: కడియం శ్రీహరికి డబ్బులు ఇచ్చారా? లేదా? అనేది ఏ రాజకీయ పార్టీ చెప్పదు. ఇది పొలిటికటికల్ వ్యవహారం. ఇది రెగ్యులర్ ప్రాసెస్. శ్రీహరి అనే వ్యక్తి ఓడిపోయి ఇంటి కాడ ఉంటే.. నేనే పిలిచి ఆయనను ఎంపీగా గెలిపించిన. ఆయనతో ఇక్కడ అవసరం ఏర్పడిందని, ఆయన సీనియర్ అని, రాజీనామా చేయించి, మళ్లీ బై ఎలక్షన్లలో గెలిపించి, ఎమ్మెల్సీని చేసిన. ఇక్కడ ఉప ముఖ్యమంత్రిని చేశాను. ఒక రాజకీయ పార్టీ అంతకంటే ఎక్కువ ఏ పదవి ఇస్తదండి. ఆయ ఖర్మ బాగా లేక వెళ్లిపోయిండు. రాజకీయంగా తనను తానే భూ స్థాపితం చేసుకున్నడు. వరంగల్‌లో తాను చచ్చి, ఇప్పుడు బీఆర్ఎస్‌ను బతికిచ్చిండు. మాకు లాభం జరిగింది. మీరు చూస్తరు వరంగల్ రిజల్ట్. నీ బిడ్డకు టికెట్ ఎట్లా వచ్చిందండి? ఆ అమ్మాయికి ఎం దుకు ఇచ్చిన? కడియం కూతురు అనే కదా? అప్పుడు నీకు స్వేచ్ఛ కనపడలే. పొద్దుతిరుగుడు పువ్వు లాగా పార్టీని విడిచి పెట్టి అధికారి పార్టీ వైపు వెళ్లారు.

ప్రశ్న: కడియంతోపాటు చాలా మంది కాంగ్రెస్‌లో చేరడాన్ని ఎట్లా చూస్తరు?

జవాబు: బీఆర్ఎస్ నుంచి వెళ్లన వారు ఎంత మందండి. పిడికెడు మంది. బీఆర్ఎస్ ఒక మహాసముద్రం. వందల మంది ఎమ్మెల్యేలను, పదుల సంఖ్యలో ఎమ్మెల్సీలను, పదుల సంఖ్యలో ఎంపీలను, డజన్ల కొద్ది జడ్పీ చైర్మన్లను, డీసీసీబీ చైర్మన్లను, వేల సంఖ్యలో సర్పంచ్‌లను, జడ్పీటీసీలను, ఎంపీటీసీలను, సింగిల్ విండో చైర్మన్లను సృష్టించిన ఒక మహాసముద్రం బీఆర్ఎస్.

ఎవరు దొర? ఎవరిది దొరలపాలన?

వడ్లు కొనాలని కాళ్లు మొక్కుడు ప్రజా పాలనా?

రైతు దర్జాగా కాలుమీద కాలేసుకొని బతికిందా..

రైతుబంధు అడిగితే చెప్పతో కొడతామనోళ్లు దొరలా

రైతుబంధును పూలలో పెట్టి బ్యాంకులో వేసినోళ్లా?

24 గంటల కరెంట్ ఇచ్చిన ముఖ్యమంత్రి దొరనా?

కరెంట్ ఎగబెట్టిన ముఖ్యమంత్రిది ప్రజాపాలనా..?

టీవీ9 ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): 'జనగామల ఓ మహిళ బాంచెన్.. కాల్మొక్తా ధాన్యం కొనుండ్రని పోలీసుల కాళ్లు మొక్కుతోంది. దీన్ని దొరలపాలన అంటరా.. దర్జాగా కాలు మీదకాలేసుకొని రైతు నడింట్ల ఉండుడు దొరలపాలనా? ప్రపంచంలోనే ఎక్కడాలేని దళితబంధు తెచ్చింది దొరలపాలనా..? రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతా అన్నోళ్లదా? రైతుబంధును పూలల్లో పెట్టి బ్యాంకుల్లో వేసింది మేము..' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విరుచుకుపడ్డారు. మంగళవారం టీవీ9 చానల్ నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో 'దొరపాలన, గడీల పాలన అంతం చేశామంటున్నారు. దీనికి ఏం సమాధానం చెబుతారు' అన్న ప్రశ్నకు కేసీఆర్ సమాధానమిస్తూ 'నేను దొరనా.. మా సామాజికవర్గాన్ని వెలమదొరలు అని పిలుస్తరు. ఐ యామ్ ప్రౌడ్ టూ బీ ఏ వెలమ దొర. ఐ డోంట్ థింక్ ఎనీథింగ్ ఫర్ దట్. వందల వేల సంవత్సరాల నుంచి అలాగే పిలుస్తరు. దీనికి నన్ను దొర అని ప్రొజెక్ట్‌చేసి అంటరా? జనగామలో ఓ మహిళ బాంచెన్ కాల్మొక్తా ధాన్యం కొనుండ్రి అని పోలీసుల కాళ్లు మొక్కింది. దీన్ని దొరలపాలన అంటారా.. దర్జాగా కాలు మీదకాలేసుకొని రైతు నడింట్ల రందిలేకుంట ఉన్నది దొరలపాలనా?.' అని ప్రశ్నించారు. '1100 గురుకులాలు పెట్టి లక్షల మంది విద్యార్థులకు ఉన్నత చదువులు చెప్పింది దొరలపాలనా? పేద విద్యార్థులకు 20 లక్షల చొప్పున ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ఇచ్చింది దొరల పాలనా? వృద్ధులకు 200 పెన్షన్‌ను రూ.2వేలు చేసింది దొరలపాలనా..? అన్నార్థులను ఆదుకున్నది దొరలపాలనా? కేసీఆర్ కిట్టు ఎవరన్నా ఇచ్చిండ్రా..? గర్భిణులకు న్యూట్రిషన్‌కిట్లు ఇచ్చి వాళ్లను ఫ్రీగా బస్సులో తీసుకెళ్లి ప్రసవం చేయించి మందులన్నీ ఇచ్చి ఇంట్లోదించిన ప్రభుత్వాన్ని చూసినమా? బస్తీ దవాఖానలు పెట్టిన ప్రభుత్వాన్ని చూసినమా? ఇన్ని సేవలందిచడం దొరపాలన ఎట్లా అవుతది.? అడుగడుగునా మాది మానవీయ పాలన. విషప్రచారం చేసి ప్రజలను బురిడీకొట్టించి గెలిచిండ్రు. ఆరు నెలల్లో ప్రజలు రియలైజ్ అయ్యిండ్రు. ఎవరిది దొరపాలన? ఎవరికి అహంకారం ఎవరికి దురహంకారమని గ్రహించారు. 'ఈ రోజు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన దుర్మార్గాలు, కాంగ్రెస్ మంత్రులు మాట్లాడుతున్న మాటలను ప్రజలు గమనిస్తున్నరు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతా అంటారా? చెప్పుతో కొట్టేవాళ్లే దొరలు. రైతు బంధు పూలల్లో పెట్టి బ్యాంకుల్లో వేసినోళ్లం మేంము. రైతులను ఎంతగా పీడిస్తున్నరు. పండిన వడ్లు కొంటలేరు. కల్లాల్లో పది రోజులైనా కొనేదిక్కులేదు. కోల్‌కత్తా నుంచి గన్నీ బ్యాగులు తెప్పించి రోజూ లక్ష నుంచి లక్షన్నర టన్నుల ధాన్యం కొనేవాళ్లం. ఈ రోజు దిక్కు లేదు. రైతుబంధు పడిందా.. లేదా? కరెంటు ఇస్తున్నరా.. లేదా? పంట కొనుగోలు చేసిండ్రా లేదా? అని పర్యవేక్షించిన ముఖ్యమంత్రి దొరనా? 24 గంటల కరెంట్ ఇచ్చిన ముఖ్యమంత్రి దొరనా.. కరెంట్ ఎగబెట్టిన ముఖ్యమంత్రిది ప్రజాపాలనా..? ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో నిర్ణయించాలె..



ప్రశ్న : కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వెళ్తున్నదని చెప్పదలుచుకున్నారా?

జవాబు : వాళ్ల చర్యల పట్ల నేను జాలిపడుతున్న. వాళ్లు కక్ష సాధించాలనుకున్నా సాధించలేరు. మేము ఎంత నిజాయతీగా ఉన్నామో నాకు తెలుసు. నేను జానారెడ్డిని కాదు.. ఫలానా కాదు. చర్లపల్లి జైలులో డబుల్ బెడ్రూం ఇల్లు కట్టిస్తా అంటున్నరు. కట్టియ్యమనండి. వీధి రౌడీలు చేసే హెచ్చరికలు ఓ ముఖ్యమంత్రి చేయవచ్చా? తెలంగాణ సాధకుడిని పట్టుకొని ఇష్టమొచ్చినట్లు మాట్లాడవచ్చా.. ఇది పద్ధతేనా? శాసనసభలో, బజార్లల్లో మాట్లాడవచ్చా? నా టర్మ్‌లో నేను ఇట్లా మాట్లాడిన్నా? న్యాయవ్యవస్థ ఉన్నది. ప్రజలే బుద్ధిచెప్తరు.

ప్రశ్న: భాషలో నాకు కేసీఆరే గురువు అన్న రేవంత్ వ్యాఖ్యలపై ఏం చెబుతారు?

కేసీఆర్ : రాజకీయ నాయకులు ఉద్వేగాలను, విషయ తీవ్రతలను ప్రజల్లోకి పంపించేందుకు వ్యంగ్యాన్ని వాడుతరు. ఇది సహజం. నాపై సమైక్యవాదులు చేసిన దాడి, ఆరోపణలు అంతా ఇంతా కాదు. వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టిన. చేతకాని కాంగ్రెస్ వాజమ్మలు, చవటలు దద్దమ్మలు అని వ్యంగ్యాన్ని మాట్లాడిన. మొరటు భాష నేనెప్పుడు మాట్లాడలేదు. ఈ ముఖ్యమంత్రి వాడుతున్న భాషను ఎప్పుడూ నేను వాడలే.

ప్రశ్న : ప్రజలు కష్టాల్లో ఉన్నారు. అసెంబ్లీకి మీరు ఎందుకు వెళ్లడంలేదు.?

జవాబు : పార్టీ ఓటమి తర్వాత ఎమ్మెల్యేలను పిలిచి కారణమేదైనా మనం ఓటమి చెందినమని చెప్పిన. కొత్త ప్రభుత్వానికి నాలుగైదు మాసాలు సమయమిద్దాం, వాళ్లు కుదురుకోవడానికి సమయంపడుతుంది, ఇప్పుడే విమర్శలు చేయవద్దని చెప్పిన. కానీ మావాళ్ల కంటే ముందే కాంగ్రెసోళ్లే మొదలుపెట్టిండ్రు. వాళ్లు శ్వేతపత్రం విడుదల చేస్తే, మావోళ్లు స్వేదపత్రం విడుదల చేసిండ్రు. వాళ్లు దురుసు, అడ్డగోలు ఆరోపణలు చేస్తే మావాళ్లు ప్రతిస్పందించిండ్రు. సీఎం మంత్రులు మాట్లాడిన వాటి మీదే మాట్లాడిన్రు. మా కార్యకర్త మీద దాడులు చేస్తుంటే మేం మాట్లాడాల్సి వస్తోంది. ఆ తర్వాత వాళ్ల వైఫల్యాలు బయటపడ్డాయి. ఆ సమయంలో అసెంబ్లీకెళ్లి మాట్లాడాలనుకున్నం. కానీ సమయమిద్దామన్న ఓర్పుతో ఆగినం. ఇక అసెంబ్లీలో చీల్చిచెండాడుతం. బ్రహ్మాండంగా వాళ్ల నిజస్వరూపం ప్రజల ముందు పెడుతం.

ప్రశ్న : సభానాయకుడిగా పదేండ్లు ఉండి, ప్రతిపక్షనేతగా మాట్లాడగలుగుతారా?

కేసీఆర్: అద్భుతంగా మాట్లాడుతం. ఎందుకు మాట్లాడం?. ఎందుకు అసెంబ్లీకి పోం?. వీ ఆర్ ది వాయిస్ ఆఫ్ ది పీపుల్.

ప్రశ్న : పార్టీలో ఉద్యమకారులకు అవకాశాలిస్తారా, అవకాశవాదులకిస్తారా?

జవాబు : సమ్మిళితంగా అందరికీ అవకాశాలిస్తం. ఉద్యమకారులు ఒక్కరే ఉండరు. అప్పుడో మాట ఇప్పుడో మాట అవసరాన్ని బట్టి మాటలు చెప్పం. ఉద్యమకారులకు మంచి స్థానాలు కల్పిస్తం. ఇతరులు ముఖ్యమైనోళ్లకు చోటు కల్పిస్తం.

ప్రశ్న : అధికారంలో ఉన్నప్పుడు కోటరీ ప్రభావం చూపిందా? ఆ కోటరీని బద్ధలు కొడతారా..?

జవాబు: కోటరీ అబద్ధం. నాట్ ఎట్ అల్. నేను అందరితో ఉంటా.. అందర్నీ కలుస్తా. తొలిరోజుల్లో ఆ తర్వాత రోజుల్లో నేను చాలా మందిని కలువలేదు. కారణమేమిటంటే, ఎవరినపడితే వాళ్లను పిలిచి టీలు, కాఫీలిచ్చి గప్పాలు కొట్టి గంటలు గంటలు కూర్చోవడం నాకు ఇష్టం లేదు. దీనికి స్ట్రాంగ్ రీజన్ ఉంది. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణకర్తగా గురుకులాలను స్థాపించడం ఎట్లా? ప్రాజెక్ట్‌లు కట్టాలంటేఎట్లా? కరెంట్ ఇవ్వాలంటే ఎట్లా ? సంక్షేమం చేయాలంటే ఎట్లా? వీటి మీద మెదడు ఖర్చుపెట్టినం. గొర్రెల పంపిణీ పథకం పెట్టినం. అధికారులు చాలా కన్ఫ్యూజ్ చేసిం డ్రు. కేబినెట్ నిర్ణయం తర్వాత మంత్రి సంతకం చేసి గైడ్‌లైన్స్ ఇస్తరు. అవి కలెక్టర్లు సహా ఎవరికీ అర్థంకావు. క్లారిఫికేషన్లు రాయ డం, గవర్నమెంట్ బద్నాం కావడం జరిగేది. మా సమయంలో కన్‌ఫ్యూజన్ క్రియేట్ చేసిం డ్రు. కేబినెట్, కలెక్టర్లను పలిచి గైడ్‌లైన్స్ రాసినం.

ప్రశ్న : కేసీఆర్ ప్రజలను కలవరు అని ఎందుకు ప్రచారమైంది?

జవాబు : కొన్ని లక్షల మందిని కలిసిన. ఎంతోమంది ప్రత్యక్షంగా కలిశారు. ఎన్నో కార్యక్రమాలు చేసినం. బ్రహ్మాండంగ కార్యక్రమాలు చేసినం. బాకా.. కాకా మీడియా పథకం ప్రకారం ప్రచారం చేశారు.

ప్రశ్న : అధికారంలో ఉన్నప్పుడు ఈ ఆరోపణలను మీరు ఎందుకు పటాపంచలు చేయలేదు. ఎందుకు ఖండించలేదు.

కేసీఆర్ : అలాగే ప్రచారం చేశారు. కానీ సెకండ్ టర్మ్ మేం గెలిచినం. మేం ప్రజలను నమ్మినం. మనం బాగున్నం.. రోజూ వాళ్లతో తకరాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. వాళ్ల కథ ప్రజలే తేలుస్తరని అనుకున్నం. కానీ అడ్డగోలు హామీల వల్ల ప్రజలు మోసపోయారు.

> **ప్రశ్న : ప్రగతిభవన్ ముందు గేట్లు పగులగొట్టినం.. గడీలు బద్దలుగొట్టినం అంటున్నారు.. దీనిపై మీ స్పందన?**
>
> **కేసీఆర్ :** నిజంగా ప్రజాపాలన ప్రజల పాలనే అయితే మరీ అసెంబ్లీ ముందు గ్రిల్స్ ఎందుకున్నయ్. వాటిని కూడా పీకేయండి. అసలు ప్రగతిభవన్ ముందు గ్రిల్స్ నేను వేయలేదు. కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పుడే వేశారు. ప్రొటెక్షన్ కంచెలు వేసేది పోలీసులు. ఎంత చిల్లర.. చీప్ టాక్‌టిక్స్. అదే ప్రగతిభవన్‌లో బంగారు బాత్రూమ్‌లున్నయి.. తోకమట్టున్నదని మాట్లాడారు కదా. అది అంతా కలిపితే నాలుగు బెడ్‌రూంల ఇల్లు. మీటింగ్స్ కోసం హాల్స్ ఉంటయ్. అధికారులకు ఆఫీస్ రూములుంటయ్.

మూడో విడత బరిలో 1,351 మంది

న్యూఢిల్లీ : మే 7న జరగబోయే మూడో విడత సార్వత్రిక ఎన్నికల్లో 12 రాష్ట్రాలు, యూటీల నుంచి 95 సీట్లలో 1,351 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు ఎన్నికల సంఘం మంగళవారం వెల్లడించింది. ఇందులో ఎంపీలోని బీతుల్ నియోజకవర్గ ఎన్నిక కూడా ఉందని తెలిపింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. సూరత్ నుంచి బీజేపీ అభ్యర్థి ముఖేష్ దలాల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఈసీ తెలిపింది. మూడో విడత ఎన్నికకు 2,963 నామినేషన్లు దాఖలు కాగా, అందులో 1563 సక్రమంగా ఉన్నట్టు ధ్రువీకరించారు. గుజరాత్‌లోని 26 లోక్‌సభ స్థానాలకు 658, మహారాష్ట్రలోని 11 సీట్లకు 519, మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌లో అత్యధికంగా 77 మంది, ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో 68మంది నామినేషన్లు వేశారు.



వీవీప్యాట్లపై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: ఈవీఎంలలో పోలైన ఓట్లను వీవీప్యాట్ స్లిప్‌లతో సరిపోల్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించనుంది. వీవీప్యాట్ మెషిన్లపై ఓటరుకు స్లిప్ సులువుగా కనిపించే అద్దం స్థానంలో ఏడు సెకన్ల పాటు లైట్ వచ్చినప్పుడు మాత్రమే కనిపించేలా మరో రకమైన గ్లాస్‌ను ఏర్పాటుచేస్తూ 2017లో ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా ఆదేశించాలని ఏడీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వనుంది.

ఓటేస్తే అటుకుల ఉప్మా, జిలేబీ, ఐస్‌క్రీమ్ ఫ్రీ

ఇండోర్‌లో ఫుడ్ షాప్స్ ఆఫర్

భోపాల్, ఏప్రిల్ 23: ఎన్నికల పోలింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరుతూ, మధ్యప్రదేశ్ ఇండోర్ నగరంలోని ఫుడ్ షాప్స్ యజమానులు ఓటర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించారు. పోలింగ్ మొదలైన తొలి గంటల్లో ఓటేసేవారికి జిలేబీ, ఐస్‌క్రీమ్, అటుకుల ఉప్మా.. ఉచితంగా పంపిణీ చేస్తామని నగరంలోని ఆహార షాపుల యజమానులు తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో జరిగిన సమావేశం అనంతరం దుకాణాదారుల సంఘం మంగళవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక జడ్జి మే 7 వరకు పొడిగించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేసిన సీబీఐ, ఈడీ వ్యవహారాల జడ్జి కావేరీ బవేజా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడంతో కేజ్రీవాల్‌కు తక్కువ డోస్ ఇన్సులిన్ ఇచ్చినట్టు తీహార్ జైలు అధికారులు వెల్లడించారు. అయితే గతంలో ఇన్సులిన్ అవసరం లేదన్నవారు ఇప్పుడు ఎందుకిచ్చారని ఆప్ ప్రశ్నించింది.

‘10 రోజుల్లో ఎంబీఏ’పై జాగ్రత్త

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పది రోజుల్లో ఎంబీఏ, పది రోజుల్లో బీబీఏ వంటి ఆన్‌లైన్ ప్రకటనలు చూసి మోసపోవద్దని, వాటికి ఎలాంటి గుర్తింపు కానీ, సాధికారిత కానీ ఉండదని యూజీసీ ఒక ప్రకటనలో విద్యార్థులు, తల్లిదండ్రులను అప్రమత్తం చేసింది. ఎంబీఏ, బీబీఏ లాంటి సంక్షిప్త పదాలతో కొన్ని సంస్థలు/వ్యక్తులు చేస్తున్న ఆన్‌లైన్ ప్రచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఆన్‌లైన్ ద్వారా ఉన్నత విద్యను అందించే గుర్తింపు పొందిన సంస్థల లిస్టు www.deb.ugc.ac.inలో ఉందని, విద్యార్థులు తాము చదివే విద్యాసంస్థల పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించింది.

గడ్డకట్టిన జలపాతంలో చిక్కుకొని..

కిర్గిస్థాన్‌లో ఏపీ విద్యార్థి మృతి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దాసరి చందు(20) అనే ఓ మెడికల్ విద్యార్థి కిర్గిస్థాన్‌లో మరణించాడు. అక్కడ గడ్డకట్టిన ఒక జలపాతంలో చిక్కుకొని అతను మృతిచెందాడని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. అనకాపల్లికి చెందిన చందు కిర్గిస్థాన్‌లో మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. చందు మరో నలుగురు స్నేహితులతో కలిసి ఆదివారం జలపాతం వద్దకు విహారయాత్రకు వెళ్లారు.

మోదీ సర్కార్ నన్ను వెళ్లగొట్టింది

ఆస్ట్రేలియా జర్నలిస్టు ఆరోపణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి వార్తల్ని కవరేజ్ చేసిన తర్వాత తనపై కేంద్రం కక్షపూరిత చర్యలకు దిగిందని ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (ఏబీసీ) దక్షిణాసియా కరస్పాండెంట్ అవనీ దియాస్ ఆరోపించారు. వీసా రెన్యువల్ చేయాలన్న తన అభ్యర్థనను మోదీ సర్కార్ ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవటంతో, అనివార్యంగా దేశం విడిచివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

‘హనుమాన్ చాలీసా’ విన్నా నేరమే!

- కాంగ్రెస్ గెలిస్తే ముమ్మాటికీ ఇదే జరుగుతుంది
- మన మత విశ్వాసాలను కూడా ఆచరించలేం
- రాజస్థాన్‌లో మోదీ వివాదాస్పద వ్యాఖ్యలు
- ఎస్సీ, ఎస్టీ కోటా తగ్గించి ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రయత్నించిందని ఆరోపణ
- మోదీ ‘ముస్లిం’ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోండి
- ఈసీకి దేశంలోని 20 వేల మంది మేధావుల లేఖ
- ఫిర్యాదులను పరిశీలిస్తున్నామన్న ఎన్నికల సంఘం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ముస్లింలే లక్ష్యంగా చొరబాటుదారులంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి అవే తరహా వ్యాఖ్యలు చేశారు. రాజస్థాన్‌లోని టోంక్‌లో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మాట్లాడుతూ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే, వాళ్ల పాలనలో హనుమాన్ చాలీసాను వినడాన్ని కూడా నేరంగా పరిగణిస్తారని అన్నారు. మన విశ్వాసాలను ఆచరించడం కూడా కష్టమేనని ధ్వజమెత్తారు. దేశంలోని ప్రజల సంపదను దోచుకొని, లక్షిత వర్గాల వారికి దాన్ని పునఃపంపిణీ చేస్తుందని కాంగ్రెస్‌పై మరోసారి నిప్పులు చెరిగారు. ఈ విషయాన్ని చెప్తే.. కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు తనను నిందిస్తున్నారన్న మోదీ.. అయినప్పటికీ, ఈ నిజాన్ని తాను దేశ ప్రజలకు చెప్పదలుచుకొన్నట్టు వెల్లడించారు. ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాలకు కాంగ్రెస్ తెగబడుతున్నట్టు ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ కోటా తగ్గించి ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలని 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించిందని, ఆంధ్రప్రదేశ్‌లో దీన్నో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి అనంతరం దేశమంతటా అమలు చేయాలనుకొన్నదని ఆరోపించారు.



దీనికోసం రాజ్యాంగ నియమాలను కూడా పట్టించుకోలేదన్నారు. చట్టపరమైన అవరోధాలు, సుప్రీంకోర్టు జోక్యంతో ఇది సాధ్యపడలేదని తెలిపారు.

ఈసీకి మేధావుల లేఖ

రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ప్రధాని మోదీ చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ దేశవ్యాప్తంగా దాదాపు 20 వేల మంది హక్కుల కార్యకర్తలు, మేధావులు ఎన్నికల సంఘానికి లేఖలు రాశారు. కాగా, ఫిర్యాదులపై తాము పరిశీలిస్తున్నట్టు ఈసీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు జాతీయ న్యూస్ వెబ్‌సైట్ ‘ఇండియా టుడే’ వెల్లడించింది.

‘కాంగ్రెస్ వస్తే, షరియా చట్టం’

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, షరియా చట్టాన్ని తీసుకొస్తుందని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఈ విషయాన్ని ఆ పార్టీ స్పష్టం చేసినట్టు పేర్కొన్నారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దేశద్రోహానికి పాల్పడ్డాయన్న ఆయన.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

‘80% వర్సెస్ 20%’

రానున్న ఎన్నికలు ‘80 శాతం వర్సెస్ 20 శాతం’ ప్రజల మధ్య జరుగుతున్న పోరు అని యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ముస్లింలే లక్ష్యంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. దేశ ప్రజల మధ్య విభజన రేఖను సృష్టించే కుట్రలకు బీజేపీ సిద్ధమయ్యిందని విరుచుకుపడ్డాయి.

రాజ్యాంగాన్ని మాపై రుద్దారు!

- మా తలరాతను వేరొకరు రాశారు
- 1961లో పోర్చుగీసుల నుంచి విముక్తి పొందగానే ఇలా చేశారు
- దక్షిణ గోవా కాంగ్రెస్ అభ్యర్థి విరియాటో వివాదాస్పద వ్యాఖ్య
- దేశాన్ని విభజించే కుట్రేనన్న మోదీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): రాజ్యాంగాన్ని తమపై బలవంతంగా రుద్దారని దక్షిణ గోవా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి విరియాటో ఫెర్నాండెజ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1961లో పోర్చుగీసుల పాలన నుంచి విముక్తి లభించినప్పటికీ.. తమ తలరాతను మాత్రం వేరొకరు రాసినట్టు చెప్పారు. ఈ మేరకు దక్షిణ గోవాలో సోమవారం జరిగిన ఎన్నికల సభలో మాట్లాడారు. ‘2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీతో మాట్లాడా. గోవా ప్రజలకు ద్వంద్వ పౌరసత్వం ఇవ్వడంపై ఆయనతో చర్చించా. 1961లో గోవాకు విముక్తి లభించగానే, గోవా ప్రజలపై రాజ్యాంగాన్ని బలవంతంగా రుద్దారని చెప్పా.



పోర్చుగీసుల నుంచి విముక్తి లభించిన తర్వాత వారి (గోవా ప్రజలు) తలరాత వారే నిర్ణయించుకొంటారని మాజీ ప్రధాని నెహ్రూ చెప్పినట్టు గుర్తు చేశా. అయితే, మా తలరాతను వేరొకరు రాశారని తెలిపా’ అని పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని కించపరిచేలా..

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి విరియాటో భారత రాజ్యాంగాన్ని కించపరిచారని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. విభజన రాజకీయాలను కాంగ్రెస్ ఇకనైనా మానుకోవాలని గోవా సీఎం సావంత్ సోషల్‌మీడియాలో విరుచుకుపడ్డారు.

బీజేపీ నేతలు ఇలా..

కాంగ్రెస్ నేతలే కాదు.. బీజేపీ నేతలు కూడా రాజ్యాంగంపై వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసి విమర్శలు ఎదుర్కోవడం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేకు 400కు పైగా సీట్లను ఇచ్చి గెలిపిస్తే, రాజ్యాంగాన్ని మారుస్తామంటూ బీజేపీ సీనియర్ నేతలు అనంత్‌కుమార్ హెగ్డే, గజేంద్ర సింగ్ షెకావత్, లల్లూ సింగ్, జ్యోతి మిర్ధా, అరుణ్ గోవిల్ వ్యాఖ్యానించడం రాజకీయ దుమారం రేపింది.

ముస్లింలందరినీ బీసీలను చేస్తారా?

- ఇది అత్యంత వెనకబడ్డ వర్గాలను బలహీనపర్చడమే
- కర్ణాటక రిజర్వేషన్ల విధానంపై బీసీ కమిషన్ ఆగ్రహం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: మొత్తం ముస్లిం సామాజిక వర్గాన్ని వెనుకబడిన కులంగా గుర్తించాలన్న కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్(ఎన్‌సీబీసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా చేయడం సామాజిక న్యాయ సూత్రాలను బలహీనపరచడమేనని వ్యాఖ్యానించింది. కర్ణాటక వెనకబడిన సంక్షేమ తరగతుల విభాగం సమర్పించిన డాటా ప్రకారం ముస్లిం మతంలోని అన్ని కులాలు, వర్గాలను సామాజికంగా, విద్యా పరంగా వెనకబడిన తరగతులుగా గుర్తించి IIబి విభాగంలో చేర్చారు. గతేడాది ఎన్‌సీబీసీ కర్ణాటకలో పర్యటించినప్పుడు ఓబీసీలకు విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం రూపొందించిన రిజర్వేషన్ల విధానాన్ని పరిశీలించింది. ముస్లిం మతంలోని వర్గాలన్నింటినీ బీసీలుగా గుర్తించడం వల్ల ఆ మతంలో అత్యంత వెనకబడిన వర్గాలను బలహీనపరిచినట్టే అవుతుందని తెలిపింది. ఇలాంటి రిజర్వేషన్లు సామాజిక న్యాయాన్ని మొత్తంగా ప్రభావితం చేస్తాయని.. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపిస్తాయంది. 2011 జనాభా లెక్కల ప్రకారం కర్ణాటక జనాభాలో 12.92 శాతం ముస్లింలున్నారు.

సూరత్ కాంగ్రెస్ అభ్యర్థి మిస్సింగ్!

బీజేపీలో చేరబోతున్నట్టు వార్తలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ బరిలో కాంగ్రెస్ తరుపున నిలబడ్డ అభ్యర్థి నీలేశ్ కుంభని కనిపించట్లేదని స్థానిక మీడియా తెలిపింది. రేపోమాపో ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నట్టు వెల్లడించింది. దీంతో కుంభని ఇంటిముందు చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు ‘ప్రజాద్రోహి’ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సూరత్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కుట్రలకు పాల్పడిందని కాంగ్రెస్ ఆరోపించింది. కాగా, సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ నామినేషన్ తిరస్కరణకు గురవడం, నామినేషన్ల చివరి రోజు మిగతా అభ్యర్థులు ఉపసంహరించుకోవడంతో బీజేపీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఎన్నికను ఏకగ్రీవం చేస్తూ ఎన్నికల కమిషన్ సోమవారం ప్రకటించడం తెలిసిందే.

మేమే నామినేషన్లు విత్‌డ్రా చేయించాం!

సూరత్ ఏకగ్రీవంపై బీజేపీ నేత వినోద్ తావ్డే

ముంబై, ఏప్రిల్ 23: గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ స్థానం ఏకగ్రీవంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే కీలక వ్యాఖ్యలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారితో తమ పార్టీనే సంప్రదింపులు జరిపి, నామినేషన్లు విత్‌డ్రా చేసుకునేలా చేసిందని వెల్లడించారు. మంగళవారం ముంబైలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాజకీయంగా దిగజారిందన్న విమర్శలపై ఆయన స్పందిస్తూ.. ‘స్వతంత్ర అభ్యర్థులను నామినేషన్లు ఉపసంహరించుకోవాలని అభ్యర్థించాం. వారు ఉపసంహరించుకున్నారు. ఇందులో దిగజారిపోవడం ఏముంది?’ అని ఆయన ఎదురు ప్రశ్నించారు. ఇతర అభ్యర్థులనూ బీజేపీ సంప్రదించిందా అని ప్రశ్నించగా.. అవునని ఆయన పేర్కొన్నారు.

2జీ తీర్పును సవరించండి!

స్పెక్ట్రమ్ కేటాయింపుపై సుప్రీంకోర్టును కోరిన కేంద్రప్రభుత్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: వేలం ద్వారా మాత్రమే 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులు జరుగాలంటూ 2012లో ఇచ్చిన తీర్పును సవరించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. స్పెక్ట్రమ్ కేటాయింపు కోసం పాలనాపరమైన ప్రక్రియకు అనుమతి ఇవ్వాలని కోరింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా ధర్మాసనం ముందు సోమవారం ఈ విషయాన్ని ప్రస్తావించిన కేంద్రం తరపు న్యాయవాది, అటార్నీ జనరల్ ఆర్ వెంకట రమణి.. వెంటనే తమ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని కోరారు. అయితే తీర్పు సమీక్ష అభ్యర్థనను ఈమెయిల్ ద్వారా పంపిస్తే తాము పరిశీలిస్తామని జస్టిస్ చంద్రచూడ్ సూచించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో 2జీ స్పెక్ట్రమ్ స్కామ్ ఆరోపణలు దేశంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం పలు కంపెనీలకు కేటాయించిన 2జీ స్పెక్ట్రమ్ లైసెన్స్‌లను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు 2012లో తీర్పు వెలువరించింది. సహజ వనరులను కేటాయింపు లేదా బదిలీ చేసే సమయంలో పారదర్శకంగా వేలం ప్రక్రియను పాటించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేసింది. తద్వారా ఈ వేలం ప్రక్రియలో అర్హులైన వాళ్లు పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది.

శిశు సంరక్షణ సెలవులు మహిళల రాజ్యాంగ హక్కు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ




న్యూఢిల్లీ: పని ప్రదేశాల్లో మహిళల హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ‘శిశు సంరక్షణ సెలవు’ మహిళలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కుగా పేర్కొన్నది. దివ్యాంగుల పిల్లల సంరక్షణలో ఉన్న తల్లికి శిశు సంరక్షణ సెలవు నిరాకరించటాన్ని తీవ్రమైన సమస్యగా పరిగణించింది. శ్రామికశక్తిలో మహిళలకు సమాన భాగస్వామ్యాన్ని కల్పించటంలో రాష్ట్రం నిర్వర్తించే రాజ్యాంగ విధిని ఇది ఉల్లంఘించటమేనని తెలిపింది. సోమవారం ఓ కేసు విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో కేంద్రాన్ని కక్షిదారుగా చేర్చాలని అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భట్‌ను ఆదేశించింది. దివ్యాంగుల పిల్లల సంరక్షణలో ఉన్న తల్లులకు ‘శిశు సంరక్షణ సెలవులు’ మంజూరు చేయటంపై విధానపరమైన నిర్ణయం తీసుకునేందుకుగాను రాష్ట్ర సీఎస్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటుచేయాలని హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఒడిశా ఎవరి వశం?

- 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ స్థానాలకు ఎన్నిక
- 24 ఏండ్లుగా అధికారంలో నవీన్ పట్నాయక్
- మరోసారి గెలుపుపై కన్నేసిన బిజూ జనతాదళ్
- ప్రధాన ప్రతిపక్షంగా రేసులోకి వచ్చిన బీజేపీ
- రెండు పార్టీల స్నేహమే కాంగ్రెస్ ఆయుధం
- ప్రభుత్వ వ్యతిరేకత కలిసొస్తుందని ధీమా
- బీజేడీ – బీజేపీ మధ్యనే ప్రధాన పోటీ: సర్వేలు

భువనేశ్వర్, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల్లో దేశమంతా ఒక పరిస్థితి ఉంటే ఒడిశాలో మాత్రం విభిన్న రాజకీయ పరిస్థితులు ఉన్నాయి. అన్ని రాష్ట్రాల్లో ప్రత్యర్థి పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉంటే ఒడిశాలో మాత్రం స్నేహపూర్వక పోటీ నెలకొన్నది. ఇక్కడ ప్రధానంగా బిజూ జనతాదళ్(బీజేడీ), భారతీయ జనతా పార్టీ(బీజేపీ) పోటీ పడుతున్నాయి. ఈ రెండు పార్టీలు 2009 వరకు పదేండ్ల పాటు మిత్రపక్షాలుగా ఉండేవి. ఆ తర్వాత రెండు పార్టీలు వేరుపడ్డప్పటికీ గత పదేండ్లుగా కేంద్రంలోని మోదీ సర్కారుకు బీజేడీ అనేక అంశాల్లో, బిల్లులపై మద్దతుగా నిలుస్తూ వచ్చింది. ఈ రెండు ఫ్రెండ్లీ పార్టీల మధ్య ఒడిశాలో ప్రధాన పోటీ ఉండగా.. వీటిపై ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతనే ఆయుధంగా కాంగ్రెస్ బరిలో నిలుస్తున్నది. కాగా, ఒడిశాలోని 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ స్థానాలకు మే 13, 20, 25, జూన్ 1న నాలుగు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి.



పట్నాయక్ చరిష్మానే బీజేడీ బలం

24 ఏండ్ల నుంచి ఒడిశా ముఖ్యమంత్రిగా నవీన్ పట్నాయక్ కొనసాగుతున్నారు. మరోసారి అధికారం దక్కించుకుంటామని ఆయన నమ్మకంగా ఉన్నారు. ఒడిశా ప్రజల్లో ఆయనకు మంచి చరిష్మా ఉంది. అయితే, ఈ ఎన్నికల్లో ఆయనకు అనేక సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. బీజేడీలో నవీన్ పట్నాయక్ తప్పించి మరో బలమైన నేత లేకపోవడం, అనేక నియోజకవర్గాల్లో పార్టీలోనే అసమ్మతి కూడా బీజేడీకి మైనస్‌గా కనిపిస్తున్నది.

అధికారంపై కన్నేసిన బీజేపీ

బీజేడీతో స్నేహంగా ఉంటూనే ఒడిశాలో విస్తరించింది బీజేపీ. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా కమలం పార్టీ కొనసాగుతున్నది. 2014 ఎన్నికల్లో 21 లోక్‌సభ స్థానాలకు కేవలం ఒక్క స్థానానికి పరిమితమైన కమలం పార్టీ 2019 నాటికి ఎనిమిది స్థానాలకు ఎగబాకింది. ఈసారి మెజారిటీ లోక్‌సభ స్థానాలతో పాటు రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. నరేంద్ర మోదీ చరిష్మా, హిందుత్వ నినాదం, అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటి అంశాలు తమకు కలిసొస్తాయని బీజేపీ భావిస్తున్నది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 38.4 శాతం ఓట్లతో ఎనిమిది స్థానాలు సాధించినప్పటికీ.. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 32 శాతం ఓట్లతో 23 సీట్లకే పరిమితమైంది.

ప్రభుత్వ వ్యతిరేకతపై కాంగ్రెస్ ఆశలు

ఒకప్పుడు ఒడిశాలో వెలుగు వెలిగిన కాంగ్రెస్ పార్టీ క్రమంగా బలహీనపడుతూ వచ్చింది. 2014లో 26 శాతం ఓట్లు సాధించిన కాంగ్రెస్ 2019 నాటికి 13 శాతానికి పరిమితమైంది. ఇప్పుడు కనీసం రెండో స్థానానికైనా రావాలని భావిస్తున్నది.

రెండు పార్టీల మధ్యే పోరు

ఒడిశాలో బీజేడీ – బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొన్నదని సర్వేలు అంచనా వేస్తున్నాయి. దాదాపుగా అన్ని సర్వేలు కూడా ఈ రెండు పార్టీలు అటుఇటుగా చెరో 40 శాతం ఓట్లు, 10 – 12 సీట్లు గెలుస్తాయని అంచనా వేశాయి.

పేరెంట్స్ పక్కనే పిల్లలకు సీట్లు

ఎయిర్‌లైన్స్‌కు డీజీసీఏ ఆదేశాలు

న్యూఢిల్లీ: విమానాల్లో 12 ఏండ్లలోపు పిల్లలకు వారి తల్లిదండ్రుల పక్కనే సీటు కేటాయించాలని విమానయాన సంస్థలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశాలు జారీచేసింది. పిల్లల సీటింగ్ సమస్యలను పరిష్కరించేలా నిబంధనలు సవరించినట్టు పేర్కొన్నది. మరోవైపు, విమానసంస్థలకు కొన్ని వెసులుబాట్లు కల్పించింది. జీరో బ్యాగేజ్, సీటింగ్ ప్రాధాన్యం, మీల్స్/స్నాక్స్/డ్రింక్స్, సంగీత పరికరాలు తీసుకెళ్లడానికి రుసుములు వసూలు చేయొచ్చని తెలిపింది.

జనరల్ ప్రయాణికులకు సరసమైన ధరకే భోజనం

రైల్వే శాఖ కొత్త సౌకర్యం

న్యూఢిల్లీ: జనరల్ క్లాస్ ప్రయాణికులకు ఆహారం అందించేందుకు రైల్వే శాఖ ఇటీవల ఓ కొత్త సౌకర్యాన్ని ప్రారంభించింది. దీని కింద రైళ్లలోని అన్‌రిజర్వ్‌డ్ బోగీల్లో ప్రయాణించే ప్యాసెంజర్లు సరసమైన ధరల్లో పరిశుభ్రమైన భోజనం, స్నాక్స్ పొందగలరని రైల్వే అధికారి ఒకరు తెలిపారు. మీల్ కౌంటర్లు ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా జనరల్ కోచ్‌లు ఉండే ప్లాట్‌ఫాం ఏరియాలో ఉంటాయన్నారు. ఎకానమీ మీల్ రూ.20, స్నాక్ మీల్ రూ.50 అనే రెండు క్యాటగిరీలుగా ఉంటుందని, నేరుగా కౌంటర్ల వద్ద కొనుగోలు చేయవచ్చన్నారు.

యాడ్ సైజ్‌లోనే క్షమాపణలు ఉన్నాయా?

పతంజలిని ప్రశ్నించిన సుప్రీం

న్యూఢిల్లీ: తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంబంధించిన కేసులో బహిరంగ క్షమాపణలు చెబుతూ దేశవ్యాప్తంగా 67 పత్రికల్లో ప్రకటనలు ఇచ్చామని పతంజలి సంస్థ మంగళవారం సుప్రీం కోర్టుకు తెలిపింది. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. తప్పుదోవ పట్టించే యాడ్‌ల సైజ్ లోనే, అదే ఫాంట్‌లో క్షమాపణల ప్రకటనలు ఇచ్చారా? అని ప్రశ్నించింది. రెండు రోజుల్లో పత్రికల్లో ప్రచురితమైన ప్రకటనలను సమర్పించాలని పతంజలి ఎండీ అచార్య బాలకృష్ణ, సంస్థ సహ వ్యవస్థాపకుడు, యోగాగురు బాబా రాందేవ్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.



కవిత్వం రాసే కెమెరా

న్యూయార్క్, ఏప్రిల్ 23: ఏదైనా చూడచక్కని ప్రదేశాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని చూసినప్పుడు వాటిని వర్ణిస్తూ కవితలు రాస్తుంటారు కవులు. ఇక, నుంచి ఈ పని కూడా కృత్రిమ మేధ(ఏఐ) చేయబోతున్నది. కెలిన్ కరోలిన్ ఝాంగ్, ర్యాన్ మాథెర్ కలిసి ‘పొయెట్రీ కెమెరా’ను తయారుచేశారు. ఈ కెమెరాతో ఫొటో తీసినప్పుడు ఫొటోతో పాటు ఆ చిత్రాన్ని వర్ణిస్తూ రంగులు, మనుషులు, వస్తువులు, వంటివాటిని విశ్లేషించి రాసే ఈ కవిత అప్పటికప్పుడే చిన్న చీటిపై ప్రింట్ అయి బయటకు వస్తుంది.

ఇంటర్నెట్ లేకున్నా ఫైల్స్ పంపించొచ్చు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ఇంటర్నెట్ లేకపోయినా ఫొటోలు, వీడియోలు, ఫైల్స్‌ను ఇతరులకు ఆఫ్‌లైన్‌లోనే షేర్ చేసే సదుపాయాన్ని ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం వాట్సాప్ త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నది. ఈ ఫీచర్ ద్వారా ఇకపై నెట్‌వర్క్‌తో పనిలేకుండా డాక్యుమెంట్లను పంపించొచ్చు. ప్రస్తుతం ఇంటర్నెట్ లేకుండా షేర్ ఇట్ వంటి వాటి ద్వారా ఫొటోలు, వీడియోలను షేర్ చేసుకొంటున్న మాదిరిగానే.. ఆ తరహా సేవల్నే వాట్సాప్ అందుబాటులోకి తేనున్నది. ఈ ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకోవాలంటే యాక్సెస్ అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది.



ఈ టాయిలెట్.. ఒక ల్యాబ్

బీజింగ్, ఏప్రిల్ 23: భవిష్యత్తులో యూరిన్ టెస్టు కోసం ల్యాబ్‌కు వెళ్లి శాంపిల్ ఇవ్వాల్సిన అవసరం పడదేమో! టాయిలెట్‌లో మూత్రవిసర్జన చేయగానే మీ ఆరోగ్యం ఎలా ఉందో పూర్తి రిపోర్ట్ ఇచ్చే అత్యాధునిక టాయిలెట్లు అందుబాటులోకి వచ్చాయి. చైనాలోని బీజింగ్, షాంఘైలో పలు పురుషుల మూత్రశాలల్లో ఓ ప్రైవేటు కంపెనీ ఈ హైటెక్ టాయిలెట్లు అమర్చింది. షాంఘైకు చెందిన క్రిస్టియన్ పీటర్‌సన్–క్లాసెన్ అనే డైరెక్టర్ ‘ఎక్స్’లో ఈ టాయిలెట్లకు సంబంధించిన ఒక పోస్ట్ చేశారు.

బిడ్డను కంటే 61 లక్షలు!

- దక్షిణ కొరియా ప్రభుత్వం యోచన
- దేశంలో పడిపోయిన జననాల రేటు



సియోల్, ఏప్రిల్ 23: దక్షిణ కొరియాలో జనాభా సంక్షోభం నెలకొన్నది. ఈ నేపథ్యంలో దేశంలో జనన రేటును పెంచేందుకు ప్రభుత్వం చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రతి బిడ్డకు జన్మనిచ్చే తల్లిదండ్రులకు ప్రోత్సాహకంగా 59 వేల పౌండ్లు(దాదాపు రూ.61 లక్షలు) నగదు ఇచ్చే విషయాన్ని సర్కార్ పరిశీలిస్తున్నదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమాన్ని అమలు చేసే ముందు ఒక పబ్లిక్ సర్వేను నిర్వహిస్తున్నది. దక్షిణ కొరియాలో జననాల రేటు భారీగా పడిపోయింది. 2023లో ఇది 0.72కు తగ్గింది. అంటే దేశంలోని ప్రతి మహిళ ఒక్క బిడ్డకు కూడా జన్మనివ్వట్లేదు అన్నమాట. 2023లో నమోదైన జాతీయ జనన రేటు దేశ చరిత్రలోనే అత్యంత కనిష్ఠం. దేశంలో జనాభా సంక్షోభానికి అనేక కారణాలు ఉన్నాయి. పెరిగిన జీవన వ్యయం, తగ్గిన జీవన నాణ్యత.. వెరసి దంపతులు వివాహ బంధానికి, పిల్లలను కనేందుకు విముఖత చూపుతున్నారు. జనన రేటును పెంచేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నది.

కాంగ్రెస్, బీజేపీలతో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

- రిజర్వేషన్ల పెంపుపై నోరుమెదపని బీజేపీ
- విభజన హామీలు నెరవేర్చకుండా తెలంగాణకు కేంద్ర సర్కారు ద్రోహం
- ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం
- రెండు పార్టీలకు ఓటేస్తే ఒరిగేది శూన్యం
- లోక్‌సభ నియోజకవర్గంలో టూరిజం ఏర్పాట్లు చేస్తా
- బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత



మహబూబాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): 'బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో ఎస్సీ, ఎస్టీలకు ఒరిగిందేంలేదు.. కేవలం ఓటుబ్యాంకుగానే వాడుకుంటున్నయ్.. గిరిజనుల అభ్యున్నతి ఒక్క బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుంది' అని బీఆర్ఎస్ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాలోత్ కవిత తేల్చి చెప్పారు. 'ఈ ఎన్నికల్లో 400 సీట్లిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ అంటున్నది. దీని వెనుక ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లలో తీవ్ర అన్యాయం చేసే కుట్ర దాగి ఉంది.' అని అనుమానం వ్యక్తం చేశారు. తండాలను పంచాయతీలుగా చేసి, రిజర్వేషన్లు 10శాతానికి పెంచిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని చెప్పిన ఆమె, ఎస్సీ వర్గీకరణ బిల్లుపై బీఆర్ఎస్ ప్రభుత్వం తీర్మానం చేసి పంపితే కేంద్రంలోని బీజేపీ దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని గుర్తుచేశారు. మంగళవారం ఆమె 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ హైదరాబాద్‌లో గిరిజన, ఆదివాసీల భవన్ నిర్మించి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన వ్యక్తి కేసీఆరేనని గుర్తుచేశారు.

'మా పార్టీ గెలిస్తేనే తెలంగాణ అభివృద్ధి' అని కాంగ్రెస్, బీజేపీ అంటున్నాయి. దీనిపై మీరేమంటారు?

ఆ రెండు పార్టీలు చెప్పేవి పచ్చి అబద్ధాలు. దేవుని పేరు చెప్పి బీజేపీ ఓట్లడుగుతున్నది. హామీల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ దేవుని మీద ఒట్టేస్తున్నది. మేము మాత్రం ఆ దేవున్ని, ప్రజలను నమ్ముకొని చేసిన అభివృద్ధి చూసి ఓటెయ్యాలని కోరుతున్నాం. రాష్ట్ర విభజన హామీలను బీజేపీ సర్కారు మరిచిపోయింది. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న గిరిజన యూనివర్సిటీని పదేళ్లుగా నాన్చి ఇటీవల ప్రారంభించారు. ముఖ్యంగా బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని స్వార్థ రాజకీయాల కోసం బీజేపీ పక్కనబెట్టింది. ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని బీసీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఎంపీలమంతా కేంద్రానికి చాలాసార్లు విన్నవించినా కేంద్రం పట్టించుకోలేదు. ఇక ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నది. తెలంగాణ ధ్యాస పట్టని ఆ పార్టీలతో అభివృద్ధి ఎలా సాధ్యమో చెప్పాలి. నా నియోజకవర్గంలోని ప్రజలు కాంగ్రెస్‌ను ఎందుకు ఎన్నుకున్నామా అని బాధపడుతున్నారు. ప్రజల సమస్యలను గాలికొదిలేసి, ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంలోనే సీఎం రేవంత్‌రెడ్డి బిజీగా ఉన్నాడు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వకపోవడమే గాక, రుణమాఫీని గాలికి వదిలేశారు. ఇప్పుడు దేవుళ్లపై ప్రమాణం చేసి ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని హామీ ఇస్తున్నారు. ఏ ఏడాది ఆగస్టు 15 అనేది ఎక్కడా చెప్పడం లేదు.

ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తామని కాంగ్రెస్ అంటున్నది కదా?

మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి పచ్చి దగా చేసిన కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం పోయింది. ఆడబిడ్డల పెళ్లికి ఇస్తామన్న తులం బంగారం ఎటుపోయింది? 18 ఏళ్లు నిండిన మహిళకు రూ.2,500 ఏవీ?, సాగు, తాగునీరు ఏది? రూ. 4వేల పింఛన్ ఎప్పుడు అమలు చేస్తారు?. కాంగ్రెస్‌కు ప్రజాబలం ఉంటే ఈ నెల 19న సీఎం రేవంత్ మానుకోటకు వచ్చిన సందర్భంలో సభకు జనం రాక గంటన్నరపాటు బస్సులో ఎందుకు వేచి ఉన్నాడు? ఇది చాలదా కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత ఉందనేందుకు!

ఎంపీగా మీరు చేసిన అభివృద్ధి ఏంటి. మీరు గెలిస్తే చేయాలనుకుంటున్న పనులేంటి?

ఐదేళ్లలో మానుకోట పార్లమెంట్ పరిధిలో భద్రాచలం, మహబూబాబాద్, నర్సంపేట, ములుగులో మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలు ఏర్పాటు చేశాం. మానుకోటకు ఇంజినీరింగ్ కాలేజీ, మల్యాల ఉద్యాన డిగ్రీ కళాశాల, మహబూబాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ కోసం పెద్ద ఎత్తున నిధులు తెచ్చా. రాయగిరి మీదుగా భద్రాచలం వరకు నేషనల్ హైవే మంజూరైంది. పార్లమెంట్ పరిధిలో నాలుగు ఏకలవ్య పాఠశాలలు నడుస్తున్నాయి. నన్ను ప్రజలు ఆదరించి గెలిపిస్తే భద్రాచలం, బయ్యారం పెద్ద చెరువు, భీముని పాదం, లక్నవరం, పాకాల ప్రాంతాలను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తా.

ఎన్నికల ప్రచారంలో ప్రజల స్పందన ఎలా ఉంది?

గిరిజన ఆడబిడ్డగా నన్ను మానుకోట పార్లమెంట్ పరిధిలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బాగా ఆదరిస్తున్నారు. ఏగ్రామంలోనైనా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తున్నారు. ఎక్కడ ప్రచారానికి వెళ్లినా రైతులు, వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలు చెబుతూ బాధపడుతున్నారు. మానుకోట పార్లమెంట్ పరిధి ఓటర్లకు నేనొక్కటే విజ్ఞప్తి చేస్తున్నా.. నిత్యం మీకు అందుబాటులో ఉండి మీ సమస్యలు పరిష్కరించే అభ్యర్థిని గెలిపించండి. ఓట్లు వచ్చినప్పుడే మీకు కనిపించే వారిని పక్కన పెట్టండి. కరోనా సమయంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఏమైనా సాయం చేశారా? కనీసం బాధితులకు ధైర్యం చెప్పేందుకైనా వచ్చారా ప్రజలు ఆలోచించాలి. తెలంగాణ హక్కులు దక్కాలంటే పార్లమెంట్‌లో తప్పనిసరిగా బీఆర్ఎస్ అభ్యర్థులుండాలి. నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే లోక్‌సభలో ప్రజల తరపున ప్రశ్నించే గొంతుకనవుతా.

రైతులపై కాల్పుల చరిత్ర కాంగ్రెస్‌ది

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్, ఏప్రిల్ 23: ఎన్నికల్లో ఓట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు మాయమాటలు చెబుతున్నాడని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఎర్రజొన్న బకాయిలు అడిగిన రైతులపై కాల్పులు జరిపింది కాంగ్రెస్ కాదా ? అక్రమంగా కేసులు పెట్టిన చరిత్ర మీది కాదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.11 కోట్ల ఎర్రజొన్న బకాయిలు చెల్లించి, రైతులపై కాంగ్రెస్ సర్కారు పెట్టిన కేసులను ఎత్తేసిందని స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో సోమవారం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై చేసిన విమర్శలను ప్రశాంత్‌రెడ్డి తిప్పికొట్టారు. 50 ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు పసుపుబోర్డు ఇవ్వని కాంగ్రెస్.. ఎన్నికల కోసం కల్లబొల్లి మాటలు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. పదేండ్లు అధికారంలో ఉండి పసుపుబోర్డు సాధ్యం కాదని చెప్పిన బీజేపీ కూడా.. రైతుల ఓట్ల కోసం పసుపుబోర్డు ఇచ్చామని ప్రధానమంత్రితో అబద్ధపు ప్రకటన చేయించారని విమర్శించారు. రైతులను అబద్ధాలతో మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు రైతుల ఉసురు తగులుతుందని హెచ్చరించారు. పసుపుబోర్డు కోసం నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిసి వారి నుంచి లేఖలు తెప్పించి, కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది అప్పటి ఎంపీ కవితా కాదా? అని ప్రశ్నించారు. షుగర్ ఫ్యాక్టరీని మూసివేసిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, సెప్టెంబర్ 17న తెరిపిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాయమాటలు చెప్తున్నాడని విమర్శించారు. అబద్ధాల కాంగ్రెస్, బీజేపీలకు పాడికట్టి సిసలైన రైతు పక్షపాతి బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి కేసీఆర్‌కు వెన్నుదన్నుగా నిలువాలని ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఏపీకి నీటి విడుదల పూర్తి

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీటి విడుదల కోటా పూర్తయినట్టు కేఆర్ఎంబీ తెలిపింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌కు ఈఎన్సీకి లేఖ రాసింది. ఈ నెల 12న జరిగిన తీర్మానం ప్రకారం సాగర్ కుడి కాలువ నుంచి నాటికి 5.50 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు పేర్కొన్నది. దీంతో సోమవారమే గేట్లను మూసివేసినట్టు పేర్కొన్నది.



కరీంనగర్‌లో మాట్లాడుతున్న యాదగిరి శేఖర్‌రావు

బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కు ట్రస్మా మద్దతు

ట్రస్మా ముఖ్య సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు

కార్పొరేషన్, ఏప్రిల్ 23: బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ట్రస్మా (తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమానుల అసోసియేషన్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మంగళవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రస్మా ముఖ్య సలహాదారుడు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రైవేట్ టీచర్ల సమస్యలపై వినోద్‌కు సంపూర్ణ అవగాహన ఉన్నదని, పార్లమెంట్‌లో తమ సమస్యలను ప్రస్తావిస్తారనే ఉద్దేశంతో మద్దతు ఇస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం నాయకులు వేణుగౌడ్, రమేశ్, రవీందర్‌రెడ్డి, మధుసూదన్, రవి, రాజుయాదవ్, భరత్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలను కొల్లగొట్టే కుట్ర

- తమిళనాడులో బీజేపీ ఇచ్చంపల్లి రాజకీయ ప్రయోజనాలకే..
- తెలంగాణ బీజేపీ ఎంపీలు నోరెత్తరేమీ ?
- నదుల అనుసంధానాన్ని రద్దు చేయాలి
- కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): నదుల అనుసంధానం పేరిట తెలంగాణకు జీవనాధారమైన గోదావరి జలాలను కొల్లగొట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నదుల అనుసంధానంపై దేశంలో ఎప్పటి నుంచో చర్చ జరుగుతున్నదని, 2014లో ఈ విషయం తెరపైకి వచ్చినప్పుడు గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణ వాటా తేల్చాలని అప్పటి సీఎం కేసీఆర్ కేంద్రానికి లేఖ రాయడంతో మరుగునపడిన విషయాన్ని వినోద్‌కుమార్ గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కేంద్రంలోని బీజేపీ ఈ విషయాన్ని మరోసారి తెరపైకి తెచ్చిందని అన్నారు. తమిళనాడులో రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తున్న బీజేపీ తెలంగాణకు దగా చేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టు ఎత్తును వంద మీటర్లు పెంచాలని నిర్ణయం తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎంవోయూ కుదిరినట్టు స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఈ నెల 15న కేంద్ర జలవనరుల శాఖ ఆదేశాలు కూడా ఇచ్చిందని అన్నారు. 1985లో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల మధ్య ఇచ్చంపల్లిలో మల్టీపర్పస్ ప్రాజెక్టు నిర్మించే ప్రయత్నాన్ని మహారాష్ట్రతోపాటు అప్పటి మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు తీవ్రంగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉత్తరాదిలో గంగా, మహానదుల అనుసంధానంలేకుండా గోదావరి, కావేరీ నదులను అనుసంధానం చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. నదుల అనుసంధానం కేవలం దక్షిణ భారత దేశానికే వర్తింపజేస్తారా? అని వినోద్‌కుమార్ ప్రశ్నించారు. గోదావరి బేసిన్‌లోని సమ్మక్క సాగర్‌కు 47, సీతారామ ప్రాజెక్టుకు 67, తమ్మిడిహెట్టికి 20 టీఎంసీలు ఇవ్వాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ తెరపైకి తెస్తున్న వార్ధా ప్రాజెక్టు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ జలాలను తమిళనాడుకు తరలించే కుట్రలో భాగంగానే ఇచ్చంపల్లిని తెరపైకి తెస్తున్నారని స్పష్టం చేశారు. ఇంత జరుగుతున్నా ఇక్కడి బీజేపీ ఎంపీలు, నాయకులు ఎందుకు నోరుతెరవడం లేదని నిలదీశారు. మేడిగడ్డ వద్ద కాఫర్ డ్యాం నిర్మించాలని బీఆర్ఎస్ చెబుతున్నప్పటికీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. నోరు తెరిస్తే ధర్మం గురించి మాట్లాడే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ గోదావరి జలాల తరలింపును ఏ ధర్మం ప్రకారం సమర్థించుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని నలుగురు బీజేపీ ఎంపీలు ప్రధానితో మాట్లాడి గోదావరి, కావేరి నదుల అనుసంధానాన్ని రద్దు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ వై సునీల్ రావు, మాజీ ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో రూ.20 మీల్స్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : ప్రయాణికుల కోసం రైల్వే శాఖ 'ఎకానమీ మీల్స్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ)తో కలిసి ప్యాకెట్-ఫ్రెండ్లీ క్యాటగిరీ మీల్స్ రూ.20, స్నాక్ మీల్స్ రూ.50కే అందిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా 100కు పైగా రైల్వే స్టేషన్లలో ఎకానమీ మీల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన రైల్వే శాఖ దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో 12 స్టేషన్లలో 23 కౌంటర్ల ద్వారా ఈ భోజనాన్ని అందిస్తున్నదని వెల్లడించారు. వీటిలో హైదరాబాద్, రేణిగుంట, గుంతకల్, తిరుపతి, రాజమండ్రి, వికారాబాద్, పాకాల, ధోన్, నంద్యాల, పూర్ణ స్టేషన్లు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

వేసవికి 100 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల కోసం దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో 100 ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. వివిధ రైల్వేస్టేషన్ల మధ్య నడిచే ఈ రైళ్ల వివరాలను మంగళవారం రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ నెల 28 నుంచి జూలై 30 వరకు ఈ వేసవి ప్రత్యేక రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయని పేర్కొన్నారు. విశాఖపట్నం-చెన్నై, సత్రగాచి-బెంగళూరు, తంబారం-బరౌని, ఎరోడ-ధన్‌బాద్, తంబారం-ధన్‌బాద్ తదితర స్టేషన్ల మధ్య వీటిని నడపనున్నట్టు తెలిపారు.

55.73 కోట్ల ఆస్తి ఈడీకి అటాచ్

పీఎంఎల్ఏ కేసులో వీఎంసీ సిస్టమ్స్ ఆస్తులు జప్తు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): బోగస్ పత్రాలు చూపించి రూ.1,745.45 కోట్లకు పైగా బ్యాంకులను మోసం చేసిన కేసులో హైదరాబాద్‌కు చెందిన వీఎంసీ సిస్టమ్స్ లిమిటెడ్ కేసులో రూ.55.73 కోట్ల స్థిర, చరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. 2018లో బెంగళూరులో నమోదైన ఈ కేసులో వీఎంసీ సిస్టమ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉప్పలపాటి హిమబిందును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు గతంలోనే అరెస్టు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఎస్‌బీఐ, ఆంధ్రా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్‌ల కన్సార్షియం నుంచి వీఎంసీ డైరెక్టర్లు భారీ మొత్తంలో రుణాలు తీసుకున్నారు. ఇందుకోసం నకిలీ పత్రాలు సృష్టించారని బ్యాంకులు సీబీఐకి ఫిర్యాదు చేయడంతో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించి, సోదాలు నిర్వహించారు. రూ.692 కోట్ల మేరకు హిమబిందు డమ్మీ లెటర్ ఆఫ్ క్రెడిట్లు సృష్టించినట్టు ఈడీ గుర్తించింది. తాజాగా ఈడీ జప్తు చేసిన ఆస్తుల్లో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సతీశ్‌కుమార్ నివాసం, రంగారెడ్డిలోని అనాజ్‌పూర్‌లోని వ్యవసాయ భూమి, అసోంలోని క్యాచర్ జిల్లాలో 580.77 ఎకరాల్లో 11.73 కోట్ల విలువైన ప్రాపర్టీస్, టీ ఎస్టేట్ వంటివి ఉన్నాయి.

శివబాలకృష్ణ అక్రమాస్తుల కేసులో ముగ్గురి అరెస్టు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అక్రమాస్తుల కేసులో ఏసీబీ అధికారులు మంగళవారం మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిలో గోదావరి సత్యానారాయణమూర్తి (ఏ3), పెంట భరత్‌కుమార్ (ఏ4), పెంట భరణికుమార్ (ఏ5) అనే వ్యాపారులున్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చి, జ్యుడిషియల్ రిమాండ్ కోరారు. ఈ ముగ్గురి ద్వారానే శివబాలకృష్ణ తతంగాన్ని నడిపినట్టు ఏసీబీ గుర్తించింది. శివబాలకృష్ణ అక్రమంగా సంపాదించిన సొమ్మును వీరికి చేరవేయగా.. వారు తమ పేరు మీద ఆస్తులు కొనుగోలు చేసేవారు. కొన్నాళ్లకు ఆ ఆస్తులను ఎక్కువ ధరకు అమ్మి వచ్చిన డబ్బును వివిధ దారుల్లో శివబాలకృష్ణకు ఇచ్చేవారని సమాచారం. ఈ ముగ్గురూ భారీగా ఆస్తులను కూడబెట్టినట్టు ఏసీబీ విచారణలో తేలింది.ఈ కేసులో ఇప్పటివరకు గుర్తించిన అక్రమాస్తుల మొత్తం విలువ దాదాపు రూ.250 కోట్లు ఉంటుందని సమాచారం.

అన్నారం బరాజ్‌లో టెస్టింగ్ పనులు

- గేట్ల వద్ద ఉన్న ఇసుక తొలగింపునకు గ్రీన్‌సిగ్నల్
- టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ప్రక్రియ ప్రారంభం
- తరలించనున్న 6.20 లక్షల క్యూబిక్ మీటర్ల సాండ్
- ఎన్డీఎస్ఏ కోరినా పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం



అన్నారం బరాజ్‌లో ఎగువన ఉన్న ఇసుకను తరలిస్తున్న దృశ్యం

జయశంకర్ భూపాలపల్లి (నమస్తే తెలంగాణ)/కాళేశ్వరం, ఏప్రిల్ 23: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బరాజ్‌లో టెస్టింగ్ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. బరాజ్‌లోని గేట్ల వద్ద ఉన్న ఇసుకను తీసి టెస్టింగ్ పనులు నిర్వహించాలని గతంలోనే ఎన్డీఎస్ఏ అధికారులను ఆదేశించింది. అయినా ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో అధికారులు వెనుకడుగు వేశారు. ప్రస్తుతం అన్నారం బరాజ్‌లోని గేట్ల వద్ద ఉన్న ఇసుకను తరలించేందుకు ప్రభుత్వం అనుమతించడంతో మంగళవారం నుంచి టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఇసుక తరలింపు పనులు ప్రారంభమయ్యాయి. బరాజ్ పాడవునా మొత్తం 2.54 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నట్టు అధికారులు అంచనా వేయగా, బరాజ్‌లోని గేట్ల వద్ద ఉన్న 6.20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను మాత్రమే తీసేందుకు అనుమతి వచ్చినట్టు అధికారవర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు టీఎస్ఎండీసీ పనులు ప్రారంభించింది. అన్నారం బరాజ్‌లో ఏర్పడిన చిన్న సీపేజ్‌లకు నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ జనవరిలోనే ట్రీట్‌మెంట్ పూర్తి చేసింది. బరాజ్‌లోని 38, 28పాటు 35వ ఔట్‌లెట్స్‌లో కనిపించిన సీపేజ్‌లకు పాలి యూరిత్రిన్ కెమికల్‌తో గ్రౌటింగ్ చేసి అరెస్టు చేశారు. 15 రోజులపాటు అబ్జర్వేషన్ పీరియడ్ సైతం పూర్తి చేశారు. ఇన్వెస్టిగేషన్ సంస్థ పార్సన్ పరిశీలన జరిపి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే బరాజ్ గేట్ల వద్ద భారీగా ఇసుక ఉండటంతో ఇన్వెస్టిగేషన్ పనులకు ఆటంకం ఏర్పడింది. సీడబ్ల్యూసీ, ఎన్డీఎస్ఏ, రాష్ట్ర డ్యాం సేఫ్టీ బృందాలు సైతం అన్నారం బరాజ్‌ను సందర్శించి సీపేజ్‌లను పరిశీలించాయి. బరాజ్‌లో సీపేజ్‌లను అరికట్టడంలో అధికారులు సక్సెస్ అయ్యారని, అయితే సీపేజ్‌లు ఎందుకు ఏర్పడుతున్నాయి, ఇంకా ఏమైనా లోపాలు ఉన్నాయా.. క్రాక్‌లు ఏర్పడ్డాయా.. లోపాలుంటే చేయాల్సిన పనుల గురించి ఇన్వెస్టిగేషన్ చేయాలని ఎన్డీఎస్ఏ బృందం ఇరిగేషన్ అధికారులకు సూచించింది. ఇందుకోసం బరాజ్‌లోని నీటిని పూర్తిగా వదిలేసి, 250 మీటర్ల ఇసుక తీసి టెస్టింగ్ పనులు చేయాలని కోరింది. అధికారులు ప్రభుత్వ అనుమతి తీసుకుని నీటిని వదిలేశారు. ఇప్పుడు ఇసుక తొలిగింపుకు అనుమతి రావడంతో టీఎస్ఎండీసీ పనులను ప్రారంభించింది. ఇసుకను తీసేందుకు నెల రోజులు పట్టే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. ఇసుక పూర్తిగా తీసిన వెంటనే పార్సన్ సంస్థ ఇన్వెస్టిగేషన్ పనులను ప్రారంభించనుంది.

ప్రీమాన్‌సూన్ సర్టిఫికెట్ తప్పనిసరి

డ్యాం సేఫ్టీ యాక్టు ప్రకారం ఇరిగేషన్ అధికారులు ప్రీ మాన్‌సూన్, పోస్టు మాన్‌సూన్ సర్టిఫికెట్లను ప్రభుత్వానికి అందించాల్సి ఉన్నది. బరాజ్ ఎగువ ప్రాంతంలో వర్షాకాలం తరువాత టెస్టింగ్‌లు నిర్వహించి పోస్టు మాన్‌సూన్ సర్టిఫికెట్, వర్షాకాలం ముందు టెస్టింగ్ నిర్వహించి ప్రీమాన్‌సూన్ సర్టిఫికెట్‌లను ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. ఈ సర్టిఫికెట్లను ప్రభుత్వం కేంద్రానికి పంపిస్తుంది.

రామయ్య సేవలో ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా



భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న నామా నాగేశ్వరరావు


భద్రాచలం/దమ్మపేట, ఏప్రిల్ 23: బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు భద్రాచలం సీతారామచంద్ర స్వామిని మంగళవారం దర్శించుకున్నారు. బుధవారం నామినేషన్ వేయనున్న నేపథ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరులకు పూజలు చేసిన ఆయన.. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, తాళ్లూరి జీవన్, మోరంపూడి ప్రసాద్, బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ ఉన్నారు.

అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే..

రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత కేసీఆర్‌దేనని నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలోని మామిడి తోటలో మంగళవారం ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో మోసపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచిస్తున్న కాంగ్రెస్‌కి.. పార్లమెంటు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. భద్రాచలం నుంచి కొవ్వూరు రైల్వే లైన్‌కు సింగరేణితో రాష్ట్ర వాటా నిధులు ఇప్పించి సత్తుపల్లి వరకు రైల్వేలైన్ పూర్తి చేయడమే అభివృద్ధిపై కేసీఆర్‌కున్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు మట్టి, ఇసుక దందాతో దోచుకునే పనిలో బిజీగా ఉన్నారని, యాసంగిలో పండించిన ధాన్యం కొనే దిక్కులేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలను దగా చేయడం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉన్నదని మండిపడ్డారు.

'సన్న' ధాన్యం దళారుల పాలు

- మిల్లర్ల చేతిలో విలవిల్లాడుతున్న అన్నదాతలు
- కనీస మద్దతు ధరకు నోచుకోని కర్షకులు
- వడ్ల కొనుగోలులో సిండికేట్‌గా వ్యాపారులు
- మార్కెట్ ధరలకు పొంతన లేకుండా కొనుగోళ్లు
- చక్రం తిప్పుతున్న రైస్‌మిల్లర్ల సంఘం నేతలు



నిజామాబాద్ నగర శివారులో ధాన్యం ఆరబెడుతున్న రైతులు.. కాంటా వేస్తున్న కూలీలు

నిజామాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అన్నదాతలకు దక్కాల్సిన లాభాలు రైస్‌మిల్లర్ల పాలవుతున్నాయి. సన్నరకం వడ్లు వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయి. మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులకు మద్దతు ధర దక్కకుండా నిలువు దోపిడీ చేస్తున్నారు. సన్నరకం పంట దిగుబడి తక్కువగా ఉండటం, దొడ్డుబియ్యం తినేవారి సంఖ్య తగ్గిపోవడంతో బహిరంగ విపణిలో సన్నబియ్యం ధర ఏటేటా పెరుగుతూనే ఉంది. ఎక్కువగా వానకాలంలో సాగు చేసే సన్నాలను ఈసారి యాసంగిలోనూ సాగుచేసి దిగుబడులు సాధించారు. కరెంట్ కష్టాలు, సాగునీటి ఇక్కట్లను దాటుకుని పండించిన పంటను విక్రయానికి తీసుకొచ్చే సరికి దోపిడీకి గురవుతున్నారు. అన్నదాతలు ఆరుగాలం శ్రమిస్తే వ్యాపారులు అప్పనంగా సొమ్ము చేసుకుంటున్నారు. కనీస మద్దతు ధరకు కొంటున్నట్టు చెప్తున్న కొంత మంది వ్యాపారులు సంచికి 3-5 కిలోల చొప్పున తరుగు తీస్తున్నారు. పంట కోతకు వచ్చిన సమయంలో ధరలు పెరగడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. కానీ విపణిలోకి ధాన్యం రావడంతో ధర పడిపోవడం చర్చనీయాంశమైంది.

మేలు చేసే ఊసే లేదు..

సన్నరకాలు సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో మిల్లర్లు, వ్యాపారుల చేతిలో కర్షకులు అడ్డంగా మోసపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్లోకి జైశ్రీరాం, హెచ్ఎంటీ, బీపీటీ ధాన్యం భారీగా వస్తున్నది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి క్వింటా రూ.2,203, బీ గ్రేడ్ రకానికి క్వింటా రూ.2,183 గా ఉంది. అంతకంటే తక్కువ ధరకు వడ్లను సేకరిస్తే కేంద్ర చట్టాల ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కానీ క్షేత్ర స్థాయిలో తనిఖీలు, పరిశీలన అన్నదే లేకుండా పోయింది. బహిరంగ మార్కెట్లో ఎవరు కొంటున్నారు.. ఎంతకు కొంటున్నారో కూడా సర్కారు పట్టించుకోవడం లేదు. సర్కారు నిర్లక్ష్యం ప్రైవేటు వ్యాపారులకు మేలు చేస్తున్నది. పచ్చి ధాన్యం పేరుతో రూ.2 వేలలోపే సన్న వడ్లను వ్యాపారులు సేకరిస్తున్నారు.

కలగలిసిన వడ్లు

సన్నరకం సాగుకు ఎక్కువ పెట్టుబడి, శ్రమ అవసరం. అలాగే, దిగుబడి తక్కువగా వస్తుండడంతో రైతులకు నష్టం కలుగుతుంది. ఈ ఏడాది అకాల వానలతో పంటలకు తెగుళ్లు సోకి మరింత దిగుబడులు తగ్గాయి. వ్యాపారుల మాయాజాలం వల్ల సన్న, దొడ్డు రకాలకు తేడా లేకుండా పోయింది. కేసీఆర్ హయాంలో సన్నాలను పండించిన రైతులకు ఒకానొక దశలో ప్రత్యేక ధరలతో లాభం చేకూర్చారు. ప్రైవేటు వారిని రంగంలోకి దించి అధిక ధరలతో సక్రమంగా కొనుగోళ్లు జరిగేలా చూశారు. ఇప్పుడు క్షేత్ర స్థాయిలో పరిస్థితులు తారుమారయ్యాయి. దొడ్డు, సన్న రకాలకు ఒకే ధరను పెట్టి ప్రైవేటు వ్యాపారులు డబుల్ సంపాదనను ఆర్జిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పెద్దల అండతో తెలంగాణ వ్యాప్తంగా సన్న బియ్యం ధరలు అమాంతరం పెంచేశారు. జైశ్రీరాం క్వింటా ధర రూ.7,500లకు చేర్చారు. భారీ నిల్వలను పెట్టుకున్న బడా వ్యాపారులైతే రూ.కోట్లు ఆర్జించారు. నిజామాబాద్‌లో పేరొందిన మిల్లర్లు రంగంలోకి దిగి సన్న రకం ధాన్యానికి రూ.2వేల నుంచి రూ.2200లోపే కొంటున్నారు. మర ఆడించిన బియ్యాన్ని క్వింటాకు రూ.7500లకు రిటైల్‌గా అమ్మేస్తూ సామాన్యులపైనా ఎడతెగని భారాన్ని మోపుతున్నారు. ఈ దందాను నియంత్రించాల్సిన ప్రభుత్వం మాత్రం చేతులు ఎత్తేసి సినిమా చూస్తోందంటూ రైతులు మండిపడుతున్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవిలో ఉన్న నిజామాబాద్‌కు చెందిన ఓ నాయకుడైతే కాంగ్రెస్ పెద్దలతో చేతులు కలిపి నిజామాబాద్ మిల్లర్లకు అండగా నిలుస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ఎక్సైజ్ అధికారులను ఎందుకు బదిలీ చేయలేదు?

ఈసీని వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా నిర్వహించే బదిలీల్లో ఎక్సైజ్ అధికారులకు మినహాయింపు ఎందుకు ఇచ్చారో వివరణ ఇవ్వాలని హైకోర్టు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఎక్సైజ్ అధికారులను ప్రస్తుతమున్న జిల్లాల్లోనే కొనసాగించాలన్న ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యానికి నంబర్‌ను కేటాయించేందుకు హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఒకే జిల్లాలో మూడేండ్లకు పైగా పనిచేస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులను బదిలీ చేసినప్పటికీ ఎక్సైజ్ అధికారులను మాత్రం బదిలీ చేయలేదని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. ఎక్సైజ్ అధికారులను కూడా బదిలీ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఎన్నికల మార్గదర్శకాల ప్రకారమే బదిలీలు జరిగాయని కేంద్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది చెప్పారు.



పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీతోపాటు వేదికపై కూర్చున్న విద్యుత్తు ఉద్యోగి తులసి(ఫైల్)

విద్యుత్తు ఉద్యోగిపై వేటు

- కాంగ్రెస్ ప్రచారంలో పాల్గొన్నందుకు సస్పెన్షన్
- ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని చర్యలు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి అధికారుల స్పందన

నమస్తే ఎఫెక్ట్

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ అమలులో ఉండగా కాంగ్రెస్ పార్టీ ప్రచార సభలో పాల్గొన్న విద్యుత్తు ఉద్యోగి తులసిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధి గోదావరిఖనిలోని బృందావన్ గార్డెన్‌లో ఐఎన్‌టీయూసీ మహాసభ, పెద్దపల్లి పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇందులో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ, రామగుండం ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఇతర ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు. కాగా.. కరీంనగర్ ఎన్‌పీడీసీఎల్ ఎంఆర్‌టీ డివిజన్‌లో టీఆర్‌ఈ సెక్షన్‌లో వైడర్ గ్రేడ్(టెస్టర్)-2గా ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న తులసి ఈ వేదికను పంచుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ప్రచారం చేశారు. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ'లో 'కాంగ్రెస్ వేదికపై విద్యుత్తు ఉద్యోగి' శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఈ కథనాన్ని సుమోటోగా స్వీకరించిన విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు ఉద్యోగి తులసిపై చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కరీంనగర్ ఎంఆర్‌టీ డీఈ కాళీదాస్ తులసిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘించిన కారణంగానే ప్రాథమిక చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్టుగా పేర్కొన్నారు.

- **వేసవి తాపం.. కరెంటు కోతల శాపం**



ఓవైపు భానుడు సెగలు కక్కుతుంటే.. వేసవి తాపంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరోవైపు కరెంటు కోతల కారణంగా చీకట్లలోనే కాలం గడుపుతున్నారు. భైంసా పట్టణంతోపాటు గ్రామాల్లో గాలిదుమారానికి చెట్టు ఊగినా.. చిన్నపాటి చినుకు పడినా గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోతున్నది. శనివారం సాయంత్రం కురిసిన చిన్నపాటి గాలివానకు మండల వ్యాప్తంగా రాత్రంతా విద్యుత్తు సరఫరా నిలిపేశారు. సోమవారం నిలిచిపోయిన విద్యుత్తు సరఫరా మంగళవారం సాయంత్రం వరకూ పత్తాలేదు. ఇంకా కొన్ని గ్రామాల్లో పునరుద్ధరణ పనులు బుధవారం కూడా కొనసాగేలా ఉన్నాయి. వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. -భైంసా టౌన్

రుణమాఫీ చేస్తాం.. బీఆర్‌ఎస్‌ను రద్దు చేస్తారా?

- మాజీ మంత్రి హరీశ్‌కు రేవంత్ సవాల్
- పంద్రాగస్టు లోపు రుణమాఫీ
- రాబోయే పంటకు రూ.500 బోనస్
- జోగుళాంబ సాక్షిగా మాట ఇస్తున్నా
- నాగర్‌కర్నూల్‌లో సీఎం రేవంత్



నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/కోస్గి ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : రైతులకు పంద్రాగస్టులోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, వచ్చే సీజన్‌లో క్వింటాల్ ధాన్యానికి రూ.500 అదనంగా బోనస్ ఇచ్చి కొనుగోళ్లు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థులు వంశీచంద్‌రెడ్డి, మల్లు రవికి మద్దతుగా ఆయన మంగళవారం జనజాతర సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ చేయకుంటే రేవంత్ సీఎం పదవికి రాజీనామా చేస్తడా అని హరీశ్‌రావు సవాల్ చేశారని గుర్తుచేశారు. 'నేను మామా అల్లుళ్లు హరీశ్‌రావు, కేసీఆర్‌లకు సవాల్ విసురుతున్నా.. పంద్రాగస్టులోపు ఆరు నూరైనా, జోగుళాంబ సాక్షిగా మాట ఇస్తున్నా.. రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతా. ఆనాడు నువ్వు, నీ మామ బీఆర్‌ఎస్ పార్టీని రద్దు చేస్తారా? నా రాజీనామా కాదు, మీ పార్టీని రద్దు చేసుకోవడానికి సిద్ధంగా ఉండండి' అని వ్యాఖ్యానించారు. రైతులు ఆశీర్వదిస్తేనే కాంగ్రెస్, ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, రైతుల రుణం తీర్చుకోకుంటే తన జీవితమే వేస్ట్ అని అన్నారు. రాబోయే పంటకు 500 రూపాయల బోనస్ ఇస్తాం. అని చెప్పారు. వరి వేసుకుంటే ఉరే అని చెప్పిన కేసీఆర్ తాను మాత్రం ఫాంహౌస్‌లో వరి వేసుకున్నాడని ఆరోపించారు.

మోదీ చేతిలో కత్తి.. అరుణ

బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ప్రధాని మోదీ చేతిలో కత్తిలా మారి పాలమూరు బిడ్డనైన తనను పొడుస్తున్నారని రేవంత్ ధ్వజమెత్తారు. పాలమూరు అభివృద్ధిని ఆమె అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల్‌లో డిపాజిట్ గల్లంతైన బీజేపీ తమకు పోటీయే కాదని చెప్పారు. రాష్ట్రానికి, దేశానికి ఆదర్శంగా నిలిచిన బూర్గుల రామకృష్ణారావు, మల్లు అనంతరాములు, మహేంద్రనాథ్, జైపాల్‌రెడ్డి వంటి నేతలు పాలమూరు బిడ్డలన్నారు. పాలమూరు బిడ్డగా తనకు ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చిందని చెప్పారు. జిల్లాలోని నాయకులు పగోడి చేతిలో చురకత్తులై లేకలేక 70 ఏండ్లకు ఒక్క అవకాశం వస్తే శత్రువులకు సహకరించేలా, దొంగలకు సద్ది మూటలు కట్టేలా తనకు వ్యతిరేకంగా తయారయ్యారని విమర్శించారు. పాలమూరులో వలసలు ఆగలేదు, కరువు పోలేదు, నీళ్లు పారలేదు, కల్వకుర్తి అట్లనే ఉంది, ఆర్డీఎస్ ఆగమైంది అని పేర్కొన్నారు. మళ్లీ ఇలాంటి అవకాశం వస్తదోరాదో, రెండు టీఎంసీలతో పాలమూరు పూర్తి చేసి, జిల్లాకు నీళ్లు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదని చెప్పారు.



'లంచం ఇవ్వకండి.. మాకు సమాచారం ఇవ్వండి'

ఏసీబీ డీజీ సీవీ ఆనంద్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వాధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే.. వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీ సీవీ ఆనంద్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయంలో ఏసీబీ డైరెక్టర్ వీఆర్ శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి 'లంచం ఇవ్వకండి.. మాకు సమాచారం ఇవ్వండి' అనే పోస్టర్‌ను సీవీ ఆనంద్ ఆవిష్కరించారు. ఇందుకు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఏ సమయంలోనైనా కాల్, dg_acb@ telangana. gov.inకి మెయిల్ చేయాలని సూచించారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ కొనసాగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ):ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై బుధవారం కూడా విచారణ జరగనున్నది. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవిత తనకు బెయిల్ ఇవ్వాలంటూ సీబీఐ ప్రత్యేక కోర్టును కోరిన విషయం తెల్సిందే. కవిత పిటిషన్‌పై విచారణ మంగళవారం కొనసాగింది. కవిత తరపు న్యాయవాది రాణా వాదనలు వినిపించారు. కస్టడీని పొడిగించాలని ఈడీ తరపు న్యాయవాది కోరారు. ఈడీ అభ్యర్థన మేరకు మే 7వ తేదీ వరకు కవిత కస్టడీని పొడిగించారు. కవిత కస్టడీ పొడిగింపుపై సీబీఐ, ఈడీలు న్యాయస్థానంలో అప్లికేషన్ దాఖలు చేశాయి. కేసు దర్యాప్తు పురోగతి వివరాలను కోర్టుకు అందజేశారు. 60 రోజుల్లో కవిత అరెస్టుపై చార్జిషీటు సమర్పిస్తామని ఈడీ తెలిపింది. విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. బుధవారం మధ్యాహ్నం రెండుగంటలకు వాదనలు వింటామని చెప్పింది.

అప్పులు తీర్చేమార్గం లేక..

- దంపతుల ఆత్మహత్యాయత్నం
- భార్య క్షేమం.. భర్త మృతి
- పెద్దపల్లి జిల్లా పారుపల్లిలో విషాదం



మధుసూదన్ (ఫైల్)

ముత్తారం, ఏప్రిల్ 23: చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపం చెందిన దంపతులు బలవన్మరణానికి యత్నించారు. ఈ ఘటనలో.. భార్య ప్రాణాపాయం నుంచి బయటపడగా.. భర్త మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మంగళవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. పారుపల్లికి చెందిన పూసల సంధ్య-మధుసూదన్(43) దంపతులు. వారికి ఉన్న నాలుగెకరాల్లో వ్యవసాయం చేసేవారు. వ్యవసాయ భూమి వద్ద నీటి కొరత ఉండటంతో నెల క్రితం రూ.2 లక్షల అప్పు చేసి బోరు వేశారు. ఇతర వ్యవసాయ పెట్టుబడుల కోసం రూ.5 లక్షల వరకు అప్పు అయ్యింది. 2022లో కూతురు పెండ్లి కోసం మరో రూ.5 లక్షలు అప్పు తెచ్చారు. మొత్తం రూ.12 లక్షల అప్పు అయ్యింది. దీంతో చేసిన అప్పు తీర్చేమార్గం లేక ఆ దంపతులిద్దరూ ఈ నెల 12న పురుగుల మందు తాగారు. స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. సంధ్య కోలుకొని ఇంటికి రాగా.. మధుసూదన్ అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మధుసూదన్ కుమారుడు ఆకాశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు.

ప్రవేశ పరీక్షలకు వేళాయే

- మే 6న ఈసెట్, 7 నుంచి ఎప్‌సెట్
- ఈ ఏడాది ఎప్‌సెట్‌కు భారీగా దరఖాస్తులు



హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : 2024 -25 విద్యాసంవత్సరంలో పలు ప్రవేశ పరీక్షలకు వేళయింది. మే, జూన్ మాసాల్లో ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు సిద్ధమయ్యారు. మే 6 టీఎస్ ఈసెట్‌తో ప్రారంభమై... జూన్ 6 నుంచి 9 వరకు నిర్వహించే పీజీఈసెట్‌తో పరీక్షలు ముగుస్తాయి. కీలకమైన ఎప్‌సెట్ ఎగ్జామ్ మే 7 నుంచి 11 వరకు జరుగనున్నది. ఇంజినీరింగ్ మొదలుకొని.. బీఈడీ, లా, ఎంబీఏ, ఎంసీఏ సహా అన్ని రకాల కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెలల్లోనే పరీక్షలు జరుగుతాయి. పరీక్షలను సజావుగా నిర్వహించి, ఆ తర్వాత ఫలితాలు ప్రకటించి జూన్, జూలై మాసాల్లో సీట్ల భర్తీ ప్రక్రియ చేపడుతారు. ఈ ఏడాది ఎప్‌సెట్‌కు భారీగా దరఖాస్తులొచ్చాయి. ప్రత్యేకించి ఇంజినీరింగ్ విభాగానికి 50 వేలకు పైగా దరఖాస్తులొచ్చాయి. నిరుడు ఇంజినీరింగ్‌కు 2.05,351 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 2,54,051 దరఖాస్తులు నమోదయ్యాయి. ఇక ఫార్మసీ విభాగానికి నిరుడు 1,15,332 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 99, 831 దరఖాస్తులొచ్చాయి.

సకాలంలో తరగతులు

గతంలోనే ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లు విడుదల కాగా, దరఖాస్తుల స్వీకరణ ముగింపు దశకు చేరింది. పరీక్షలకు వారం, పది రోజుల ముందు నుంచి హాల్‌టికెట్లు జారీచేసి, షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారు. కరోనాతో గతంలో ప్రవేశ పరీక్షలు ఆలస్యంగా జరుగగా, సీట్ల భర్తీ ఆలస్యమయింది. దీని ప్రభావం సెమిస్టర్ పరీక్షలపై పడి విద్యాసంవత్సరాన్ని పొడిగించాల్సిన పరిస్థితులొచ్చాయి. కానిప్పుడు ముందుగానే షెడ్యూళ్లను ప్రకటించడంతో ఈ ఏడాది తరగతులు సకాలంలో ప్రారంభయ్యే అవకాశాలున్నాయి. అంతేకాకుండా కోర్సు లు పూర్తిచేసిన వారికి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు అనువైన సమయంలోనే సర్టిఫికెట్లు చేతికందనున్నాయి.

వివిధ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు..

ప్రవేశ పరీక్ష	దరఖాస్తులు	తుది గడువు	పరీక్షాతేదీలు
టీఎస్ ఈసెట్	24,116	28-4-24	మే 6
ఎప్‌సెట్ (బైపీసీ)	99,831	1-5-24	మే 7,8
(ఎంపీసీ)	2,54,051	1-5-24	మే 9,10,11
ఎడ్‌సెట్	17,666	13-5-24	మే 23
ఐసెట్	41,801	27-5-24	జూన్ 5,6
లాసెట్	38,161	25-05-24	జూన్ 3
పీజీఈసెట్	7,141	25-5-24	జూన్ 6 నుంచి 9

వ్యవసాయ రోబోలు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): సాగు ఖర్చులు పెరుగుతుండటం, వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గిపోతుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యలకు తెర దించేందుకు ఇక్రిశాట్ ఇంక్యుబేషన్ సెంటర్‌లోని ఎక్స్ మెషీన్ స్టార్టప్ నడుం బిగించింది. వ్యవసాయ ఉపకరణాలను తయారు చేయడంలో జాతీయ స్థాయి గుర్తింపు పొందిన ఈ సంస్థ.. పొలాల్లో పనులు చేయగలిగే ఎక్స్100, ఎక్స్100 మ్యాక్స్, ఎక్స్ 100 అల్ట్రా పేరుతో మూడు రకాల రోబోలను అందుబాటులోకి తెచ్చింది. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీతో పనిచేసే ఈ రోబోలు పొలాల్లో విత్తనాలు నాటడం మొదలుకొని పంట నూర్పిడి దాకా సేవలందించగలవు. వాణిజ్య పంటలతో పాటు ఉద్యాన పంటల సాగుకు అవసరమైన పనులను చేయగలిగేలా రూపొందించిన ఈ రోబోలను ఇటీవల షార్క్ ట్యాంక్ వేదికపై ప్రదర్శించినట్టు ఇక్రిశాట్ వర్గాలు తెలిపాయి.

చిత్రం



కృష్ణ జయంతి రోజున అనౌన్స్‌మెంట్?

సినిమా తీయడంలోనే కాదు, దాన్ని ప్రమోట్ చెయ్యడంలో కూడా దర్శకుడు రాజమౌళిది భిన్నమైన శైలి. తన సినిమా అనౌన్స్‌మెంట్ వేడుకను కూడా అట్టహాసంగా నిర్వహిస్తారాయన. కొన్ని సినిమాల విషయంలో మీడియాకు ఏకంగా కథకూడా లీక్ చేసేసిన సందర్భాలున్నాయి. చెప్పి కొట్టడం ఆయన స్టైల్. ప్రస్తుతం మహేశ్‌తో ఆయన చేయనున్న సినిమాకు చెందిన ప్రకటన కోసం సినీ ప్రేమికులందరూ ఎదురుచూస్తున్నారంటే కారణం అదే. ప్రతిష్టాత్మకమైన వరల్డ్ యాక్షన్ అడ్వెంచర్ మూవీగా తెరకెక్కనున్న ఈ సినిమా కోసం మహేశ్ ఇప్పటికే మేకోవర్ అయ్యే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో వేగంగా ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇక ఈ సినిమా అనౌన్స్‌మెంట్ వేడుకను మే 31న, సూపర్‌స్టార్ కృష్ణ జయంతి రోజున ఘనంగా నిర్వహించడానికి నిర్మాత కేఎల్ నారాయణ సన్నాహాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా జక్కన్న టీమ్ సిద్ధం చేస్తున్నారని తెలిసింది. ఎం.ఎం.కీరవాణి ఈ చిత్రానికి స్వరాలను సమకూరుస్తున్న విషయం తెలిసిందే. మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు తెలియాల్సివుంది.



ఎన్టీఆర్‌తో ఆటపాట

గత కొంతకాలంగా పూజాహెగ్డేకు అదృష్టం కలిసి రావట్లేదు. ఇటు తెలుగులో అటు బాలీవుడ్‌లో సైతం ఈ భామ చేసిన సినిమాలు ఆశించిన విజయాల్ని సాధించలేకపోయాయి. దాంతో ప్రస్తుతం ఈ అమ్మడు సినిమాలకు కాస్త విరామాన్ని ప్రకటించింది. కొంత టైమ్ తీసుకున్నా పర్లేదు కానీ మంచి కథాంశాలను ఎంచుకోవాలనే ఆలోచనలో ఉందట ఈ మంగళూరు సోయగం. తాజా సమాచారం ప్రకారం ఎన్టీఆర్ 'దేవర' చిత్రంలో పూజాహెగ్డే ప్రత్యేక గీతంలో నర్తించనున్నట్లు తెలిసింది. ద్వితీయార్ధంలో వచ్చే ఈ ఐటెంసాంగ్‌ను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారట దర్శకుడు కొరటాల శివ. మాస్ మెచ్చేలా సంగీత దర్శకుడు అనిరుథ్ ఈ పాట కోసం మాస్ బీట్‌తో మంచి ట్యూన్‌ను సిద్ధం చేశారని అంటున్నారు. ఐటెంసాంగ్ కోసం పలువురు నాయికల పేర్లను పరిశీలించిన దర్శకుడు కొరటాల శివ, చివరకు పూజా హెగ్డేను ఖరారు చేశారని అంటున్నారు. ప్రస్తుతం 'దేవర' చిత్రీకరణ దశలో ఉంది. దసరా కానుకగా అక్టోబర్ 10న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకానుంది.



సందీప్‌కిషన్ సినిమా మొదలైంది

'ఊరుపేరు భైరవకోన' చిత్రంతో హిట్ ట్రాక్ ఎక్కేశాడు యువహీరో సందీప్‌కిషన్. ఈ నేపథ్యంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేష్ దండా ఆయనతో ఓ చిత్రం నిర్మిస్తున్నారు. హిట్ చిత్రాల దర్శకుడు త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం మంగళవారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత విజయ్ కనకమేడల కెమెరా స్విచాన్ చేయగా, అగ్ర నిర్మాత దిల్‌రాజు క్లాప్ ఇచ్చారు. మరో ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. తదనంతరం చిత్ర యూనిట్‌కు వారందరూ శుభాకాంక్షలు అందించారు. తమ సంస్థలో నిర్మించిన సామజవరగమన, ఊరుపేరు భైరవకోన చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయని, ఈ సినిమాతో హ్యాట్రిక్ కొట్టబోతున్నామని నిర్మాత రాజేశ్ దండా నమ్మకం వెలిబుచ్చారు. సందీప్‌కిషన్ 30వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు రచన: ప్రసన్నకుమార్ బెజవాడ, కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: లియోన్ జేమ్స్, ఆర్ట్స్: బ్రహ్మకడలి.

మే 4న దర్శకుల పండుగ..

ప్రభాస్ 35 లక్షల విరాళం



అగ్ర నటుడు ప్రభాస్ అవసరమైనప్పుడల్లా తన పెద్ద మనసును చాటుకుంటూనే ఉన్నారు. పెదనాన్న కృష్ణంరాజు మాదిరిగానే, ప్రభాస్ చేయి కూడా పెద్దదని పరిశ్రమలో టాక్ కూడా ఉంది. రీసెంట్‌గా మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు ప్రభాస్. మే 4న విఖ్యాత దర్శకుడు స్వర్గీయ దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని, హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ 'డైరెక్టర్స్ డే సెలబ్రేషన్స్' జరుపనుంది. ఈ సందర్భంగా అసోసియేషన్‌కు ప్రభాస్ 35 లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించారు. సోమవారం జరిగిన తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన 'డైరెక్టర్స్ డే ఈవెంట్' కర్టన్‌రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు మారుతి ఈ విషయాన్ని సంఘ సభ్యులకు వెల్లడించారు. సంఘ సభ్యులు హర్షం వెలిబుచ్చుతూ, దర్శకుల సంఘం సంక్షేమ నిధి కోసం ఆ డబ్బును వెచ్చించనున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంలోనే 'డైరెక్టర్స్ డే సెలబ్రేషన్స్' ఈవెంట్ వివరాలను సంఘం సభ్యులు వివరించారు. ప్రతిభా పురస్కారాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ వేడుక వైభవంగా జరుగుతుందని, మదర్స్‌డే, ఫాదర్స్‌డే ఉన్నట్లే డైరెక్టర్స్ డే కూడా చిరస్థాయిగా నిలవాలనేది తమ ఆకాంక్ష అని, ఇప్పటివరకూ చిన్నగా జరిగిన ఈ కార్యక్రమం ఈసారి ఎల్బీ స్టేడియంలో ఘనంగా జరుగనుందని దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సాయిరాజేశ్, రేలంగి నరసింహారావు, వి.విజయేంద్రప్రసాద్, రాంప్రసాద్, వీఎన్ ఆదిత్య, సముద్ర, ఎన్.శంకర్, హరీశ్‌శంకర్, మారుతి, వశిష్ఠ, అనుదీప్ కేవీ తదితరులు మాట్లాడారు. తదనంతరం తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ వెబ్‌సైట్‌ను విజయేంద్రప్రసాద్, హరీశ్‌శంకర్ లాంచ్ చేయగా, 'డైరెక్టర్స్ డే' లోగోను రేలంగి నరసింహారావు ఆవిష్కరించారు.

పడమటి కొండల్లో ప్రేమకథ



అనురోప్ కటారి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పడమటి కొండల్లో'. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యువ హీరో సాయిదుర్గతేజ్ సోషల్‌మీడియా వేదికగా ఆవిష్కరించారు. ఈ చిత్రానికి నరేశ్ పెంట దర్శకుడు. జయకృష్ణ దురుగడ్డ నిర్మాత. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'సరికొత్త అనుభూతిని ప్రేక్షకులకు పంచే సినిమా ఇది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో గొప్ప ప్రేమకథ కూడా ఉంటుంది. ఆడియన్స్‌కి ఈ సినిమా ఓ విజువల్ ఫీస్ట్. ఈ సినిమాకు చెందిన మరిన్ని విషయాలు త్వరలో ప్రకటిస్తాం' అని తెలిపారు. యశస్వి శ్రీనివాస్, శ్రావ్య రెడ్డి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కన్నన్ మునిసామి, మాటలు: ఆర్.రాము, దర్శకత్వం, సంగీతం: నరేశ్ పెంట.



మహిళా సమస్యలపై పోరాటం

సుమన్‌తేజ్, గరీమ చౌహాన్ జంటగా నటిస్తున్న చిత్రం 'సీతా కల్యాణ వైభోగమే'. సతీష్ పరమవేద దర్శకత్వంలో యుగంధర్ నిర్మిస్తున్నారు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఆడపిల్ల ఉండే ప్రతీ కుటుంబానికి ఈ సినిమా నచ్చుతుంది. చక్కటి ప్రేమకథతో పాటు నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను చూపించాం. భావోద్వేగభరితంగా సాగుతూ ప్రేక్షకులకు మంచి సందేశాన్నందిస్తుంది' అన్నారు. కథానుగుణంగా మంచి పాటలు కుదిరాయని, యువతరంలో పాటు కుటుంబ ప్రేక్షకులకు కూడా నచ్చే అన్ని అంశాలుంటాయని నిర్మాత తెలిపారు. పాటలు మెలోడీ ప్రధానంగా అందరికీ నచ్చుతాయని సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ అన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, నిర్మాత విజయ్ కనకమేడల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

నాడు అభయహస్తం.. నేడు భస్మాసుర హస్తం

- అప్పుడు డిసెంబర్ 9 అన్నడు...
- ఇప్పుడు ఆగస్టు 15 అంటున్నడు
- రుణమాఫీపై రేవంత్ మరోసారి మోసం
- రెండోసారి మోసపోతే మనదే తప్పు
- బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు ప్రయోజనం
- లోక్‌సభ ఎన్నికల్లో గులాబీజెండా ఎగరాలి
- పదేండ్లలో బీజేపీ ప్రజలకు ఏమీ చేయలేదు
- బీజేపీని ఎదుర్కొనే ఏకైక పార్టీ బీఆర్ఎస్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



అలంపూర్ చౌరస్తాలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు తదితరులు

వరంగల్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ గద్వాల/అలంపూర్: అసెంబ్లీ ఎన్నికల ముందు అభయహస్తం పేరిట హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. నాలుగు నెలలుగా వాటిని నెరవేర్చకుండా భస్మాసుర హస్తం చూపెడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల్లోనూ మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని చెప్పారు. రైతుల రుణమాఫీ హామీని పక్కనబెట్టిన రేవంత్‌రెడ్డి.. ఏ ఊరికి పోతే అక్కడి దేవుడి మీద ప్రమాణం చేసి లోక్‌సభ ఎన్నికల్లోనూ మోసం చేస్తున్నారని చెప్పారు. ఒకసారి మోస పోతే మోసగాడి తప్పు అని, రెండుసార్లు మోసపోతే తప్పు మనదే అవుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు బీఆర్ఎస్‌కు వస్తేనే కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ మంగళవారం వరంగల్ లోక్‌సభ పరిధిలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, గద్వాల అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాల్లో కేటీఆర్ ప్రసంగించారు.

రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం

'రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు తులంబంగారం అన్నాడు,ఆడపడుచులకు నెలకు రూ.2500, స్కూటీ బైక్‌లు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అన్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 150 రోజులవుతున్నది. రాష్ట్రంలో ఎవ్వరికైనా తులం బంగారం వచ్చిందా? ఆసరా పెన్షను రూ.4 వేలు పెరిగిందా? ఆటోడ్రైవర్లకు నెలకు వెయ్యి, వ్యవసాయ కూలీలకు వెయ్యి ఇచ్చాడా? అని నిలదీశారు. మోసపు మాటలతో అధికారంలోకి వచ్చాడు. మోసం చేసే వాళ్లతో అప్రమత్తంగా ఉందాం. బీఆర్ఎస్ గెలిస్తేనే కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారెంటీలు అమలవుతాయి. నిజంగా కేసీఆర్ మళ్లీ రావాలంటే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను 12 సీట్లలో గెలిపించాలి. ఇదే జరిగితే ఏడాదిలోపు కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారు' అని చెప్పారు. బీజేపీని ఎదుర్కొనేది కేసీఆర్ ఒక్కరేనని కేటీఆర్ అన్నారు. కుట్ర చేసి బిడ్డను అరెస్టు చేసినా కేసీఆర్ బీజేపీపై పోరాటం ఆపడంలేదని చెప్పారు. రాష్ట్రానికి బీజేపీ ఒక్క మంచి పని చేయలేదని వివరించారు. 'తెలంగాణపై సవతితల్లి ప్రేమ చూపిస్తున్న బీజేపీకి ఓట్లు వేయవద్దు. మనం రాముడికి మొక్కుదాం. తెలంగాణకు ఒక్కటీ ఇయ్యని బీజేపీని ఓట్లతో తొక్కుదాం' అని పిలుపునిచ్చారు. అన్ని అవకాశాలు ఇచ్చినా బీఆర్ఎస్‌ను మోసం చేసిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్ విశ్వాసఘాతకులు అని కేటీఆర్ మండిపడ్డారు. 'సుధీర్‌కుమార్ కేసీఆర్ వెన్నంటి ఉన్న నాయకుడు. అందరం కష్టపడి పని చేస్తే సుధీర్‌కుమార్ గెలుపు సాధ్యమవుతుంది. వరంగల్ మొదటి నుంచి బీఆర్ఎస్ గడ్డ. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందాం' అని కేటీఆర్ అన్నారు. సమావేశాల్లో వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

ఏకాలంలో రైతులకు రుణమాఫీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలోని ఏజీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుగా నాగర్‌కర్నూల్ సెగ్మెంట్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూస్తారో.. పూటకో అబద్ధపు మాటలు చెప్పే సీఎం రేవంత్ పార్టీని గెలిపిస్తారో ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. కష్టకాలంలో సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారని, కానీ మన ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అధికార పార్టీ ఆఫర్ చేసిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్, రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్, ఎంపీ స్థానాలు ఆశ చూపినా కాదని బీఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. కేసీఆర్ 1000 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తే వాటిని అద్భుతంగా తీర్చిదిద్దిన వ్యక్తి ఆర్ఎస్ అన్నారు.

ఆర్ఎస్పీని గెలిపించాలి : నిరంజన్‌రెడ్డి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ అలంపూర్ ప్రజలు ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఆర్ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణను ప్రపంచస్థాయిలో నిలిపిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. నేను పార్లమెంట్‌కు వెళితే నడిగడ్డ ప్రజలందరూ పార్లమెంట్‌కు వెళ్లినట్టేనని అన్నారు. ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ ఆర్ఎస్పీ అన్నను ఆదరించాలని కోరారు. సమావేశంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు దేవర మల్లప్ప, అభిలాష్‌రావు, బైకాని శ్రీనివాసులు పాల్గొన్నారు.

లోకం పోకడ



మీ ప్రచారానికి ప్రసంగాలు సిద్ధం చేశా సార్.. ఇవి దేవుడిపై వేసే ఒట్లు, అవి కేసీఆర్‌ని తిట్టేతిట్లు!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	45.1°c	36.8°c
రంగారెడ్డి	42.9°c	23.1°c
ఆదిలాబాద్	42.8°c	22.7°c
మెదక్	42.1°c	21.5°c
నిజామాబాద్	41.5°c	25.5°c
ఖమ్మం	41.0°c	24.0°c
మహబూబ్‌నగర్	40.1°c	29.3°c
హైదరాబాద్	40.0°c	27.0°c
వరంగల్	40.0°c	26.0°c
కరీంనగర్	39.0°c	27.0°c

తెలంగాణలో భిన్న వాతావరణం

- ఓ వైపు ఎండలు, మరోవైపు వానలు
- మరో వారంపాటు అధిక ఉష్ణోగ్రతలే
- భారత వాతావరణశాఖ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 43 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. మరో వారంపాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుందని భారత వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో కొన్ని రోజులుగా భిన్న వాతావరణం ఉంటున్నది. ఓ వైపు ఎండలు మండుతుండగా, మరోవైపు అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రెండ్రోజుల క్రితం పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లోనూ వర్షం దంచికొట్టింది. భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడే అవకాశం ఉన్నదని, గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపారు. నిజామాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, రామగుండం ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశాలు ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అదే సమయంలో పగటివేళ 36 నుంచి 42 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు వేడి ఉంటుందని చెప్పారు. దక్షిణ తెలంగాణ, తూర్పు తెలంగాణలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో 42 డిగ్రీలకు పైనే ఎండల తీవ్రత నమోదయ్యే చాన్స్ ఉన్నట్టు తెలిపారు. ఇక హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతాయని పేర్కొన్నారు. సాయంత్రానికి వాతావరణం చల్లబడి వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని ఐఎండీ అధికారులు వెల్లడించారు.

నేటినుంచి కేసీఆర్ రోడ్‌షో

మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల్లో పార్టీకి అత్యధిక సీట్లను గెలిపించడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, శ్రేణులకు మార్గనిర్దేశనం చేయనున్నారు. స్థానికంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. తొలిరోజు ఆయన మిర్యాలగూడ, సూర్యాపేట రోడ్‌షోలలో పాల్గొంటారు. అంతకు ముందు బుధవారం మధ్యాహ్నం పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణభవన్‌లోని తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేసి, అక్కడి నుంచి బస్సులో ఎన్నికల ప్రచారానికి బయలుదేరనున్నారు. కేసీఆర్ తొలుత నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చేరుకొని, అక్కడ రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం సూర్యాపేటకు వెళ్లి, అక్కడ కూడా రోడ్‌షో నిర్వహిస్తారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. గురువారం భువనగిరికి చేరుకొని, సాయంత్రం రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం ఎర్రవెల్లికి వెళ్లి అక్కడే బస చేస్తారు. కేసీఆర్ ప్రయాణించే బస్సును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మంగళవారం తెలంగాణభవన్‌లో బస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. రోడ్‌షోలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు దాదాపు వంద మందికి పైగా వలంటీర్లు వెన్నంటి ఉంటారు. ఉద్యమ నాయకుడిగా పాదయాత్ర, సైకిల్‌యాత్ర, బస్సుయాత్రలు చేసిన కేసీఆర్ ప్రతిపక్షంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా బస్సుయాత్ర చేపట్టారు. ఈ నేపథ్యంలో బస్సు యాత్రను పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడం, సరియైన నీటి నిర్వహణ లేక లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోవడం, కరెంటు సరఫరా సరిగా లేకపోవడంతో మోటర్లు కాలిపోతుండటం, ధాన్యానికి రూ.500 బోనస్ అమలు చేయకపోవడం, ఆసరా పింఛన్‌దారులకు రూ.4 వేలు ఇవ్వకపోవడం, మహిళలకు ప్రతి నెలా రూ.2,500 హామీని అమలు చేయకపోవడం తదితర కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కేసీఆర్ దృష్టిసారించనున్నట్టు సమాచారం.



తెలంగాణ భవన్‌లో మంగళవారం తెలంగాణ ప్రగతి రథానికి పూజలు

ఎక్కువ స్థానాలు సాధించడంపైనే గురి

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కనీసం ఎనిమిది సీట్లు గెలుస్తుందని, కొంచెం కష్టపడితే మరో మూడు స్థానాల్లో విజయం సాధిస్తుందని పలు సర్వే సంస్థలు అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తే, రెండు అంకెల స్థానాలు గెలుచుకోవడం సాధ్యమేనని గుర్తించిన గులాబీ బాస్ ఆ దిశగా కార్యాచరణ రూపొందించారు. అన్ని స్థానాల్లో అభ్యర్థులను ముందే ప్రకటించి, నియోజకవర్గాలు, మండలాలవారీగా సమావేశాలు నిర్వహించడం కూడా పూర్తయ్యింది. ఒక వైపు రోడ్‌షోలకు తోడుగా క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని పార్టీ నేతలు భావిస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు కలవరపాటు

కేసీఆర్ 17 రోజుల టూర్ షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి కాంగ్రెస్, బీజేపీలో కలవరపాటు నెలకొన్నది. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణానికి, కేసీఆర్ పర్యటన అనంతరం రాజకీయ సమీకరణల్లో స్పష్టమైన తేడా ఉంటుందని వివిధ పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. బీఆర్ఎస్ విడుదల చేసిన టూర్ షెడ్యూల్ ప్రకారం.. సూర్యాపేట, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లా కేంద్రాలతోపాటు రామగుండం, కొత్తగూడెం, వీణవంక ప్రాంతాల్లోనూ కేసీఆర్ బస చేయనున్నారు. కేసీఆర్ పాల్గొనే ఒక రోడ్‌షోకు, మరో రోడ్‌షోకు మధ్య దాదాపు 10 నుంచి 12 గంటల సమయం ఉంటుంది. ఉద్యమ సమయంలో తెలంగాణ అంగుళం, అంగుళం కలియతిరిగిన కేసీఆర్‌కు పార్టీలు, వర్గాలకు అతీతంగా ప్రతి పట్టణంలో కనీసం 100 నుంచి 200 మందిని పేరు పెట్టి పిలిచేంత చనువు ఉన్నదని, వారంతా ప్రభావిత వర్గాలకు ప్రతినిధులని, వారి మీద కేసీఆర్ బస్సు యాత్ర ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. 'మా ప్రాంతానికి చాలా రోజుల తరువాత సారొస్తున్నరు. మాకు చాలా సంతోషంగా ఉన్నది. సారు మేం కలిసి మా కష్టసుఖాలు చెప్పుకుంటాం' అని మహబూబాబాద్‌కు చెందిన పార్టీ కార్యకర్త పేర్కొనడం గమనార్హం. 'తెలంగాణ వ్యాప్తంగా కేసీఆర్‌కు ఆప్తమిత్రులు ఉన్నారు. వారికి రాజకీయ పార్టీలతో పని లేదు. తెలంగాణ సమాజహితమే వారికి ముఖ్యం. అటువంటివారు అనేకమంది కారణాంతరాల వల్ల కాస్త దూరంగా ఉన్నారు. మళ్లీ కేసీఆర్ వస్తున్నారని తెలియగానే అందరిలో సంతోషం కలిగింది' అని ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగి ఒకరు పేర్కొనడం విశేషం. మరోవైపు, కేసీఆర్ తమ ప్రాంతంలోనే బసచేయడమే కాకుండా ఎక్కువ సమయం ఉండటం వల్ల తమ విజయావకాశాలపై ప్రభావం చూపిస్తుందని, దీనితో తమ గెలుపు ఖాయమైపోయినట్టేనని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. కేసీఆర్ చేసే దిశానిర్దేశం ప్రత్యర్థుల ఎత్తులను చిత్తుచేస్తుందనే ధీమా బీఆర్ఎస్ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నది.

జన యాత్రికుడు బీఆర్ఎస్ అధినేత

కేసీఆర్ 17 రోజులపాటు చేపట్టనున్న బస్సుయాత్ర, రోడ్‌షోలపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. కేసీఆర్ తలపెట్టిన పర్యటనను బస్సుయాత్ర, రోడ్‌షో, జనయాత్ర.. పేర్లతో పిలుస్తున్నారు. 'కేసీఆర్ ఏం చేసినా సంచలనమే..' అన్నట్టుగా రెండున్నర దశాబ్దాలుగా ఆయన చుట్టూనే రాజకీయాలు తిరుగుతున్నాయి. 2003 మార్చి 27న రాష్ట్ర సాధనే ధ్యేయంగా తెలంగాణ ఆకాంక్ష హస్తినను బలంగా తాకాలన్న తలంపుతో హైదరాబాద్ నుంచి 1,000 కార్లతో ఢిల్లీకి కారు ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు మార్గమధ్యంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోని ప్రజలకు, పార్టీలకు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను తెలియపరచాలనే లక్ష్యంతో చేపట్టిన ఆ యాత్ర దేశంలో సంచలనం సృష్టించింది.

- ఫ్లోరైడ్ రక్కసితో అల్లాడుతున్న నల్లగొండ దయనీయస్థితిని ప్రపంచానికి తెలపాలన్న లక్ష్యంతో 2003లో కేసీఆర్ పాదయాత్ర చేపట్టారు. చౌటుప్పల్, నారాయణపురం, కొత్తగూడెం, వావిళ్లపల్లి, అంతంపేట, మర్రిగూడ, నాంపల్లి, చండూరు, కనగల్ మీదుగా నల్లగొండ వరకు కేసీఆర్ పాదయాత్ర చేశారు.
- 2003 మే 20 నుంచి 25 వరకు అలంపూర్ నుంచి గద్వాల వరకు చేపట్టిన పాదయాత్రతో పాటు ఇదే సంవత్సరంలో హాలియా నుంచి నాగార్జునసాగర్ వరకు చేపట్టిన పాదయాత్ర సమయంలోనూ కేసీఆర్ పల్లెల్లోనే బసచేశారు.

తెలంగాణ జైత్రయాత్ర: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిన తరువాత రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్‌లో ఏప్రిల్ 27న నిర్వహించిన తెలంగాణ జైత్రయాత్ర సభ అపూర్వ విజయం సాధించింది. ఈ సభకు మాజీ ప్రధాని దేవేగౌడ, కేంద్ర మాజీ మంత్రి అజిత్‌సింగ్ హాజరయ్యారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవడం, యూపీఏ కనీస ఉమ్మడి ప్రణాళికలో, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ అంశాన్ని చేర్చడం వెనుక ఈ సభ కీలకమలుపుగా నిలిచింది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ సభకు సిద్దిపేట నుంచి వరంగల్‌కు కేసీఆర్ సైకిల్‌యాత్ర చేశారు. అయితే, ఆ రోజు కేసీఆర్ తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, ముందే ప్రకటించిన విధంగా ఆయన సైకిల్‌యాత్రను కొనసాగించడం విశేషం.

- తెలంగాణ గ్రామీణ ప్రాంత ప్రజలతో మమేకం అయ్యేందుకు కేసీఆర్ పల్లెనిద్ర, తండానిద్ర కార్యక్రమాలు చేపట్టారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి, పట్టణప్రగతి కార్యక్రమాల రూపకల్పనకు పల్లెనిద్ర, తండానిద్రలాంటి కార్యక్రమాలే ప్రేరణగా నిలిచాయి. తండా నిద్రలో భాగంగా 2008 ఏప్రిల్‌లో వచ్చిన ఉగాది పండుగను కూడా కేసీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం జామతండాలనే జరుపుకున్నారు. 2001 నుంచి 2014 దాకా కేసీఆర్ హైదరాబాద్, సిద్దిపేటలోని తన నివాసాల్లో కాకుండా అనేక తెంగాణ ప్రాంతాల్లో బసచేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత సైతం పలు సందర్భాల్లో అదే ఒరవడిని కొనసాగించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో వరంగల్, కరీంనగర్ సహా అనేక ప్రాంతాల్లో అనేక రోజులు కేసీఆర్ బస చేశారని పార్టీ నేతలు గుర్తుచేసుకుంటున్నారు.



మంగళవారం రిటర్నింగ్ అధికారి శశాంకకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చిత్రంలో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికపూడి గాంధీ, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్



ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు. చిత్రంలో ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, మాజీ మంత్రి జోగు రామన్న



నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి మంగళవారం ఇండిపెండెంట్‌గా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్‌కు అందజేస్తున్న శిరీష(బర్రెలక్క). చిత్రంలో ఆమె భర్త వెంకటేశ్, అత్త బక్కమ్మ, బావ చిట్టిబాబు

సీఎం రేవంత్‌కు ఓటమి భయం

- ప్రజలు నమ్మరనే దేవుళ్లపై ఒట్లు
- కేసీఆర్‌తోనే తెలంగాణకు రక్ష
- నల్లగొండలో బీఆర్ఎస్‌దే గెలుపు
- నేటినుంచి కేసీఆర్ బస్సు యాత్ర
- కృష్ణారెడ్డి నామినేషన్ ర్యాలీలో జగదీశ్‌రెడ్డి



నల్లగొండ ఎన్నికల అధికారి హరిచందనకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, పక్కన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, రవీంద్రకుమార్

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్23(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేకే మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారని విమర్శించారు. కానీ, ఎంతమంది దేవుళ్లపై ఒట్లు వేసినా ఈసారి ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే రైతుబంధు ఇచ్చేందుకు కేసీఆర్ 10 వేల కోట్లను సిద్ధం చేసి పెడితే అడ్డుకొని ఎన్నికల తర్వాత వాటిని కాంట్రాక్టర్లకు చెల్లించి వాళ్ల నుంచి కమీషన్ల రూపంలో ఢిల్లీకి కప్పం చెల్లించారని ధ్వజమెత్తారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రేవంత్‌రెడ్డి దుర్భాషతో కాలయాపన చేస్తున్నారని, సీఎం హోదాలో ఆయన వ్యాఖ్యలను ప్రజలు ఈసడించుకుంటున్నారని చెప్పారు.

కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటే

కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటేనని, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న మాటలే నిదర్శనమని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. గుజరాత్‌లో మోదీపాలన తనకు ఆదర్శమన్న రేవంత్‌రెడ్డి మోదీకి రాష్ట్రంలో ప్రథమ శిష్యుడని పేర్కొన్నారు. మోదీని పల్లెత్తు మాట అనకుండా కేవలం కేసీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేస్తున్నాడని చెప్పారు. తెలంగాణ హక్కులు కాపాడుకోవాలన్నా, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న కేసీఆర్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ సర్కార్ మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బుధవారం మిర్యాలగూడ, సూర్యాపేటలో జరిగే కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నల్లగొండలో బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డి గెలుపు ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నల్లగొండ జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగులు, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్‌కుమార్, తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఇస్లావత్ రాంచంద్రనాయక్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ మంత్రులు తాగి ఎక్కడున్నారు?

నల్లగొండ జిల్లాలో రైతులు, ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే జిల్లా మంత్రులు తాగి ఎక్కడున్నారని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతానన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డినే రైతులు చెప్పుతో కొట్టే పరిస్థితి వచ్చిందని చెప్పారు. రైతులకు దక్కాల్సిన మద్దతు ధర విషయంలో మిల్లర్లతో కుమ్మక్కై మంత్రులు రైతులకు ఎగనామం పెడుతున్నారని ధ్వజమెత్తారు. రైతులకు ఇవ్వాల్సిన రూ.500 బోనస్‌ను వ్యాపారులకు కట్టబెట్టడం కాంగ్రెస్ సర్కారుకే చెల్లిందని విమర్శించారు. నాగార్జునసాగర్‌లో నీళ్లున్నా ఇవ్వలేక మూడున్నర లక్షల ఎకరాల పంట చేలను ఎండబెట్టిన ఘనత జిల్లా మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిదేనని ఆరోపించారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు కష్టాలు

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్



మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23: కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజలకు కష్టాలు తెచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ ఎంపీ క్యాంప్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి మాలోత్ కవిత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వంలో గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పారు. ఈ ప్రాంతంలో గిరిజనుల కోసం మెడికల్ కళాశాల, హార్టికల్చర్, నర్సింగ్, ఇంజినీరింగ్ కళాశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అనేక వాగ్దానాలు చేసి ప్రజలను నట్టేట ముంచిందని, తండాల్లో ప్రతి ఒక్కరూ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే సీఎం రేవంత్‌రెడ్డిపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. వివిధ మతాల మధ్య బీజేపీ చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ మండు వేసవిలో ఎస్సారెస్పీ కాలువల ద్వారా చెరువులను నింపిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్‌లు అంగోతు బిందు, బడే నాగజ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, బానోత్ శంకర్ నాయక్, పెద్ది సుదర్శన్ రెడ్డి, హరిప్రియనాయక్, రేగా కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో నామినేషన్ పత్రాలను ఆర్వో అద్వైతకుమార్‌సింగ్‌కు అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత. చిత్రంలో ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ములుగు జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి